




Truth of News

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మహ్మద్ షఫీ అహ్మద్



IRS PUBLICATIONS
irspublications12@gmail.com



మంగళవారం, 23 జూలై 2024 | విజయవాడ | సంపుటి 1 | సంచిక 46 | పేజీలు 8+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi


# దెబ్బతిన్న ఎపిని పునరుజ్జీవింపచేస్తాం

## గత ఐదేళ్లలో విధ్వంసపాలనతో అభివృద్ధి కుదేలు


**60శాతం మేరకు తగ్గిన మూలధన వ్యయం**

**మూడు రాజధానుల పేరుతో అమరావతి విధ్వంసం**

**యువత, నిరుద్యోగుల్లో తీవ్ర నిరాశా, నిస్పృహలు**

**రాష్ట్రాన్ని గాడిలోపెట్టడమే తమ ముందున్న లక్ష్యం**

**ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ప్రసంగం**



అమరావతి,జూలై22(సూర్యవాస్తవం): ఆంధ్రప్రదేశ్ సమ్మిళిత అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ తెలిపారు. సీఎం చంద్రబాబు విజనరీ నాయకుడని కొనియాడారు. అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఉభయ సభలనుద్దేశించి ఆయన ప్రసంగించారు. విభజన వల్ల ఏపీకి నష్టం కలిగింది. రాజధాని హైదరాబాద్‌ను కోల్పోయాం. 2014లో చంద్రబాబు సీఎం అయ్యాక ఏపీ అభివృద్ధి, రాజధాని నిర్మాణానికి ఆయన తీవ్రంగా కృషి చేశారు. 2014-19 మధ్య రాష్ట్రంలో పెట్టుబడుల వరద కొనసాగింది. 2019లో వైకాపా అధికారంలోకి వచ్చాక అన్ని రంగాలు నష్టాలను చవిచూశాయి. ఎన్నికల పక్రియలో ప్రజలు చురుగ్గా పాల్గొన్నారు. మార్పు కావాలని ప్రజలు ఆకాంక్షించారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే బాధ్యత సభ్యులపై ఉందని గవర్నర్ అన్నారు. గత ప్రభుత్వ ప్రతీకార రాజకీయాలకే ప్రాధాన్యత ఇచ్చిన ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధిని పట్టించుకోలేదు. రాష్ట్ర మూలధన వ్యయం 60 శాతం మేరకు తగ్గింది. జల వనరులు, రవాణా, రోడ్లు, భవనాలు వంటి శాఖలను నిధుల కొరత వెంటాడుతోంది. ఫలితంగా జల వనరులపై మూలధన వ్యయం 56 శాతం మేరకు తగ్గింది. రోడ్లు, భవనాల్లో 85 శాతానికి తగ్గింది. రాష్ట్ర సొంత పన్ను

మిగతా 2లో..

## కేంద్ర బడ్జెట్లో... తెలుగు రాష్ట్రాలకు ప్రాధాన్యత దక్కేనా..?

### ఏపీకి హోదా ఊసే లేదా..? ఎన్డీఏతో లాలూచీ ఎందుకు..?

### హోదా సాధనకు కాంగ్రెస్ గట్టి పట్టు..

**దేశ ప్రజలంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు మరికాసేపట్లో ప్రారంభం కానున్నాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతా రామన్ ఏడోసారి కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశ పెట్టేందుకు సిద్ధమయ్యారు. బడ్జెట్‌లో తెలుగు రాష్ట్రాలకు ప్రాధాన్యత దక్కే అవకాశం ఉంది.. ఈసారి కేంద్ర బడ్జెట్‌లో తెలుగు రాష్ట్రాలకు ప్రాధాన్యత క్రమంలో నిధులు కేటాయించే అవకాశమై కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది.**

సూర్యవాస్తవం, ప్రతినిధి,న్యూఢిల్లీ: కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం కీలక భాగస్వామిగా ఉన్న టీడీపీ.. ఏపీ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు, ప్రాజెక్టులు కేటాయించాలని కేంద్రం పై ఒత్తిడి పెంచుతొంది. ఈ క్రమంలో ఏపీ సీఎం చంద్రబాబు ఇప్పటికే ప్రధాని మోదీ సహా కేంద్ర పెద్దలను నేరుగా కలిసి విజ్ఞప్తి చేశారు. కానీ రాష్టానికి ప్రత్యేక హోదా విషయమై చంద్రబాబు పెద్దగా ఈ మారు కూడా దృష్టి సరించేలా లేరు. కేంద్ర సర్కారు మనసెరిగి ముందుకు సాగుతు న్నారు. పోలవరం, అమరావతి రాజధాని అంశాలకు మాత్రమే బాబు ప్రాధాన్యత నిస్తున్నారు. వాటి ముందడుగు సరిపడా నిధులిస్తే చాలనే యోచనలో ఉన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మాత్రం కొంచెం అటుఇటుగా హోదా పల్లవి.,

మిగతా 2లో..

## నీట్ పేపర్ లీకేజీపై లోక్‌సభలో దుమారం

**పరీక్షల వ్యవహారం మొత్తం ఒక 'ఫ్రాడ్'గా మారింది**

**పరీక్షా విధానంలో చాలా తీవ్రమైన సమస్య ఉంది**

**అధికార పక్షాన్ని దులిపేసిన విపక్షనేత రాహుల్**

**విపక్షాల విమర్శలను తిప్పికొట్టిన మంత్రి ధర్మేంద్రప్రధాన్**



న్యూఢిల్లీ,జూలై22(): పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ప్రారంభం రోజే 'నీట్' పేపర్ లీక్ అంశంపై అధికార పక్షాన్ని విపక్షాలు నిలదీశాయి. పేపర్ లీక్ అనేది తీవ్రమైన సమస్య అని, దీనికి విద్యాశాఖ మంత్రి బాధ్యత వహించాలని విపక్ష నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. పశ్నాపత్రాల లీకేజీ వల్ల విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని, దేశంలో పరీక్షల వ్యవహారం మొత్తం ఒక 'ఫ్రాడ్'గా మారిందన్నారు. డబ్బున్నోళ్లు విద్యావ్యవస్థను కొనేస్తున్నారని లక్షలాది మంది ప్రజలు నమ్ముతున్నారని, విపక్షాల అభిప్రాయం కూడా ఇదేనని స్పష్టం చేశారు. దీనికి మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

మిగతా 4లో..

## సభలో విపక్షాలు సమయాన్ని వృధా చేస్తున్నాయ్

**సమస్యలను ప్రస్తావించకుండా అడ్డుకునే యత్నాలు**

**బడ్జెట్ సమావేశాలు సజావుగా సాగాలని ఆకాంక్ష : మోడీ**



న్యూఢిల్లీ,జూలై22(సూర్యవాస్తవం): కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన తరువాత ఎన్డీయే సర్కార్ తొలి బడ్జెట్‌ను మంగళవారం ప్రవేశపెట్టబోతోంది. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మీడియాతో మాట్లాడారు. పార్లమెంటు విలువైన సమయాన్ని ప్రతిపక్షాలు వృధా చేస్తున్నాయని ఆయన విమర్శించారు. 'నేను బరువెక్కిన హృదయంతో చెబుతున్నా... కొందరు ఎంపీలు, ఇతరులను తమ నియోజకవర్గ సమస్యలపై సభలో మాట్లాడే సమయం ఇవ్వకుండా చేస్తున్నారు. రాజకీయ విభేదాలను పక్కనబెట్టి నిర్మాణాత్మక చర్చల్లో పాల్గొనాలి. సభలో నిరసనలు

మిగతా 2లో..

## గవర్నర్ ప్రసంగంతో అసెంబ్లీ సమావేశాలు

**ఐదురోజుల పాటు సమావేశాల నిర్వహణ**

**బిఎసి సమావేశంలో నిర్ణయం**

**సమావేశానికి వైకాపా గైర్హాజరు**

**గవర్నర్‌ను రాచమార్గంలో రప్పించామన్న స్పీకర్**

**ప్లకార్డులతో అసెంబ్లీలోకి ప్రవేశించే యత్నం**

**జగన్‌ను అడ్డుకున్న పోలీసులు**

**పోలీసులపై వేలెత్తి చూపుతూ జగన్ ఆగ్రహం**



అమరావతి,జూలై22(సూర్యవాస్తవం): ఏపీ అసెంబ్లీ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. గవర్నర్ ప్రసంగం అనంతరం సభ మంగళవారానికి వాయిదా పడింది. అనంతరం స్పీకర్ అయ్యన్న పాత్రుడు అధ్యక్షతన బీఏసీ సమావేశం పూర్తయింది. ఈ సమావేశానికి హాజరైన సీఎం చంద్రబాబు, పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్, విష్ణు కుమార్ రాజు హాజరయ్యారు. సమావేశాల అజెండాను బీఏసీ ఖరారు చేసింది. 5 రోజుల పాటు సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. కాగా సభలో శ్వేత పత్రాలను విడుదల చేసేలా అధికార పక్షం ప్రతిపాదించింది. కాగా బీఏసీ సమావేశానికి వైసీపీ సభ్యులు గైర్హాజరు అయ్యారు.

మిగతా 2లో..

## నీట్ అవకతవలకపై సుప్రీంలో విచారణ

**ఒకే ప్రశ్నకు రెండు సమాధానాలపై చర్చ**

**ముగ్గురు నిపుణులతో నేడు సమాధానం ఇవ్వాలన్న ధర్మాసనం**

**మే 4కు ముందే పేపర్ లీకేజీ జరిగినట్లు సిజెఐ అనుమానం**

**విచారణ నేటికి వాయిదా**

న్యూఢిల్లీ,జూలై22(సూర్యవాస్తవం): నీట్-యూజీ 2024 పరీక్ష పత్రం లీకేజీ, అవకతవకలపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు సోమవారం మరోసారి విచారణ జరిపింది. ఈ సందర్భంగా నీట్- యూజీ పరీక్షలో వచ్చిన ఓ ప్రశ్న విషయంలో తీవ్ర చర్చ జరిగింది. ఒకే ప్రశ్నకు రెండు సరైన సమాధానాలు ఇచ్చారని,

మిగతా 4లో..

## దేశ ఆర్థికవృద్ధి 6.5నుంచి 7శాతం

2026 నాటికి ధరల సూచిని 4.1 శాతానికి తగ్గించే లక్ష్యం

కల్తీ, అనారోగ్యకరమైన ఆహారమే వ్యాధులకు కారణం

అంచనావేసిన ఆర్థికసర్వే.. పార్లమెంట్‌కు సమర్పణ

న్యూఢిల్లీ,జూలై22(సూర్యవాస్తవం): కేంద్ర బడ్జెట్ 2024..ప్రవేశపెట్టే ముందు.. ఆర్థిక సర్వేను పార్లమెంట్ లో ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశ పెట్టారు. తేదీ లోక్ సభలో

మిగతా 2లో..

## పోలవరంపై కీలక ముందడుగు

రూ. 12వేల కోట్ల ప్రతిపాదనలకు కేంద్రం అంగీకారం

మోడీ సహకారంతో సవాళ్లను అధిగమిస్తున్నాం

మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడి

న్యూఢిల్లీ,జూలై22(సూర్యవాస్తవం): ఆంధ్రప్రదేశ్ జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం విషయంలో కీలక ముందడుగు పడింది. పోలవరం ప్రాజెక్ట్ మొదటి దశ నిర్మాణానికి రూ. 12 వేల కోట్ల ప్రతిపాదనలకు కేంద్రం అంగీకారం తెలిపింది. కేంద్ర కేబినెట్ ఆమోదంతో ప్రతిపాదనలకు కార్యరూపం దాల్చింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు ఓ ప్రకటనలో తెలిపింది. ఈ పరిణామంతో శరవేగంగా పనులు జరగనున్నాయి. కూటమి సర్కార్‌కు ఇదొక తియ్యటి కబురే అని చెప్పుకోవచ్చు. ఈ ప్రకటన తర్వాత.. ఏపీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మీడియాతో మాట్లాడుతూ..

మిగతా 2లో..

## ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావద్దు

**వైసిపి హయాంలో ఇష్టారీతిలో ఇసుకరీచ్‌లు దోచారు**

ఉచిత ఇసుక విషయంలోనూ జోక్యంచేసుకోవద్దు

ఎన్డీయే ఎమ్మెల్యేలకు సిఎం చంద్రబాబు హితవు

అమరావతి,జూలై22(సూర్యవాస్తవం): ఎన్డీయేలోని ఎమ్మెల్యేలు, మంత్రులు ఎవ్వరూ కూడా రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. వైసీపీ హయాంలో ఇష్టారీతిగా ఇసుక రీచ్‌లు కట్టబెట్టారని, ఇష్టం వచ్చినట్లు రవాణా చేసి సొమ్ము చేసుకున్నారని చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో ఇక నుంచి

మిగతా 2లో..

## జగన్‌కు ఇంకా తత్వం బోధపడలేదు- తానే సీఎం అనుకుంటున్నారేమో?: పవన్ కల్యాణ్



అమరావతి,జూలై22(సూర్యవాస్తవం): ఎన్డీఏ శాసనసభ పక్ష సమావేశంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. జగన్ తీరును పవన్ తీవ్రంగా తప్పుబట్టారు. జగన్‌కు ఇంకా తత్వం బోధ పడలేదని మండిపడ్డారు. నెల రోజుల్లోనే ప్రభుత్వం పై విమర్శలు చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా జగన్‌కు ఇంకా తత్వం బోధపడినట్లు లేదని కూటమి శాసనసభ పక్ష సమావేశంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. జగన్ తీరును ఆయన తీవ్రంగా

మిగతా 2లో..

## మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అగ్నిప్రమాదం

**పూర్తిగా దగ్ధంఅయిన రికార్డులు**

**అసెంబ్లీలో సమీక్షించిన సిఎం చంద్రబాబు**

**వెంటనే విచారణకు ఆదేశం**

**సంఘటనా స్థలానికి డిజిపి, సిఐడి చీఫ్**

**ఉద్యోగి గౌతమ్‌పై అనుమానాలతో అరెస్ట్**



అమరావతి,జూలై22(సూర్యవాస్తవం): అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో అగ్నిప్రమాదంపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనపై అత్యవసర విచారణకు ఆదేశించారు. వెంటనే ఘటనాస్థలికి హెలికాప్టర్‌లో వెళ్లాలని డీజీపీ ద్వారకా తిరుమలరావుకు ఆదేశాలు జారీ చేశారు. సిఎం ఆదేశాలతో డీజీపీ, సీఐడీ చీఫ్ మదనపల్లెకు బయలుదేరారు. అగ్నిప్రమాదంలో కీలక దస్త్రాలు కాలిపోయినట్లు సమాచారం. నూతన సబ్‌కలెక్టర్ బాధ్యతలు చేపట్టడానికి కొన్ని గంటల ముందే

మిగతా 2లో..

## సబ్ కలెక్టరేట్ లో ఫైళ్ల దగ్ధంలో కుట్ర కోణం..

**యాక్సిడెంటల్ గా జరగలేదు ఇన్సిడెంట్ అని నిర్ధారణకొచ్చాం..**

**ఆయా శాఖల అధికారులను అన్ని కోణాల్లో విచారించాం**

**10 బృందాలతో దర్యాప్తు వేగవంతం చేస్తున్నాం**

**ఎవరెవరు వచ్చారు.. ఆదివారం రోజు ఇక్కడ ఎందుకు పని చేశారన్నదానిపైన ఆరాతీస్తున్నాం**

**కొత్త బిల్డింగులో వైరింగ్ నాణ్యత బాగుంది, అంత ప్రమాదం జరిగినా నాణ్యత ప్రమాణాలతో కూడిన రాగి వైరు కాలలేదు**

**మదనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని భూములు, పాస్ బుక్కులు వివరాలు తాసిల్దార్ కార్యాలయంలో మరో ఫైలు ఉంటుంది.**

**ఇక్కడ ఫైళ్లు కాలిపోయిన తాసిల్దార్ కార్యాలయంలో మరో ఫైలు సేకరించి రికార్డులు పదిలం చేస్తాం**

**గతంలో ఇక్కడ పనిచేసిన అధికారులపై అనుమానం ఉంది**

**డిసిపి ద్వారక తిరుమలరావు, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి**

మదనపల్లె మేజర్ న్యూస్ : మదనపల్లె సబ్ కలెక్టరేట్ లో ఫైళ్ల దగ్ధం వెనుక కుట్ర కోణం దాగి వుంది. ఇన్సిడెంట్ వల్ల జరిగిందే కానీ యాక్సిడెంట్ జరిగి కీలక ఫైళ్లు దగ్ధం అయ్యాయని నిర్ధారణకు వచ్చినట్లు సోమవారం సాయంత్రం రాష్ట్ర డీసీపీ ద్వారక తిరుమల రావు అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి మీడియాఎదుట మదనపల్లె సబ్ కలెక్టరేట్లో జరిగిన ఫైళ్లదగ్ధం వివరాలను వెల్లడిం చారు. ఘటన వెనక కుట్ర కోణం దాగి ఉందండంతో ఆయా శాఖల అధికారులతో అన్ని కోణాల్లో విచారించామన్నారు. కీలక ఫైళ్ళు దగ్ధం పక్క ఇన్సిడెంట్ గా నమ్ముతున్నామని తెలిపారు. ఎవరెవరు వచ్చారు ఎందుకు ఇక్కడ ఆదివారం రోజు ఇక్కడ పని చేశారని దానిపైన ఆరా తీస్తున్నామని తెలిపారు. కొత్త బిల్డింగులో వైరింగ్ నాణ్యత బాగుంది, నాణ్యత ప్రమాణాలతో కూడిన రాగి వైరు కాలకుండా ఉందన్నారు. మదనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని భూములు, పాస్ బుక్కులు వివరాలు తాసిల్దార్ కార్యాలయంలో మరో ఫైలు ఉంటుందని, ఇక్కడ ఫైళ్లు కాలిపోయిన తాసిల్దార్ కార్యాలయంలో మరో ఫైలు సేకరించి డాక్యుమెంట్లను సిద్ధం చేస్తాంమని కలెక్టర్ పేర్కొన్నారు.

మిగతా 2లో..



## వైఎస్ వివేకా హత్య కేసు..

**శివశంకర్ రెడ్డి బెయిల్ రద్దు పిటిషన్ పై సుప్రీంకోర్టులో విచారణ**

**శివశంకర్ రెడ్డి బెయిల్ రద్దు చేయాలంటూ సునీత పిటిషన్**

**ఈ కేసులో తాము ఇంకా కౌంటర్ దాఖలు చేయలేదన్న సీబీఐ**

**రెండు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని సుప్రీం ఆదేశం**

న్యూఢిల్లీ/పులివెందుల వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడు శివశంకర్ రెడ్డి బెయిల్ రద్దు పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఈరోజు విచారణ జరిపింది. శివశంకర్ రెడ్డి బెయిల్ ను రద్దు చేయాలని కోరుతూ వివేకా

మిగతా 2లో..



## తెలుగు రాష్ట్రాల్లో పొంగుతున్న వాగులు

గోదావరికి ఉధృంతగా వరదనీరు


పరీవాహకాల్లోని ప్రాజెక్టుల్లో జలకళ

శ్రీశైలానికి ఉరకలెత్తుతున్న కృష్ణా ప్రవాహం

గోదావరి వరదపై మంత్రి పొంగులేటి సమీక్ష

విజయవాడ/హైదరాబాద్,జూలై22(సూర్యవాస్తవం): ఉభయ తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలకు వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రధాన నదులు కృష్ణా, గోదావరులు పొంగుతున్నాయి. ప్రధానంగా గోదావరికి వరద పోటెత్తుతోంది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గత మూడు రోజులుగా ప్రాణహిత, ఇంద్రావతి, తాలిపేరుల నుంచి వరద వచ్చి చేరుతోంది. తెలంగాణలోని

మిగతా 3లో..



## జగన్ రెడ్డి మాటలు.. దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది

**దమ్ముంటే జగన్ రెడ్డి వాళ్ల బాబాయి హత్యపై ఢిల్లీలో ధర్నాచేయాలి**

**నిజంగా ప్రజాస్వామ్యం కోరే నాయకులు అయితే వివేకా హత్యపై సీబీఐ ఎంక్వైరీ కోరాలి**

**డ్రైవర్ ను చంపి డోర్ డెలివరి చేసిన వ్యక్తి కూడా ప్లకార్డులు పట్టుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలనడం సిగ్గుచేటు**

**కక్ష పూరితంగా వెళ్లాలంటే మా నాయకుడు కనుసైగ చేస్తే చాలు**

**వైసీపీ నేతలు కవ్వింపు చర్యలకు దిగుతున్నారు**

**టీడీపీ నేతలు సహనంతో ఉండాలి**

**ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి నిత్యం అందుబాటులో ఉంటాం**

**మీడియా సమావేశంలో మంత్రి గుమ్మడి సంధ్యారాణి**

3లో

## సబ్ కలెక్టరేట్ లో ఫైళ్ల దగ్ధంలో కుట్ర కోణం..

మొదటిపేజీ తరువాయి..

అయితే గతంలో ఇక్కడ పనిచేసిన అధికారులపై అనుమానం ఉందని తెలిపారు. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో అగ్నిప్రమాదం ఘటనపై సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారన్నారు. వారి ఆదేశంతో సిఐడి చీఫ్, అన్నమయ్య జిల్లా కలెక్టర్, ఉద్దేశ్య పూర్వకంగా భూములకు సంబంధించిన కీలక ఫైళ్ళు దగ్ధంపై వెంటనే విచారణ చేపట్టి అగ్నిప్రమాద ఘటనపై



ప్రభుత్వం అత్యవసర విచారణ చేపట్టిందని తెలిపారు. కీలక ఫైళ్ళు అగ్ని ప్రమాదంలో దగ్ధం అయ్యాయని సమాచారం. నూతన సబ్ కలెక్టర్ బాధ్యతలు చేపట్టడానికి గంటల ముందే ఈ ఘటన ఘటనను అత్యంత సీరియస్ గా తీసుకున్న ప్రభుత్వం.. అగ్నిప్రమాదమా, కుట్ర పూరితమా అనే అంశంలో విచారణ చేయాలని అధికారులను ఆదేశించింది. ఉద్దేశ్య పూర్వకంగా భూములకు సంబంధించి కీలక ఫైల్స్ దగ్ధం చేశారనే ఆరోపణలపై తీవ్రంగా స్పందించిన సీఎం చంద్రబాబు.. వెంటనే ఘటనా స్థలానికి హెలికాప్టర్ లో వెళ్లాలని డీజీపీకి ఆదేశాలు జారీ చేయడంతో డీజీపీ, సిఐడీ చీఫ్ జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ మదనపల్లికి చేరుకొని ప్రతి బృందాలతో ప్రత్యేక దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఘటనపై వేలుముద్ర డిపులులు, జాగిలాలతో ఆధారాలు



సేకరించినట్లు పేర్కొన్నారు. సీసీ కెమెరాలు, సెలవు దినమైన ఆదివారం ఇక్కడికి ఎవరెవరు వచ్చారు. అన్న కోణంలో లోతుగా దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఫైళ్ల దగ్ధం వెనుక మదనపల్లె సత్యం పరిధిలో ఓటిటి, %శ్రీ% చుక్కల భూముల కొట్ల రూపాయల వి అన్యాక్రాంతం అయ్యాయని వాటిపై %శ్రీ% దృష్టి సారించడం జరిగింది అన్నారు. %ట% వాస్తవాలు ఏమిటది త్వరలోనే నీకు తెలుస్తామని. %ట% నిందితులు ఎంతటి వారైనా వదిలిపెట్టబోమని వారు స్పష్టం చేశారు.

## మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అగ్నిప్రమాదం

మొదటిపేజీ తరువాయి..

ఈ ఘటన చోటు చేసుకోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో అగ్నిప్రమాదమా? కుట్రపూరితమా? అనే అంశంపై విచారణకు సీఎం ఆదేశించారు. ఈ ఘటనలో ఉద్దేశపూర్వకంగానే భూముల దస్త్రాలు తగలబెట్టారని ఆరోపణలు వస్తున్నాయి. ఆదివారం అర్ధరాత్రి మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో అగ్నిప్రమాదం జరిగింది. ఇందులో విలువైన రెవెన్యూ రికార్డులు, కంప్యూటర్లు, సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. కార్యాలయం సిబ్బంది విషయం తెలుసుకుని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక కేంద్రం పక్కనే ఉండటంతో హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటలను అదుపుచేశారు. అయితే ఈ మంటల్లో విలువైన రెవెన్యూ రికార్డులు దగ్ధమైనట్లు తెలుస్తోంది. ఇదే కార్యాలయంలో పనిచేసే గౌతమ్ అనే ఉద్యోగి కార్యాలయంలో రాత్రి 12 గంటల వరకు ఉన్నట్లు సమాచారం. అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్, జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, ఏఎస్పీ రాజకుమార్ ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో అగ్నిప్రమాదంపై సీఎం చంద్రబాబు అసెంబ్లీలోనే సమీక్ష నిర్వహించారు. తన ఛాంబర్‌లో ఉన్నతాధికారులతో ఆయన సమావేశమయ్యారు. సమీక్షకు సీఎస్ నీరభ్ కుమార్ ప్రసాద్, ఇంటెలిజెన్స్ చీఫ్ మహేశ్ చంద్ర లడ్హా, సీఎంవో అధికారులు హాజరయ్యారు. అగ్నిప్రమాదంలో అసైన్డ్ భూముల దస్త్రాలు దగ్ధమైనట్లు ప్రాథమిక సమాచారం. ఈ నేపథ్యంలో సీఐడీ చీఫ్, డీజీపీ సహా సమస్త వివరాలు బయటకు తీయాలని చంద్రబాబు ఆదేశించారు. అన్నమయ్య జిల్లా కలెక్టర్‌తో చంద్రబాబు ఫోన్‌లో మాట్లాడారు. రాత్రి 11.24 గంటలకు ప్రమాదం జరిగినట్లు ఆయనకు జిల్లా అధికారులు వివరించారు. ఘటనపై జిల్లా అధికారుల సత్వర స్పందన లేకపోవడంపై సీఎం ఆరా తీశారు.ఆదివారం అర్ధరాత్రి వరకు కార్యాలయంలో గౌతమ్ అనే ఉద్యోగి ఉన్నట్లు గుర్తించారు. ఆ సమయం వరకు ఎవరెవరు ఉన్నారనేది కారణాలు తెలుసుకోవాలని చంద్రబాబు ఆదేశించారు. ఉద్యోగి ఎందుకు వెళ్లాడు.. ఏ పని కోసం వెళ్లాడు? అనే వివరాలను అడిగారు. ఘటన జరిగిన సమయంలో విధుల్లో గౌతమ్ ఉన్నాడని అధికారులు వివరించారు. ఘటనాస్థలికి పోలీసు జాగిలాలు వెళ్లాయా, ఏం విచారణ చేశారని సీఎం ప్రశ్నించారు. ఫోరెన్సిక్, ఇతర ఆధారాల సేకరణ విషయంలో జాప్యంపై నిలదీశారు. ఘటన సమయంలో విద్యుత్ సరఫరా పరిస్థితిపైనా విచారణ జరపాలన్నారు. సీసీ కెమెరా దృశ్యాలు వెంటనే స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా అక్కడ సంచరించిన వ్యక్తుల వివరాలు సేకరించాలన్నారు.

## వైఎస్ వివేకా హత్య కేసు..

మొదటిపేజీ తరువాయి..

కూతురు సునీత ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఈనాటి వాదనల సందర్భంగా సీబీఐ తరపు న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ.. ఈ కేసులో తాము ఇంకా కౌంటర్ దాఖలు చేయలేదని కోర్టుకు తెలిపారు. కౌంటర్ దాఖలు చేసేందుకు కొంత సమయం ఇవ్వాలని కోరారు. ఈ క్రమంలో రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని సీబీఐకి కోర్టు ఆదేశించింది. సెప్టెంబర్ రెండో వారంలో తదుపరి విచారణ జరుపుతామని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజీవ్ కుమార్ ల ధర్మాసనం ప్రకటించింది. సెప్టెంబర్ 9 నుంచి మొదలయ్యే వారంలో లిస్ట్ చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది.

## సభలో విపక్షాలు సమయాన్ని వృధా చేస్తున్నాయ్

చేయడమే పనిగా పెట్టుకున్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని రాజ్యాంగ విరుద్ధంగా నిశ్శబ్దం చేసేందుకు ప్రయత్నించారని మోదీ అన్నారు. ఇదివరకు జరిగిన సభల్లో రెండున్నర గంటలు నాపై ప్రతిపక్షాలు నోటికొచ్చినట్లు మాట్లాడాయి. ప్రజాస్వామ్య సంప్రదాయాల్లో ఇలాంటి వ్యాఖ్యలకు తావుండదు. వీటన్నింటినీ దేశం నిశితంగా పరిశీలిస్తోంది. విపక్షాలు నిర్మాణాత్మక సలహాలు ఇవ్వాలి. కనీసం ఈ సమావేశాలైనా సజావుగా సాగుతాయని ఆశిస్తున్నా. 2014 తర్వాత కొంతమంది ఎంపీలు ఒకసారి, మరికొందరు రెండోసారి గెలిచారని అన్నారు. కానీ.. విపక్షాల అరుపుల మధ్య వారిలో చాలా మంది వారి సమస్యలను సభాసాక్షిగా వినిపించలేకపోయారు. ఇక నుంచైనా సమావేశాలను సజావుగా సాగనిస్తూ.. ప్రజల ఆకాంక్షలను సభలో వినిపించనివ్వండి. 60 సంవత్సరాల తరువాత వరుసగా మూడు సార్లు ఓ పార్టీ అధికారంలోకి రావడం ఇదే తొలిసారి. మూడోసారి అధికారం చేపట్టాక తొలి బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నాం అని మోదీ వ్యాఖ్యానించారు. సుపరిపాలనకు ఈ బడ్జెట్ ముఖ్యమైనది. రాబోయే 5 ఏళ్లకు ఇది దిశానిర్దేశం చేస్తుంది. 2047 వికసిత్ భారత్ లక్ష్యానికి బలమైన పునాది అవుతుంది. గత మూడేళ్లలో దేశం 8 శాతం ఆర్థిక వృద్ధిని సాధించింది. దేశంలో పెట్టుబడిదారులకు సానుకూల వాతావరణం ఉంది. అందుకు తగినట్లు వేల సంఖ్యలో కంపెనీలు భారత్‌కి వచ్చి పెట్టుబడులు పెడుతున్నాయ్. లక్షల్లో ఉద్యోగాలు కల్పిస్తున్నాయ్' అని మోదీ పేర్కొన్నారు.

## కేంద్ర బడ్జెట్లో... తెలుగు రాష్ట్రాలకు ప్రాధాన్యత దక్కేనా..?

మొదటిపేజీ తరువాయి..

అందు కున్నారు. వైసీపీ పార్ల మెంటు నేతల భేటీలో హోదా అంశాన్ని ప్రస్తావించారు. వైసీపీ శ్రేణులను హోదా పై సమాయత్తం చేశారు. ఈ విషయమై జగన్ వైఖరిలో అంతగా స్పష్టత కానరావడం లేదు. అధికార తెలుగుదేశంతో పొత్తులో ఉన్న కేంద్రం సర్కారుకు రానున్న రోజుల్లో, వైసీపీ వికరిపట్ల ఓ మందలింపు అనే భావన జగన్ హోదా మాటల్లో ధ్వనిస్తోంది. గతంలో 25 ఎంపీ సీట్ల గెలుపును, హోదాతో ముడిపెట్టిన జగన్.. ఏపీ జనం తన పార్టీకి 23 ఎంపీ సీట్లు కట్టబెట్టినా.. అపై హోదా ఊసే ఎత్తలేదు. ఐదేళ్ల కాలంలో కేంద్రంలోని బీజేపీ సర్కారుతో రహస్య పొత్తు కొనసాగిస్తూ కాలయాపన చేసారే కానీ, రాష్ట్ర ప్రజలకు తానిచ్చిన హోదా ఊసె త్తటం మార్చారు. రాష్టంలో తెదేపా అధికారంలోకి రావడంతో స్థానిక రాజకీయ సమీకర ణలను దృష్టిలో ఉంచు కుని హోదా సాకుగా కేంద్ర సర్కారుకు కట్టడి చేసేలా వ్యూహం పన్నుతున్నారే భవన పరిశీలకుల్లో ఉంది. ఇటు వైసీపీ గాని, అటు అధికార తెలుగుదేశం కానీ హోదా విషయమై అంతగా శ్రద్ధ వహించడం లేదు.. అందుకు భిన్నంగా కాంగ్రెస్ కేంద్ర, రాష్ట్ర పార్టీలు హోదా ఏపీ సమస్యలకు శాశ్వత పరిష్కారం గా చూపె డుతొంది. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే.. హోదాపైనే తొలి సంతకమని మ్యాని ఫెస్టోలో ప్రకటించింది. ఏపీ కాంగ్రెస్ అధ్య క్షురాలు వైఎస్ షర్మిల హోదా అంశంపై తరుచుగా కేంద్రాన్ని నిలదీస్తున్నారు. హోదా సాధన తోనే ముడిపడి ఉన్న రాష్ట్ర భవిత వ్యాన్ని ప్రధాన వైసీపీ, టీడీపీ పార్టీలు .. తేలికగా తీసుకోవడం రాష్ట్ర ప్రజలకు మింగుడు పడటం లేదు. కానీసంగా కేంద్ర బడ్జెట్లో హోదా కాకపోయినా ప్రత్యేక ప్రోత్సాహ నిధులు సైతం విది లించక పోవడం ఏపీ పట్ల, కాంగ్రెస్ ఏతర పార్టీల చిత్తశుద్ధి వ్యక్త మవుతొంది. హోదాకు బీహారులోని ఎన్డీఏ మిత్రపక్షం ఆర్జేడీ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమానికి సన్నద్ధం అవుతున్న దశలో ఏపీ ప్రధాన పార్టీలు మౌనం వహిం చడం ఎన్డీయే సర్కారు ఇటు టీడీపీని, అటు వైసీపీని ఏ మేరకు కనుసన్నల్లో శాసిస్తోందో ఇట్టే అవగతం అవుతుంది.. మరో వైపు తెలంగాణా సర్కారు కేంద్ర బడ్జెట్ పై ఆశలు పెంచుకుంది.. తెలంగాణలోనూ ఈసారి బీజేపీ ఎక్కువ సీట్లు గెలుచుకోవడంతో.. రాష్ట్రానికి గతానికంటే ఎక్కువ లబ్ది చేకూరేలా నిర్ణయాలు ఉండొచ్చనే చర్చ జరుగుతోంది.

మొబైల్ యాప్‌లో అందుబాటులో బడ్జెట్ పత్రాలు:

గతంలో లాగానే బడ్జెట్ 2024 కూడా పేపర్‌లెస్ ఫార్మాట్‌లో ఉండనుంది. బడ్జెట్ పత్రాలు హిందీ, ఇంగ్లీష్ మాత్రమే అందు బాటులో ఉంటాయి. కేంద్ర బడ్జెట్‌కు సంబం ధించిన అన్ని పత్రాలు 'యూనియన్ బడ్జెట్ మొబైల్ యాప్'లో అందుబాటులో ఉంటాయి. దీంతో పార్లమెంట్ సభ్యులు, సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా బడ్జెట్ పత్రాలు అందుతాయి. అలాగే ఆండ్రాయిడ్, ఐఓఎస్ ప్లాట్‌ఫారమ్‌లలో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. బడ్జెట్‌ను సమర్పించిన కొద్దిసేపటికే అన్ని పత్రాలు ఈ యాప్‌లో అందుబాటులోకి రానున్నాయి.

## దేశ ఆర్థికవృద్ధి 6.5నుంచి 7శాతం

మొదటిపేజీ తరువాయి..

ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో చాలా కీలకమైన అంశాలు ఉన్నాయి. దేశ ఆర్థిక వృద్ధి 6.5 నుంచి 7 శాతంగా ఉంటుందని అంచనా. మార్కెట్ అంచనాలు చాలా ఎక్కువగా ఉన్నాయని.. అందుకు తగ్గట్టుగా రిస్క్ ఎక్కువగా ఉంటుందని.. అయినా వృద్ధి రేటును కొనసాగుతుందని ఆర్థిక మంత్రి స్పష్టం చేశారు. ద్రవ్యోల్బణం.. ధరల సూచి 4.5 శాతంగా ఉంటుందని.. 2026 నాటికి ధరల సూచిని 4.1 శాతానికి తగ్గించటమే లక్ష్యంగా ఉన్నట్లు స్పష్టం చేశారు.దేశంలోని ప్రజలు 54 శాతం వ్యాధులు, రోగాలకు కల్తీ, అనారోగ్యకరమైన ఆహారమే కారణం అని.. ఈ విషయంలో మార్పు అవసరం అని ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. సమతుల్యమైన ఆహారం, నాణ్యమైన ఆహారం వైపు మార్పు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆర్థిక సర్వే చెబుతోంది. చైనా నుంచి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు భారీగా పెరిగినట్లు ఆర్థిక సర్వే వెల్లడించింది. దీని వల్ల దేశం నుంచి ఇతర దేశాలకు ఎగుమతులు పెంచటానికి ఈ పెట్టుబడులు ఎంతో ఉపయోగపడతాయని స్పష్టం చేసింది ఆర్థిక సర్వే. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్..ప్రభావం ఉద్యోగులు, కార్మికుల ఉపాధిపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. పప్పు ధాన్యాల లోటు కొనసాగటం వల్ల.. దిగుమతులు తప్పవు అనేది స్పష్టం చేసింది ఆర్థిక సర్వే. దేశంలోని బ్యాంకింగ్, ఆర్థిక రంగాలు అద్భుతమైన పనితీరు చూపించటంతో.. ఆర్థిక ఒడుదుడుకులను సమర్థవంతంగా ఎదుర్కొన్నట్లు ఆర్థిక సర్వే స్పష్టం చేస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక సంక్షోభాలు, దేశంలోని క్లిష్టమైన ఆర్థిక రంగాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే స్థానిక ఉత్పత్తులు, వినియోగం ద్వారానే అడ్డుకట్ట వేయొచ్చని అభిప్రాయపడింది ఆర్థిక సర్వే. దీంతో పాటు గణాంక అనుబంధాన్ని కూడా సభలో ప్రవేశపెట్టారు.బడ్జెట్‌కు ముందు ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టడం ఆనవాయితీగా వస్తోంది. గత సంవత్సర కాలంలో దేశ ఆర్థిక పనితీరును.. రాబోయే సంవత్సరంలో ఆర్థికంగా ఎదురయ్యే సవాళ్లను ముందుగానే అంచనా వేసి చెప్పేదే ఈ ఎకనమిక్ సర్వే. ఆర్థిక మంత్రిత్వశాఖకు చెందిన ఎకనామిక్ అఫైర్స్ డిపార్ట్‌మెంట్‌లోని ఎకనమిక్ డివిజన్ ఈ సర్వేను రూపొందిస్తుంది. తొలుత 1950-51 సంవత్సరం నుంచి ఆర్థిక సర్వేను బడ్జెట్‌తో పాటే ప్రవేశపెట్టేవారు. 1960 తర్వాత బడ్జెట్‌కు ఒక రోజు ముందు ప్రవేశపెట్టే సంప్రదాయం మొదలైంది. అంతర్జాతీయ భౌగోళిక పరిణామాలు, వాటి ప్రభావం ఆర్‌బీఐ ద్రవ్య విధాన నిర్ణయాలను ప్రభావితం చేయొచ్చు. ఈ ఏడాది సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. కార్పొరేట్, బ్యాంకింగ్ బ్యాలెన్స్ షీట్స్ బలంగా ఉన్నాయి. ప్రైవేటు పెట్టుబడుల వృద్ధికి ఇది దోహదం చేస్తుంది. భారత వృద్ధిలో క్యాపిటల్ మార్కెట్‌లది కీలకపాత్ర. భౌగోళిక రాజకీయ, ఆర్థిక పరిణామాలను తట్టుకోలదని ఆర్థిక సర్వే అభిప్రాయం.

# దెబ్బతిన్న ఎపిని పునరుజ్జీవింపచేస్తాం

మొదటిపేజీ తరువాయి..

రెవెన్యూ వార్షిక వృద్ధి రేటు 12.8 శాతం నుంచి 8.1 శాతానికి పడిపోయింది. రెవెన్యూ వ్యయం 7.8 శాతం నుంచి 10.5 శాతానికి పెరగ్గా మూలధన వ్యయం వృద్ధి 26.4 శాతం నుంచి 3.4 శాతానికి క్షీణించిందని పేర్కొన్నారు. నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర బిందువుగా భావించిన అమరావతి రాజధాని ప్రాంతం పూర్తిగా నాశనమైంది. అమరావతి కలను నీరుగార్చే ప్రయత్నం చేస్తూ, ప్రభుత్వం వికేంద్రీకరణ పాలన ముసుగులో మూడు రాజధానుల ఆలోచనతో ప్రజలను గందరగోళానికి గురిచేసింది. ఇలాంటి విధ్వంసకర నిర్ణయాలు, వాటి పర్యవసానాలను పట్టించుకోకపోవడం యువతలో, ఉద్యోగార్థులలో అశాంతికి దారి తీసిందని అన్నారు. అందుకే ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకు అనుకూలంగా చారిత్రాత్మక తీర్పు ఇచ్చారు. భారతదేశపు రైస్ బౌల్ 'అన్నపూర్ణ'గా ప్రసిద్ధి చెందిన ఈ రాష్ట్రం ఆహార భద్రతను కల్పించడంలో ఇతర రాష్ట్రాలకు మద్దతునిస్తుంది. స్వయం సహాయక బృందం విధానంలో అగ్రగామిగా,పేద మహిళల్లో పారిశ్రామికతత్వం, ఆదాయ మరియు పొదుపు విజ్ఞానాన్ని అభివృద్ధి చేయడంలో ఆంధ్రప్రదేశ్ ఒక ఉదాహరణగా నిలిచింది. సంక్షేమం మరియు అభివృద్ధికి సంబంధించిన అన్ని రంగాలలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని ఉపయోగించడం అనేది రాష్ట్రం దార్శనికతకు మూలస్తంభం అన్నారు. పారదర్శకత లోపించిన గత ప్రభుత్వ దుష్పరిపాలన, గత ఐదేళ్ళ పాలనలో వ్యవస్థల వైఫల్యాలు వివరించేందుకు శ్వేతపత్రాలను విడుదల చేసింది. తగ్గిన రాష్ట్ర ఆదాయం ఫలితంగా అత్యవసరంగా చేయాల్సిన కనీస చెల్లింపు బాధ్యతా వ్యయాన్ని భరించడం నూతన ప్రభుత్వానికి కష్టతరంగా మారింది. జీతాలు, పింఛన్ల భారీ బకాయిలు, సుమారు రూ.10 లక్షల కోట్ల రుణ భారానికి రుణం తిరిగి చెల్లింపులు. విద్యుత్ రంగ బకాయిల చెల్లింపులు, పౌర సరఫరాలు, ఇతర అప్పుల చెల్లింపులు సవాలుగా మారడంతో గత ఐదేళ్లలో మొత్తం అప్పులు రెట్టింపు కంటే మించిపోయాయని అన్నారు. ప్రభుత్వ పరిపాలనను తిరిగి గాడిలో పెట్టడం చాలా సవాలుతో కూడుకున్న పని అని పేర్కొన్నారు.ఇప్పటికే ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నేరవేర్చడం ప్రారంభిం చిందని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 16,347 ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి మెగా డిఎస్సి, ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు, పింఛన్లను పెంపు స్కిల్ గణన ఉచిత ఇసుక విధానం తీసుకొచ్చామని అన్నారు.

పేదలకు నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు రూ.5 లకే అన్న క్యాంటీన్ల ద్వారా ఆహారం ఇవ్వడం వంటి ట్రేడ్మార్క్ పాలన ప్రారంభించామన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం కోసం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో అన్ని ప్రయత్నాలను చేస్తుందని గవర్నర్ విశ్వసించారు. ఇప్పటికే ఢిల్లీ వెళ్లి ప్రధానమంత్రి సహా కేంద్రమంత్రులతో సమావేశమై రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వివరించామన్నారు. కేంద్ర ప్రభుత్వం చేయూతను అందించి రాష్ట్రానికి ఉదారంగా సహాయాన్ని అందించాలని విజ్ఞప్తులు చేసినట్టు పేర్కొన్నారు. ఆందోళనకరమైన ఆర్థిక పరిస్థితి అర్థం చేసుకుని రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రభుత్వానికి సహకరించాలని ప్రజలకు గవర్నర్ విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత సంక్షోభాన్ని అధిగమించే మార్గాలను అన్వేషించడానికి సమిష్టి ఆలోచన, మేధావులు, విద్యావేత్తలతో విస్తృతమైన చర్చలు అవసరమన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ అనే నూతన అభివృద్ధి నమూనా దృష్ట్యా స్వల్ప, మధ్యస్థ, దీర్ఘకాలిక ప్రణాళికల అభివృద్ధి వ్యవస్థను పునఃప్రారంభించే మార్గాలను అన్వేషించాలి. ఐదేళ్ళలో జరిగిన వాస్తవ నష్టం ఇంతవరకు బహిరంగ చర్చకు రాలేదని గుర్తు చేశారు. ఇప్పుడు విభిన్నమైన, క్లిష్టతరమైన పరిస్థితుల్లో ఉన్నామని, అధికారంలోకి వచ్చామన్న సంతోషం ఎవరిలో లేదన్నారు. ప్రజల ఆకాంక్షలు తక్షణమే నెరవేర్చే మార్గం కూడా లేదని తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని, అర్థవంతమైన చర్చల తరువాత బ్జడెట్‌కు వెళ్ళాలని ప్రభుత్వం తేల్చి చెప్పింది. కష్టాలను చూస్తూ కుంగిపోవడం కంటే ఉన్న అవకాశాలను వినియోగించుకొని ప్రజలకు న్యాయం చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే ప్రభుత్వం ముందు ఉన్న కర్తవ్యమని గవర్నర్ తన ప్రసంగంలో తెలిపారు.

## గవర్నర్ ప్రసంగంతో అసెంబ్లీ సమావేశాలు

మొదటిపేజీ తరువాయి..

అసెంబ్లీ సమావేశాల్లో భారీ భద్రత ఏర్పాటు చేశారు. గత సమావేశాల వరకూ గవర్నర్‌ను అసెంబ్లీకి దొడ్డిదారిన తెచ్చినట్లుగా చుట్టూ తిప్పి వెనుక నుంచి తీసుకొచ్చేవారని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. సోమవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ... ఈ సమావేశాలకు గవర్నర్‌ను రాచమార్గంలో ముందు వైపు నుంచీ తీసుకొచ్చామన్నారు. అసెంబ్లీకి రాచమార్గం ఉండాలనే గోడ కూల్చి గేట్-2 తలుపులు తీశామని తెలిపారు. నలుగురు ప్యానల్ స్పీకర్లను పెట్టుకోమని సీఎం సూచించారన్నారు. అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 26 వరకు జరుగుతాయన్నారు. రెండుబిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టనుందన్నారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు బిల్లుతో పాటు ఆరోగ్య విశ్వవిద్యాలయాని కి ఎన్టీఆర్ పేరు పునరుద్ధరణ బిల్లు కూడా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం కొన్ని శ్వేత పత్రాలు ప్రవేశ పెట్టనుందని తెలిపారు. 88మంది మొదటిసారి గెలుపొందిన ఎమ్మెల్యేలు ఉన్నందున వచ్చే సమావేశాల్లోపు వారికి శిక్షణ ఇస్తామన్నారు. అమరావతిలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవనాలు 80 శాతం మేర పూర్తయ్యాని అన్నారు. ఆరు నెలల్లోగా వాటిని సభ్యులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. తొమ్మిది నెలల్లో అందుబాటులోకి తెస్తామని అధికారులు చెప్పారని స్పీకర్ అయ్యన్నపాత్రుడు వెల్లడించారు. కాగా.. ఈరోజు ఉదయం అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. సభ మొదలైన వెంటనే ఉయయసభలను ఉద్దేశించిన గవర్నర్ నజీర్ ప్రసంగించారు. ఏపీ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా వైకాపా ఎమ్మెల్యేలు, పోలీసుల మధ్య వాగ్వాదం జరిగింది. సమావేశాలకు ఆ పార్టీ ఎమ్మెల్యేలు నలుపు కండువాలతో వస్తుండగా.. లోపలికి అనుమతి లేదని పోలీసులు అడ్డుకున్నారు. దీనిపై వైకాపా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జగన్ అభ్యంతరం తెలిపారు. ప్లకార్డులు ప్రదర్శించవద్దని చెప్పడంపై మండిపడ్డారు. పేపర్లు గుంజుకుని చింపేసే అధికారం పోలీసులకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందని.. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని వ్యాఖ్యానించారు. పోలీసులపై వేలు చూపుతూ హెచ్చరించారు.

పోలీసు అధికారి మధుసూదనరావును ఉద్దేశిస్తూ మధుసూదనరావు.. గుర్తు పెట్టుకో.. ఎల్లకాలం ఇలాగే ఉండదని హెచ్చరించారు. మనం ప్రజాస్వామ్యంలో ఉన్నాం. నీ టోపీపై ఉన్న సింహాలకు అర్థమేంటో తెలుసా? అధికారంలో ఉన్నవారికి సెల్యూట్ కొట్టడం కాదు.. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు మీరున్నారు' అని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో పోలీసులు, వైకాపా ఎమ్మెల్యేల మధ్య ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ క్రమంలో మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి మారే సూచనలు అసలు కనిపించడమే లేదు. చివరకు పోలీసులతో కూడా గొడవ పడుతున్నారు. అసెంబ్లీ లోపలికి వైఎస్ జగన్ కారును అనుమతించేందుకు ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సాధారణంగా ఎమ్మెల్యేలు అసెంబ్లీ 4 వ నంబరు గేటు బయట దిగి లోపలికి వెళ్లేలా నిబంధనలు ఉన్నాయి. ప్రతిపక్ష హోదా లేకున్నా అసెంబ్లీ లోపలికి జగన్ వాహనం తీసుకోవాలని నిర్ణయం తీసుకుంది. వైసీపీ శాసన సభపక్ష విన్నపం మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఏపీ ప్రభుత్వం ఇంతటి బంపరాఫర్ ఇచ్చినా కూడా పోలీసులతో తనను మెయిన్ గేటు నుంచి అసెంబ్లీలోకి వెళ్లనివ్వాలని జగన్ వాగ్వాదానికి దిగారు. తనను అసెంబ్లీ మెయిన్ గేటు నుంచి వెళ్లనివ్వాలని జగన్ డిమాండ్ చేశారు. అయితే గవర్నర్ వస్తున్నారని అందువలన వేరే గేట్ నుంచి వెళ్లాలని పోలీసులు సూచించారు. దీంతో గొడవకు దిగారు. శాసన సభ గేట్ వద్ద బైటాయించి నిరసన వ్యక్తం చేయాలని జగన్ సూచించారు. ఆపై పోలీసులు డౌన్ డౌన్ అంటూ గేటు వద్ద వైఎస్ జగన్, వైసీపీ ఎమ్మెల్యేలు ఓవర్ యాక్షన్ చేశారు. ఇదే సమయంలో గవర్నర్ కాన్వాయ్ రావడంతో వేరే గేట్ నుంచి జగన్ బృందం లోపలకు వెళ్లనివ్వలేదు. చివరకు చేసేది లేక వేరే గేట్ నుంచి జగన్ బృందం లోపలికి వెళ్లింది. విధుల్లో ఉన్న పోలీసులపై వైఎస్ జగన్ అనుచితంగా ప్రవర్తించడంపై సర్వత్రా విమర్శలు వినవస్తున్నాయి. రోజులు ఇలాగే ఉండవంటూ బహిరంగంగా పోలీసులను జగన్ బెదిరించారు. ప్ల కార్డులు, నల్ల కండవాలతో అసెంబ్లీకి వస్తున్న జగన్ ని పోలీసులు అడ్డుకున్నారు. ప్లకార్డ్స్, నల్ల కండవాలు తొలగించాలని పోలీసులకు ఎవరు ఇచ్చారు అధికారం అంటూ జగన్న్ ÷ర్ అయ్యారు. ఈ నేపథ్యంలోనే పోలీసులకు జగన్‌కు మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసుల తీరుపై జగన్ మండిపడ్డారు.

## జగన్‌కు ఇంకా తత్వం బోధపడలేదు- తానే సీఎం అనుకుంటున్నారేమో?: పవన్ కల్యాణ్

మొదటిపేజీ తరువాయి..



తప్పుబట్టారు. నెల రోజుల్లోనే ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రూపు తగాదాకు రాజకీయ రంగు పులిమి అవాస్తవాలు చెప్తూ కుట్రలకు తెరలేపుతున్నాడని పవన్ కల్యాణ్ ఆక్షేపించారు. సభలోకి వచ్చే ముందు పోలీసులతో గొడవ, గవర్నర్ ప్రసంగానికి అడ్డు తగలమని ఎమ్మెల్యేలు రెచ్చకొట్టడం అతని అహంకార ధోరణికి నిదర్శనమని అభిప్రాయపడ్డారు. ఎల్లకాలం అధికారంలో కొనసాగుతానని భ్రమ నుంచి ప్రజలు బయట పడేసినా ఇంకా తానే సీఎం అనుకుంటున్నాడేమోనని ఎద్దేవాచేశారు. రాష్ట్ర అభివృద్ధికి కోసం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా చంద్రబాబుకు తాను ,జనసేన పార్టీ నూటికి నూరు శాతం సహకరిస్తుందని స్పష్టం చేశారు.

## తెలుగు రాష్ట్రాల్లో పొంగుతున్న వాగులు

మొదటిపేజీ తరువాయి..

గోదావరి పరీవాహకం లోనూ భారీ వర్షాలు పడుతుండటంతో కిన్నెరసాని, ముర్రేడు, కాళేశ్వరం ఎత్తిపోతల్లోని మేడిగడ్డ-అన్నారం బ్యారేజీల మధ్య వాగుల నుంచి పెద్దఎత్తున వరద వచ్చి గోదావరి నదిలో కలుస్తోంది. దీంతో ప్రవాహం పెరుగుతోంది. మేడిగడ్డ వద్ద 5.52 లక్షల క్యూసెక్కుల వరద ప్రవహిస్తోంది. అన్నారం బ్యారేజీకి 16,850 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండడంతో 66 గేట్లు ఎత్తి అదేస్థాయిలో నీటిని విడుదల చేస్తున్నారు. ఇంద్రావతి కలిసిన అనంతరం సమ్మక్క బ్యారేజీ వద్ద 8.23 లక్షల క్యూసెక్కులు, దుమ్ముగూడెం సీతమ్మసాగర్ ఆనకట్ట వద్ద 9.01 లక్షల క్యూసెక్కుల ప్రవాహంతో గోదావరి ఉగ్రరూపం దాల్చుతోంది. భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి(43 అడుగులు)ని నది దాటింది. నదీ పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గక పోవడంతో మరికొంత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. మూడు, నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో శ్రీరామసాగర్ జలాశయంలోకి ఎగువ నుంచి 18,518 క్యూసెక్కుల వరద చేరుతోంది. నిర్మల్ జిల్లాలోని కడెం నారాయణరెడ్డి జలాశయంలో ఆదివారం ఉదయం నాలుగు వరద గేట్లు ఎత్తారు. మధ్యాహ్నానికి వరద తగ్గడంతో ఒక గేటు మూసేసి మూడు గేట్ల ద్వారా నీటిని దిగువకు వదులుతున్నారు. కృష్ణా నదిలో ఎగువన వరద పెరుగుతోంది. కర్ణాటకలో ఆలమట్టి, నారాయణపూర్ జలాశయాల కింద అప్రమత్తత ప్రకటించారు. ఆదివారం సాయంత్రానికి ఎగువ నుంచి భారీ ప్రవాహాలు వస్తుండటంతో ఆలమట్టి నుంచి దిగువకు 1.50 లక్షల క్యూసెక్కుల నీటి విడుదలను ప్రారంభించారు. ఇది మరింత పెరిగే అవకాశాలు ఉన్నట్లు కర్ణాటక జలవనరుల శాఖ అధికారులు అప్రమత్తం చేశారు. నారాయణపూర్ నుంచి 25 గేట్లు తెరిచి 1.45 లక్షల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. దీంతో జూరాలకు వరద పెరిగింది. ప్రాజెక్టు 22 గేట్లను తెరిచారు. శ్రీశైలం జలాశయం వద్ద 96 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతోంది. భారీ వర్షాల నేపథ్యంలో గోదావరి నది పరీవాహకంలోని లోతట్టు ప్రాంతాల్లో తగిన రక్షణ చర్యలు చేపట్టాలని పరీవాహక జిల్లాల కలెక్టర్లను రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. వరద పరిస్థితులపై ఆదివారం హైదరాబాద్‌లో అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. నదులు, వాగుల ప్రవాహాలతో ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని నిర్దేశిరచారు. కలెక్టరేట్లలో కంట్రోల్ రూంలను ఏర్పాటు చేసి.. సమన్వయం చేయాలని కోరారు. రెస్క్యూ బృందాలు, ఎన్డీఆర్ఎఫ్ బృందాల సాయాన్ని తీసుకోవాలని సూచించారు.

## పోలవరంపై కీలక ముందడుగు

మొదటిపేజీ తరువాయి..



ప్రధాని మోదీ సహకారంతో పోలవరం సవాళ్ళను అధిగమిస్తూ ముందుకు వెళతామన్నారు. పోలవరానికి రావాల్సిన రూ. 12,157 వేల కోట్లు త్వరగా ఇవ్వాలని కోరినట్లు వెల్లడించారు. ఇందులో 8 వేల కోట్ల రూపాయిలు పునరావసానికి ఖర్చు చేయాల్సి ఉందని చెప్పారు. కాగా.. వైసీపీ పాలనలో కేంద్రం ఇచ్చిన నిధులన్నీ ఇష్టానుసారం వాడేసి ప్రాజెక్టును పట్టించుకున్న పాపాన పోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. అందుకే కూటమి సర్కార్ రాగానే తొలుత పోలవరంపైనే సీఎం నారా చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలోనే ప్రతి సోమవారం పోలవరం కోసమే కేటాయిస్తూ వస్తున్నారు. అంతేకాకుండా.. ఢిల్లీ పర్యటనకు వెళ్లిన ప్రతిసారీ ప్రధాని నరేంద్ర మోదీతో పాటు కేంద్ర మంత్రుల దృష్టికి పలుమార్లు పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కావాల్సిన నిధుల విషయాన్ని మాట్లాడారు. దీంతో పాటు.. పార్లమెంట్ సమావేశాలతో పాటు కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సి.ఆర్ పాటిల్‌ను ప్రత్యేకంగా కలిసి ఎంపీలు నిశితంగా వివరించారు. ఈ క్రమంలోనే ప్రాజెక్ట్ కోసం రూ.12 వేల కోట్ల ప్రతిపాదనలకు కేంద్రం అంగీకారం తెలిపింది. ఇదిలావుంటే రాష్ట్రమంత్రి నిమ్మల రామానాయుడు ఢిల్లీలో పర్యటించారు. పోలవరం నిధులపై కేంద్రంతో చర్చించారు. గత ప్రభుత్వం హయాంలో కేంద్రం ఇచ్చిన నిధులు పక్కదారి పట్టాయని అన్నారు. కేంద్రం సానుకూలంగా ఉందని, నిధుల విడుదలకు అంగీకరించిందని అన్నారు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు కూడా తమ ప్రాధాన్యం పోలవరం అని తెలిపారు. చంద్రబాబుతో పాటు ఎంపీల ప్రయత్నాలు ఫలించాయి. ఇదిలా ఉంటే.. ఇవాళ పార్లమెంట్ సమావేశాల్లో పోలవరం ప్రాజెక్ట్ త్వరగా పూర్తి అయ్యేందుకు కేంద్రం భారీగా నిధులివ్వాలని ఎంపీ కేశినేని శివనాథ్ కోరడం జరిగింది. రూల్- 377 కింద పోలవరం ప్రాజెక్ట్ నిధులపై ఆయన మాట్లాడి.. పోలవరం నిర్మాణానికి కేంద్రం తగిన నిధులు విడుదల చేయాలని కోరారు. మిషన్ మోడ్ కింద పోలవరం ప్రాజెక్ట్‌ను తిరిగి ట్రాక్‌లోకి తీసుకువచ్చేందుకు ఏపీ ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్న విషయాన్ని లోక్‌సభలో తెలియజేశారు. ప్రాజెక్ట్ పూర్తయితే దేశంలోని ఆరు రాష్ట్రాలకు ప్రయోజనం కలుగుతుందన్న విషయాన్ని పార్లమెంట్‌లో కేశినేని చిన్ని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో సివిల్ పనులు 3.84?, భూ సేకరణ పనులు 3.89? మాత్రమే జరిగాయని.. 2019 నాటికి, సివిల్ పనులు 71.93?, భూసేకరణ పునరావాసం పనులు 18.66శాతం పూర్తి అయ్యాయని లోక్‌సభలో నిశితంగా ఎంపీ వివరించారు. పోలవరం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, భవిష్యత్తుకు ప్రాణాధారం అని కేశినేని చిన్ని చెప్పుకొచ్చారు.

Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in

# సంపాదకీయం

## బడ్జెట్ సామాన్యులకు చిక్కేనా ?

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం అయ్యాయి. ఓట్ ఆన్ అకౌంట్ తరవాత ఎన్నికలు..ఇప్పుడు కొత్త ప్రభుత్వం ఏర్పడ్డ తరవాత పూర్తిస్థాయి బడ్జెట సమావేశాలు మొదలయ్యాయి. ప్రజలు ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తున్న అనేక అంశాలకు, సమస్యలకు పార్లమెంట్ జవాబుదారీ కావాలి. ప్రజలకు తాము అండగా ఉన్నామన్న సంకేతం వెళ్లాలి. అప్పుడే ప్రజలకు విశ్వాసం కలుగుతుంది. ఇకపోతే దేశానికి దశాదిశానిర్దేశం చేసేలా బడ్జెట్ పద్దులు ఉండాలి. బడ్జెట్ అనగానే దేశ అభివృద్ధి ముఖచిత్రం కనిపించాలి. అంకెలా గారడీ కాకుండా దేశాన్ని నిలబెట్టేలా, ఆపన్నులను ఆదుకునేలా, భవిష్యత్ దర్శనం చూపేలా ఉండాలి. కానీ ఏటా మొక్కుబడి బడ్జెట్ ప్రసగాలు సాగుతున్నాయి. గత పదేళ్లలో ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్న వారికి ఏ రకంగానూ బడ్జెట్‌లో ఏరడింపు కలగలేదు. ఈ క్రమంలో మంగళవారం ప్రవేశ పెట్టబోయే బడ్జెట్‌పై దేశ ప్రజల్లో సహజంగానే ఆసక్తి కలుగుతోంది. గత పదేళ్లకు భిన్నంగా బడ్జెట్ ఉంటుందా అన్న ఆసక్తి, ఉత్కంఠ కూడా కలుగుతోంది. తొలిసారి సంకీర్ణంలోకి అడుగుపెట్టిన మోడీ ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న తొలి బడ్జెట్ కావడంతో విపక్షాలతో సహా, అన్ని తరగతుల ప్రజలు కూడా గతంలో ఎప్పుడూ లేనంతగా ఆసక్తి కనబరు స్తున్నారు. దీంతో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టే బడ్జెట్‌పై సర్వత్రా చర్చ సాగుతోంది. ఇకపోతే దేశ ప్రజలంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభం అయ్యాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఏడోసారి కేంద్రబడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు సిద్ధమయ్యారు. అంతకుముందు పార్లమెంటులో ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టనున్నారు. నిర్మలా సీతారామన్ పేరిట వరుసగా ఏడు బడ్జెట్‌లు సమర్పించిన రికార్డు నమోదు కానుంది. ఇప్పటి వరకు ఈ రికార్డు మొరార్జీ దేశాయ్ పేరిట ఉంది. బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు నిర్మలా సీతారామన్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆర్థిక వ్యవస్థలోని వేర్వేరు వాటాదారులతో చాలాసార్లు చర్చలు జరిపింది. విద్య, ఆరోగ్య రంగం, క్యాపిటల్ మార్కెట్, ఉపాధి, నైపుణ్యాలతో పాటు రంగాలకు చెందిన అధికారులు, ప్రతినిధులతో చర్చలు జరిపారు. పలువురు ఆర్థికవేత్తలతోనూ ఆర్థిక మంత్రి సమావేశమయ్యారు. బడ్జెట్‌లో ద్రవ్యలోటు తగ్గింపుపై దృష్టి సారించాలని ఆర్థికవేత్తలు కేంద్రానికి సూచించారు. వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలని రైతు సంఘాలు ఆర్థిక మంత్రిని కోరాయి. ఇకపోతే ఈసారి కేంద్ర బడ్జెట్‌లో తెలుగు రాష్ట్రాలకు ప్రాధాన్యత దక్కాలని ఈ రెండు రాష్ట్రాలు కోరుకుంటున్నాయి. రెండు రాష్ట్రాల సిఎంలు పలుమార్లు కేంద్రమంత్రులను కలిసి ఇప్పటికే వివిధ అంశాలపై వినతులు సమరపించారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం కీలక భాగస్వామిగా ఉన్న టీడీపీ.. ఏపీ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు, ప్రాజెక్టులు కేటాయించాలని కేంద్రాన్ని కోరుతోంది. ఈ క్రమంలో ఏపీ సీఎం చంద్రబాబు ఇప్పటికే ప్రధాని మోదీ సహా కేంద్ర పెద్దలను కలిసి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలోనూ ఈసారి బీజేపీ ఎక్కువ సీట్లు గెలుచు కోవడంతో.. రాష్ట్రానికి గతానికంటే ఎక్కువ లబ్ది చేకూరేలా నిర్ణయాలు ఉండొచ్చనే చర్చ జరుగుతోంది. గతంలో లాగానే బడ్జెట్ 2024 కూడా పేపర్‌లెస్ ఫార్మాట్‌లో ఉండనుంది. బడ్జెట్ పత్రాలు హిందీ, ఇంగ్లీష్ మాత్రమే అందుబాటులో ఉంటాయి. కేంద్ర బడ్జెట్‌కు సంబంధించిన అన్ని పత్రాలు 'యూనియన్ బడ్జెట్ మొబైల్ యాప్'లో అందుబాటులో ఉంటాయి. దీంతో పార్లమెంట్ సభ్యులు, సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా బడ్జెట్ పత్రాలు అందుతాయి. బడ్జెట్ సమర్పించిన కొద్దిసేపటికే అన్ని పత్రాలు ఈ యాప్‌లో అందుబాటులోకి రానున్నాయి. ఈ సారి బడ్జెట్ లో కేంద్రం ప్రజాకర్షక విధానాలవైపే మొగ్గుచూప బోతున్నట్టు తెలిసింది. ఆదాయపన్నుల్లో ఉపశమనం, కిసాన్ సమ్మాన్ నిధి, ఇళ్ల నిర్మాణాలకు ఊతమిచ్చే విధంగా నిర్ణయాలు ఉండబోతున్నట్లు తెలిసింది. మరోవైపు

## తెలుగు రాష్ట్రాల్లో పొంగుతున్న వాగులు

మొదటిపేజీ తరువాయి..

గోదావరి పరీవాహకం లోనూ భారీ వర్షాలు పడుతుండటంతో కిన్నెరసాని, ముర్రేడు, కాళేశ్వరం ఎత్తిపోతల్లోని మేడిగడ్డ–అన్నారం బ్యారేజీల మధ్య వాగుల నుంచి పెద్దఎత్తున వరద వచ్చి గోదావరి నదిలో కలుస్తోంది. దీంతో ప్రవాహం పెరుగుతోంది. మేడిగడ్డ వద్ద 5.52 లక్షల క్యూసెక్కుల వరద ప్రవహిస్తోంది. అన్నారం బ్యారేజీకి 16,850 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండడంతో 66 గేట్లు ఎత్తి అదేస్థాయిలో నీటిని విడుదల చేస్తున్నారు. ఇంద్రావతి కలిసిన అనంతరం సమ్మక్క బ్యారేజీ వద్ద 8.23 లక్షల క్యూసెక్కులు, దుమ్ముగూడెం సీతమ్మసాగర్ ఆనకట్ట వద్ద 9.01 లక్షల క్యూసెక్కుల ప్రవాహంతో గోదావరి ఉగ్రరూపం దాల్చుతోంది. భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి(43 అడుగులు)ని నది దాటింది. నదీ పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గక పోవడంతో మరికొంత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. మూడు, నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో శ్రీరామసాగర్ జలాశయంలోకి ఎగువ నుంచి 18,518 క్యూసెక్కుల వరద చేరుతోంది. నిర్మల్ జిల్లాలోని కడెం నారాయణరెడ్డి జలాశయంలో ఆదివారం ఉదయం నాలుగు వరద గేట్లు ఎత్తారు. మధ్యాహ్నానికి వరద తగ్గడంతో ఒక గేటు మూసేసి మూడు గేట్ల ద్వారా నీటిని దిగువకు వదులుతున్నారు. కృష్ణా నదిలో ఎగువన వరద పెరుగుతోంది. కర్ణాటకలో ఆలమట్టి, నారాయణపూర్ జలాశయాల కింద అప్రమత్తత ప్రకటించారు. ఆదివారం సాయంత్రానికి ఎగువ నుంచి భారీ ప్రవాహాలు వస్తుండటంతో ఆలమట్టి నుంచి దిగువకు 1.50 లక్షల క్యూసెక్కుల నీటి విడుదలను ప్రారంభించారు. ఇది మరింత పెరిగే అవకాశాలు ఉన్నట్లు కర్ణాటక జలవనరుల శాఖ అధికారులు అప్రమత్తం చేశారు. నారాయణపూర్ నుంచి 25 గేట్లు తెరిచి 1.45 లక్షల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. దీంతో జూరాలకు వరద పెరిగింది. ప్రాజెక్టు 22 గేట్లను తెరిచారు. శ్రీశైలం జలాశయం వద్ద 96 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతోంది. భారీ వర్షాల నేపథ్యంలో గోదావరి నది పరీవాహకంలోని లోతట్టు ప్రాంతాల్లో తగిన రక్షణ చర్యలు చేపట్టాలని పరీవాహక జిల్లాల కలెక్టర్లను రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. వరద పరిస్థితులపై ఆదివారం హైదరాబాద్‌లో అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. నదులు, వాగుల ప్రవాహాలతో ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని నిర్దేశిరచారు. కలెక్టరేట్లలో కంట్రోల్ రూంలను ఏర్పాటు చేసి.. సమన్వయం చేయాలని కోరారు. రెస్క్యూ బృందాలు, ఎన్డీఆర్ఎఫ్ బృందాల సాయాన్ని తీసుకోవాలని సూచించారు.

# బడ్జెట్ ప్రవేశంలో నిర్మల చరిత్ర

## అత్యధిక సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత

## మరోమారు ఎవ్వరికీ అందనంతగా రికార్డు

న్యూఢిల్లీ,జూలై22(సూర్యవాస్తవం): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ జులై 23న మంగళవారం మరోమారు పార్లమెంట్‌లో 2024–25 బడ్జెట్ ను ప్రవేశపెట్టబోతున్నారు. మోదీ 3.0 సర్కారులో ఆమె ప్రవేశపెడుతున్న మొదటి బడ్జెట్ కాగా, ఆమె మొత్తంగా ఎక్కువసార్లు బడ్జెట్ ప్రవేశ పెట్టిన ఆర్థికమంత్రి, మహిళా మంత్రిగా చరిత్ర సృష్టించబోతున్నారు. గతంలో ఉన్న రికార్డునలు తిరగరాయబోతున్నారు. మొత్తంగా చూస్తే ఆమె ప్రవేశపెడుతున్న ఏడో కేంద్ర బడ్జెట్ ద్వారా తన పేరును చరిత్రలో లిఖించుకో బోతున్నారు. ఇప్పటికే నిర్మలా సీతారామన్ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా ఐదు పూర్తిస్థాయి బడ్జెట్ లు సమర్పించగా.. ఫిబ్రవరి 1న మధ్యంతర బడ్జెట్ ను ప్రవేశపెట్టారు.. ఇప్పుడు ఆరోసారి పూర్తిస్థాయి బ్జడెట్ ను ప్రవేశబెట్టి.. మరో రికార్డును తిరగరాయనున్నారు. ఇంతకుముందు వరుసగా ఐదు కేంద్ర బడ్జెట్లు ప్రవేశపెట్టిన మొరార్జీ దేశాయ్, అరుణ్‌జైట్లీ, పి.చిదంబరం, యశ్వంత్‌సిన్హా, మన్మోహన్‌సింగ్‌ను ఆమె అధిగమించనున్నారు. 1959 నుంచి 1964 వరకు ఆర్థిక మంత్రిగా ఉన్న మొరార్జీ దేశాయ్ ఐదుమార్లు పూర్తి బడ్జెట్లు, ఒక మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టారు. మొత్తంగా మొరార్జీ దేశాయ్ అత్యధికసార్లు బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. ఇన్నాళ్లు అత్యధిక బడ్జెట్ ప్రవేశపెట్టిన రికార్డు మొరార్జీ దేశాయ్ పేరు మీదే ఉంది. దీనిని ఎవ్వరూ బ్రేక్ చేయలేదు.. అయితే.. తాజా బడ్జెట్ తో నిర్మలా సీతారామన్ వరుసగా ఆరుసార్లు పూర్తి స్థాయిలో బడ్జెట్ ప్రవేశపెట్టి అరుదైన ఘనతను సాధించబోతున్నారు. వాస్తవానికి ఇందిరా గాంధీ తర్వాత బడ్జెట్ ప్రవేశపెట్టిన రెండో మహిళ నిర్మలా సీతారామన్.. ప్రధాని హోదాలో ఉంటూ నాడు ఇందిరా గాంధీ బడ్జెట్ ప్రవేశపెట్టారు. స్వతంత్ర భారతదేశంలో తొలి పూర్తిస్థాయి మహిళా ఆర్థిక మంత్రిగా ఎక్కువ కాలం కొనసాగిన నేతగా నిర్మలా సీతారామన్ ఇప్పటికే రికార్డును నమోదు చేసుకున్నారు.వాస్తవానికి బడ్జెట్ ప్రవేశపెట్టడంలోనూ నిర్మల సీతారామన్ కొత్త పోకడలు తీసుకొచ్చారు. సంప్రదాయ బ్రీఫ్‌కేస్ విధానానికి ఆమె మంగళం పాడారు. జాతీయ చిహ్నంతో కూడిన ఖాతా పుస్తకం తరహాలో ఉండే బ్యాగులో ఆమె బ్జడెట్ పత్రాలు తీసుకొచ్చే సంప్రదాయానికి ఆమె శ్రీకారం చుట్టారు.



2019లో తొలి బ్జడెట్ నుంచి ఆమె ఖాతా బుక్ విధానాన్ని అనుసరిస్తున్నారు. ఇప్పటి వరకు అతి సుదీర్ఘ బ్జడెట్ ప్రసంగం రికార్డు, అతి స్వల్ప ప్రసంగం రికార్డు కూడా నిర్మలా సీతారామన్ పేరిటే ఉన్నాయి. 2020లో ఆమె చేసిన బడ్జెట్ ప్రసంగం రెండు గంటల 40 నిమిషాలు సాగింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో తాత్కాలిక బడ్జెట్ ప్రవేశపెట్టే సమయంలో ఆమె చేసిన 57 నిమిషాల ప్రసంగం ఇప్పటి వరకు చేసిన ప్రసంగాల్లో అత్యల్పమైనది. నిర్మలా సీతారామన్.. 2019లో రెండోసారి మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్థిక శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుంచి ఆమెను కొనసాగుతున్నారు. మోదీ త్రీ పాయింట్ ఓ లో మొత్తం ఐదేళ్ల కాలానికి ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ కొనసాగితే అది కూడా ఒక రికార్డవుతుంది.. ప్రస్తుతం నిర్మలా సీతారామన్ కర్ణాటక నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

# రసవత్తరంగా అమెరికా అధ్యక్ష ఎన్నికలు

**బరిలోంచి తప్పకుంటున్నట్లు బైడెన్ ప్రకటన**

**కమలా హారిస్‌కు మద్దతు తెలిపిన అధ్యక్షుడు జోబైడెన్**

**తొలిసారి రేసులో భారత సంతతి అమెరికా మహిళ**

**బైడెన్ తప్పకోవడాన్ని స్వాగతించిన ఒబామా**

**అనూహ్యంగా మిషెల్ ఒబామా పేరు తెరపైకి రాక**

న్యూయార్క్,జూలై22(సూర్యవాస్తవం): అమెరికా అధ్యక్ష ఎన్నికలు ఆసక్తికరంగ ఆమారబోతున్నాయి. ట్రంప్‌కు పోటీగా మారోమారు బరిలిలో నిలవాలనుకున్న ప్రస్తు అధ్యక్షుడు జో బైడెన్ బరినుంచి తప్పుకున్నారు. తన మద్దతును ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్‌కు ప్రకటించారు. అనూహ్యంగా ఇప్పుడు తెరపైకి మాజీ అధ్యక్షుడు ఒబామా సతీమణి మిషెల్ ఒబామా పేరు కూడా వచ్చింది. భారతీయ మూలాలున్న కమలా హారిస్ అమెరికా అధ్యక్ష ఎన్నికల బరిలో నిలిచినట్లు వార్తు రావడం, మిషెల్ కూడా రంగంలోకి వచ్చినట్లు తేలడంతో ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి. ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ 2024 అధ్యక్ష రేసు నుంచి వైదొలగాలని నిర్ణయించగా, వైస్ ప్రెసిడెంట్ కమలా హారిస్‌కి తన సంపూర్ణ మద్దతును ప్రకటించారు. 81 ఏళ్ల బైడెన్ వయోభారంతో, అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. దేశ ప్రయోజనాల కోసం తాను పోటీ నుంచి తప్పు కొంటున్నట్లు ప్రకటించారు. డెమొక్రాట్ల సీనియర్ల ఒత్తిడిని గౌరవిస్తున్నట్లు వ్యాఖ్యానిం చారు. అయితే డెమొక్రాట్ల నుంచి కమలా హారిస్‌కే అనూహ్యమైన మద్దతు లభిస్తోంది. కాలిఫోర్నియాలోని జమైకా–అమెరికన్ ప్రొఫెసర్ డోనాల్డ్ జె హారిస్, తమిళ జీవశాస్త్రవేత్త శ్యామాల గోపాలన్ దంపతులకు కమలా దేవి హారిస్1964 అక్టోబర్ 20న జన్మించారు. కమలా హారిస్ భారత సంతతి మహిళగా గుర్తింపు పొందారు. అయితే ఆమె తల్లిదండ్రులు కొన్నాళ్లకే విడాకులు తీసుకున్నారు. అనంతరం కమలా తన తల్లితో కలిసి జీవిస్తున్నారు. ఆమె తన బ్యాచిలర్ డిగ్రీ కోసం చారిత్రాత్మక ఆల్ బ్లాక్ కళాశాల అయిన హోవార్డ్ విశ్వవిద్యాలయానికి వెళ్లారు. కమలా హారిస్ పొలిటికల్ సైన్స్, ఆర్థికశాస్త్రంలో డిగ్రీ పట్టా పొందారు. అనంతరం న్యాయశాస్త్రంలో చేరారు. 1990 లో బార్ అసోసియేషన్ సభ్యురాలిగా మారి, అదే ఏడాది కాలిఫోర్నియాలో డిప్యూటీ డిస్టిక్ట్ అటార్నీగా వృత్తిని ప్రారంభించారు. 2003లో శాన్?ఫ్రాన్సిస్కో డిస్టిక్ట్ అటార్నీగా ఎన్నికయ్యారు. 2007 చివరలో, అప్పటికే జిల్లా న్యాయవాదిగా పనిచేస్తూ.. అధ్యక్ష బరిలో నిలిచిన బరాక్ ఒబామాకు




మద్దతు తెలిపారు. ఒబామా అధ్యక్షుడైన తర్వాత 2010లో ఒకసారి, 2014లో మరోసారి అటార్నీ జనరల్‌గా విధులు నిర్వహించారు. 2017లో ఆమె తన స్వరాష్ట్రం నుంచి జూనియర్ యూఎస్ సెనేటర్ అయ్యారు. ఆరోగ్య సంస్కరణలు, పన్ను,వలసదారులకు పౌరసత్వం, తుపాకీ నియంత్రణ చట్టాల మీద ప్రచారాలతో ఆమె పేరు ప్రపంచ వ్యాప్తంగా ఒక్కసారిగా మార్మోగిపోయింది. సెనేట్‌లో పనిచేసిన రెండో ఆఫ్రికన్ అమెరికన్, తొలి ఆగ్నేయాసియా మహిళగా గుర్తింపు పొందారు. 2020లో అమెరికా అధ్యక్ష ఎన్నికల బరిలో నిలిచిన కమలా హారిస్, జో బైడెన్‌కు మద్దతుగా రేసు నుంచి తప్పుకున్నారు. అనంతరం ఆయన పాలనలో వైస్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. తాజాగా అమెరికా అధ్యక్ష బరిలో దిగుతున్నారు. ఆగస్ట్‌లో జరగనున్న ఈవెంట్‌లో డెమొక్రాట్లు తమ అధ్యక్ష అభ్యర్థిని ఎన్నుకోనున్నారు. ఈ నామినేషన్‌లో గెలిస్తే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తున్న తొలి భారత సంతతి మహిళగా కమలా హారిస్ చరిత్ర సృష్టిస్తారు.అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధిస్తే, దేశానికి మొదటి భారతీయ సంతతి మహిళ అధ్యక్షురాలు కాగలరు. 'అమెరికా అధ్యక్ష రేసులో నిలిచేందుకు అధ్యక్షుడి ఆమోదం పొందడం గౌరవంగా ఉంది,' అని కమలా పేర్కొన్నారు. జో బైడెన్ కన్నా కమలా హారిస్‌ను ఓడించడమే చాలా సులభం అని ట్రంప్ వ్యాఖ్యానించడం తో రాజకీయాలు రసవత్తరంగా మారాయి. వైట్ హౌస్ రేసు నుండి వైదొలగాలని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తీసుకున్న నిర్ణయాన్ని అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ప్రశంసించారు. బైడెన్ తీసుకున్న నిర్ణయం దేశంపై ఆయనకున్న ప్రేమను చాటుతోందని ఒబామా వ్యాఖ్యానించారు. రెండోసారి ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆయనకు అన్ని అర్హతలు ఉన్నాయని.. అయినప్పటికీ ఇలాంటి నిర్ణయం తీసుకున్నారంటే గొప్ప దేశభక్తుడని పేర్కొన్నారు. అధ్యక్షుడిగా బైడెన్ అంతర్జాతీయ వేదికపై అమెరికా గొప్పతనాన్ని ఇనుమడింపజేశారని, నాటోను పునరుజ్జీవింపజేసినట్లు తెలిపారు.ఉక్రెయిన్ – రష్యా యుద్ధానికి వ్యతిరేకంగా ప్రపంచ దేశాలను ఏకం చేశారన్నారు. అయితే రానున్న రోజుల్లో అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటాయని, అధ్యక్ష అభ్యర్థి ఎంపికలో డెమొక్రటిక్ పార్టీ ఆచితూచి అడుగులు వేయాలని అప్రమత్తం చేశారు. అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌ని అధ్యక్ష బరిలో నిలపాలని ఆ పార్టీ ఆలోచిస్తున్నా.. ఒబామా ఈ అంశాన్ని లేవనెత్తకపోవడం, అభ్యర్థి ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని అనడం పార్టీలో చర్చనీయాంశం అవుతోంది. కమలా హారిస్ అభ్యర్థిత్వానికి బైడెన్ మద్దతు ప్రకటించగా.. ఒబామా మాత్రం ఇప్పటివరకు ఆమెకు మద్దతు ప్రకటించకపోగా.. కొత్త నామినీ ఎంపిక కోసం సరైన పక్రియతో ముందుకు రావాలని పిలుపునివ్వడం చర్చనీయాంశంగా మారింది. ఒబామాను హారిస్‌కు మెంటార్‌గా చెబుతుంటారు. డెమోక్రటిక్ పార్టీకి చెందిన మరో కీలక నేత నాన్సీ పెలోసీ సైతం కమలా హారస్‌కు మద్దతు ప్రకటించక పోవడంతో పార్టీలో అంతర్గత కుమ్ములాటలు జరుగుతున్నాయనే అనుమానాలు కలుగుతున్నాయి. 2007లో జిల్లా న్యాయవాదిగా పనిచేస్తూ.. అధ్యక్ష బరిలో నిలిచిన బరాక్ ఒబామాకు కమలా.. మద్దతు తెలిపారు. ఒబామా అధ్యక్షుడైన తర్వాత 2010లో ఆమె అటార్నీ జనరల్‌గా విధులు నిర్వహించారు. ఇకపోతే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థిగా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా భార్య మిషెల్ ఒబామా ను బరిలో నిలుపుతారనే ఊహాగానాలు కూడా బలపడుతున్నాయి. పోటీ నుంచి తాను తప్పుకుంటున్నట్లు బైడెన్ ప్రకటించిన తరువాత మిషెల్ ఒబామా పేరు సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా నిలిచింది. ఓ వైపు కమలా హ్యారిసే డెమొక్రటిక్ పార్టీ తరఫున పోటీలో ఉంటుందని అంతా అనుకుంటుండగా.. మిషెల్ ఒబామా పేరు బయటకి రావడం గమనార్హం. ఆమె అభ్యర్థిత్వానికి పార్టీలోని చాలా మంది అనుకూలంగా ఉన్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. అమెరికా అధ్యక్ష ఎన్నికలకు మూడు నెలలు ముందు ఆగస్టులో జరిగే డెమోక్రాటిక్ నేషనల్ కన్వెన్షన్‌లో ఆ పార్టీ అభ్యర్థిగా మిషెల్ ఒబామాను ప్రకటించే అవకాశాలున్నాయని డెమోక్రాట్లు అభిప్రాయపడుతున్నారు. ది సెంటర్ స్క్వేర్ ఓటర్స్ వాయిస్ ఇటీవలే నిర్వహించిన సర్వే ప్రకారం.. అమెరికా ఓటర్లు తమ తదుపరి అధ్యక్ష అభ్యర్థిగా మిషెల్‌నే కోరుకుంటునట్లు తేలింది. ఈ సర్వేలో కమలా హారిస్ కంటే మిషెల్‌కే ఎక్కువ మద్దతు లభించింది. కమలా హారిస్ అభ్యర్థి త్వానికి బైడెన్ మద్దతు ప్రకటించగా.. ఒబామా మాత్రం ఇప్పటివరకు ఆమెకు మద్దతు ప్రకటించకపోగా.. కొత్త నామినీ ఎంపిక కోసం సరైన పక్రియతో ముందుకురావాలని పిలుపునివ్వడం చర్చనీయాంశంగా మారింది. అయితే ఒబామా లెక్కలు వేరేగా ఉన్నాయని.. తన భార్యను అధ్యక్ష బరిలోకి దింపడానికే కమలాకు మద్దతు ప్రకటించట్లేదని అంతర్గతంగా చర్చ నడుస్తోంది. సాధారణంగా అమెరికాకు ఒక్కరు గరిష్ఠంగా రెండుసార్లు అధ్యక్షులుగా వ్యవహరించొచ్చు. ఒబామా రెండు పర్యాయాలు అమెరికా అధ్యక్షుడిగా పని చేశారు. ఇదే సమయంలో మిషెల్ ఒబామాకు నెటిజన్ల నుంచి మద్దతు వస్తోంది. ట్రంప్‌ని ఓడించగల ఒకే ఒక్క వ్యక్తి మిషెల్ అని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. 'దయచేసి మిషెల్ ఒబామాపై దృష్టి పెట్టండి. కమలా హారిస్‌ని పోటీలో నిలపకండి. ఆమెకు ప్రజా సమస్యలు పట్టవు. ట్రంప్‌ని ఓడించలేరు' అని ఓ నెటిజన్ కామెంట్ చేశాడు. డెమోక్రటిక్ నేషనల్ కమిటీ కన్వెన్షన్ ఆగస్టు 19న చికాగోలో ప్రారంభం కానుంది. నవంబర్‌లో జరిగే సాధారణ ఎన్నికలకు తమ అభ్యర్థిని ఎన్నుకునేందుకు దేశవ్యాప్తంగా దాదాపు 4 వేల మంది ప్రతినిధులు ఇక్కడ సమావేశమవుతారు. ఆ తరువాత అభ్యర్థులు అధ్యక్ష బరిలో నిలుస్తున్నట్లు నామినేషన్‌లు సమర్పిస్తారు. నవంబర్‌లో అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరుగుతాయి.

# జగన్ రెడ్డి మాటలు.. దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది

సూర్యవాస్తవం, మంగళగిరి ప్రతినిధి:
వైసీపీ నేతలకు అబద్దాలు ఆడటం వెన్నతో పెట్టిన విద్యని... దెయ్యాలు వేదాలు వల్లించినట్లు జగన్ రెడ్డి, ఆపార్టీ నేతలు మాట్లాడుతున్నారని.. మంత్రి గుమ్మడి సంధ్యా రాణి అన్నారు. మంగళగిరి టీడీపీ జాతీయ ప్రధాన కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిగ్గులేకుండా డ్రైవర్ ను చంపి డోర్ డెలివరి చేసిన వ్యక్తి కూడా ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటూ ప్లకార్డులతో నేడు నిరసన చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ.. చంద్రబాబు ముందుచూపుకు ఆయన కార్యదక్షతకు ఎన్ని జన్మలెత్తిన ఆయన రుణం తీర్చుకోలేము. నేడు టీడీపీ జాతీయ ఉపాధ్యక్షురాలు శ్రీమతి కావలి ప్రతిభా భారతి గారు చూసిన గ్రీవెన్స్ లో వచ్చిన అర్జీలు అన్నీ కూడా వైసీపీలో జరిగిన అరాచకాలపైనే. గత ఐదేళ్లు అంబేద్కర్ రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి... రాజారెడ్డి రాజ్యాంగాన్ని నడిపారు. నేడు సిగ్గులేకుండా ప్రజాస్వామ్యం భాగలేదని... ప్రజాస్వామ్యం ఇబ్బంది పడుతుందని మాట్లాడుతున్నారు. గవర్నర్ దగ్గరకు వెళ్లి వైసీపీ నేతలు లెటర్ ఇవ్వడం రాష్ట్ర పతి పాలన పెట్టాలని కోరడం చూస్తుంటే నవ్వు వస్తోంది. గురిగింజ తనకింద ఉన్న నలుపును చూసుకోకుండా మాట్లాడినట్లు వైసీపీ నేతలు మాట్లాడుతున్నారు. దెబ్బలాటకు, కోట్లాటకు ఆద్యులే వైసీపీ నేతలు. సొంత బాబాయి చనిపోయినప్పుడు గవర్నర్ దగ్గరకు వెళ్లి జగన్ రెడ్డి ఎందుకు అర్జీ ఇవ్వలేదు? వివేకానందరెడ్డిని కండకండాలుగా గొడలితో నరికి చంపి గుండెపోటు డ్రామాలు ఆడి నేడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్నారా సిగ్గులేకుండా. మీ చినాన్న హత్యపై సొంత అక్కచెల్లెల్లు పోరాడుతుంటే ఎందుకు జగన్ రెడ్డి మౌనంగా ఉంటున్నారు.? నేడు ఢిల్లీకి వెళ్లి వివేకానందరెడ్డి హత్యపై సీబీఐ ఎంక్వైరీకి ఢిమాండ్ చేయగలవా జగన్ రెడ్డి ? గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రతి రోజు కూడా రాష్ట్రపతి పాలన పెట్టాల్సిన రోజు. కక్షపూరితంగా ఎవరైనా కొట్టుకుంటే దాన్ని కూటమికి ఆపాధిస్తూ విమర్శలు చేస్తున్నారు. వైసీపీ నేతలకు అబద్దాలు ఆడటం వెన్నతో పెట్టిన హత్య. 30 వేల మంది ఆడపిల్లలు కనిపించకుండా పోతే ఒక్క రోజు కూడా జగన్ రెడ్డి ఒక్క మాట మాట్లాడలేదు. నేడు 36 మంది చనిపోయారని పచ్చి అబద్దాలు ఆడుతున్నాడు. చిన్నపిల్లలకు చాక్లెట్ ఇస్తే బయటకు వచ్చినట్లు.. జగన్ రెడ్డికి శవం కనిపిస్తే బయటకు వస్తున్నాడు. ఎవరైనా చనిపోతే.. ఎలా మాట్లాడాలో కూడా జగన్ రెడ్డికి తెలియడంలేదు.. ఒక సైకోలా నవ్వుతూ బాధితుల వద్ద పథకాల గురించి మాట్లాడుతున్నాడు. డాక్టర్ సుధాకర్ ను నడిరోడ్డుపై చంపినప్పుడు ఎందుకు మాట్లాడలేదు జగన్ రెడ్డి. డాక్టర్ అచ్చెన్న, డాక్టర్ సుధారాణిని ఇబ్బంది పెట్టినప్పుడు ఎందుకు మాట్లాడలేదు? ఒక డ్రైవర్ ను చంపేసి డోర్ డెలివరి చేసిన వ్యక్తి నేడు ప్లకార్డులతో ప్రజాస్వామ్యం గుచించి మాట్లాడటం హాస్యాస్పదం. కోడికత్తి శ్రీను, ఓం ప్రతాప్, హనుమాయమ్మ, స్నేహలత, రమ్య, వెంకాయమ్మ, శాంకుమార్, కర్రి శ్రీకాంత్, జర్జి రామకృష్ణ వీళ్లు గుర్తులేదా...? ఇలా ఎంతమంది మీ చేతుల్లో హతులు అయ్యారో కదా జగన్ రెడ్డి. నిజంగా మీరు ప్రజాస్వామ్యాన్ని కోరుకొని ఉంటే మీ చిన్నాన్నను ఎవరు చంపారో సీబీఐ ఎంక్వైరీ కోరండి. సీబీఐ అధికారులు వస్తే బాంబులు వేస్తామన్న వైసీపీ నేతలు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం చాలా దౌర్భాగ్యం. గత ఐదేళ్లు ప్రజాస్వామ్యంలో ఉన్నామా.. బ్రిటీస్ పాలనలో ఉన్నామా అని ప్రజలు మధనపడ్డారు. ఎప్పుడు ఈ దుర్మార్గుడి సైకో పాలన పోతుందా అని ఎదురు చూశారు. రాత్రి 11 వరకు క్యూలో నిలబడి చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించుకున్నారు. నా భూతో నా భవిష్యత్ అన్నట్లు 164 సీట్లతో గెలిపించుకున్నారు. ప్రమాణ స్వీకారం చేయడానికి కూడా ఓపిక లేని వైసీపీ నేతలు ప్రజాస్వామం గురించి మాట్లాడటం సిగ్గు చేటు. అసలు వైసీపీ నేతలకు పరువేలేదు. వైసీపీ నేతల అరాచకాలను వద్దనే ప్రజలు వారి పాలనను పాతిపెట్టారు. మాకు చంద్రబాబు క్రమశిక్షణ నేర్పించారు. నిజంగా మేము కక్ష సాధింపు చేయాలనుకుంటే మా నాయకుడు ఒక కంటి సైగ చాలు. మేము అక్కర్లేదు... వైసీపీ నేతల చేతిలో బాధింపబడిన కార్యకర్తలే వైసీపీ నేతలకు బుద్ధి చెబుతారు. కాని వైసీపీ నేతలు తప్పు చేశారని మేము తప్పు చేయకూడదని.. వైసీపీ నేతలు గడ్డి తిన్నారని మేము తినకూడదని... ప్రజాస్వామ్యంగా నడుచుకోవాలని మా నాయకుడు మాకు సూచించారు. 53 రోజులు జైల్లో పెట్టి మా నాయకుడిని ఎంతో ఇబ్బంది పెట్టారు. అయినా మా నాయకుడు హింసకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు వైసీపీ నేతలు కవాలనే కవ్వింపు చర్యలకు దిగుతున్నారు. ఐదేళ్లు బయటకు రాని వ్యక్తి శవం కనిపించగానే బయటకు వచ్చాడు. బాధితుల దగ్గరకు వచ్చిన నాయడు ఏమి మాట్లాడాలి... వారి కష్ట సుఖాల గురించి తెలుసుకోవాలని కాని జగన్ రెడ్డి మాటలను చూస్తే తనకు బుర్రపోయింది అనుకోవాల్సిందే. ప్రజలు సైకో చేష్టలను గమనించాలి. ఎల్లప్పుడూ మేము పార్టీ ఆఫీసులో ప్రజలు, కార్యకర్తలకోసం అందుబాటులో ఉంటాం. ఎవరికైనా ఇబ్బంది ఉంటే వచ్చి చెప్పాలి. చట్టపరంగా ముందుకు వెళ్తాం. ఎటువంటి ఆవేశాలకు లోనుకావద్దు. కావలి ప్రతిభా భారతి మాట్లాడుతూ.. అటు రాయలసీమ నుండి ఇటు శ్రీకాకుళం వరకు ప్రజలు అర్జీలు తీసుకుని వస్తున్నారు.. వాటిని క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత డిపార్ట్ మెంట్ లకు పంపించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం. మా నాయకుడు చంద్రబాబు ప్రజా శ్రేయస్సును కోరుకునే వ్యక్తి.. ఆయన బాటలోనే నాయకులు కార్యాలయంలో అందుబాటులో ఉంటూ. వివిధ సమస్యలపై కార్యాలయానికి వస్తున్న ప్రతి అర్జీని పరిశీలించి ప్రజల సమస్యలకు పరిష్కారం చూపుతున్నాం. గత ఐదేళ్లలో జగన్ రెడ్డి ఒక్క అర్జీని తీసుకోలేదు. ఒక్క రోజు కూడా ప్రజలను కలవలేదు. బయటకు రావాలంటే పరదాలు కట్టుకున్నాడు. పోలీసుల పహారా పెట్టుకున్నాడు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్న ప్రజా నాయకుడు ఎవరో ప్రజలే గమనించాలి. ప్రజా ప్రభుత్వం ఏదో ప్రజలే అర్థం చేసుకోవాలి.

## స్థానిక వనరులను ప్రదర్శిస్తూ బోధించాలి... ప్రధానోపధ్యాయురాలు భ్రమరాంబ

పత్తికొండ టౌన్ (సూర్య వాస్తవం):
పత్తికొండ స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం నాడు "శిక్షా సప్తాహ్"కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు







భ్రమరాంబ ప్రారంభించారు.ఇందులో భాగంగా మొదటి రోజు 22 వ తేదిన" స్థానిక వనరులతో బోధన సామాగ్రి ప్రదర్శన" కు సంభందించిన అంశమును దృష్టిలో ఉంచుకొని వనరులను ప్రదర్శిస్తూ పిల్లలకు బోధించాలి అని తెలియచేసారు.ఈ సందర్భంగా ఆమె బోధనలో స్థానిక వనరుల ప్రాముఖ్యతను టీచర్లకు,పిల్లలకు తెలిపారు. .పిల్లలు అనేక రకాల బోధన సామాగ్రినీ ,నమూనాలను తయారుచేసి, సేకరించి ప్రదర్శనకు ఉంచారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు ,విద్యార్థినిలు పాల్గొన్నారు.

## ఏమిటీ క్రౌడ్ స్ట్రైక్?

సూర్యవాస్తవం, ప్రత్యేక ప్రతినిధి:
క్రౌడ్ స్ట్రైక్ అనేది అమెరికాకు ఓ సైబర్ సెక్యూరిటీ సంస్థ. విండోస్‌తో పాటు దిగ్గజ ఐటీ సంస్థలకు అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీని అందిస్తుంటుంది. ప్రభుత్వ సంస్థలతోపాటు కీలకమైన బ్యాంకింగ్, ఎయిర్‌లైన్స్ నిర్వహణ




సంస్థలకు సేవలు అందిస్తుంది. 2011లో ఏర్పడిన ఈ సంస్థ సైబర్ దాడులను దీటుగా ఎదుర్కొంటుందనే పేరుంది. అందుకే అమెరికా ప్రభుత్వ విభాగాలు కూడా ఈ సర్వీసులు పొందుతోంది. తాజాగా విండోస్ సిస్టమ్స్‌లో నెలకొన్న బ్లూ స్క్రీన్ ఎర్రర్‌కు క్రౌడ్‌స్ట్రైక్ నుంచి వచ్చిన ఓ అప్‌డేట్ కారణమని అంచనా వేశారు. సిస్టమ్‌లు షట్‌డౌన్ గానీ, రీస్టార్ట్ అవుతుండటంతో అనేక రంగాల సేవల్లో తీవ్ర అంతరాయం ఏర్పడింది.

## హారిక భౌతికకాయం తరలింపులో ఇబ్బందులు.. స్పందించిన మంత్రి లోకేశ్

గుంటూరు జిల్లా/తెనాలి:సూర్యవాస్తవం, ప్రత్యేక ప్రతినిధి:
అమెరికాలో రోడ్డుప్రమాదంలో తెనాలికి చెందిన పశువైద్యురాలు హారిక మృతి పట్ల ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హారిక భౌతికకాయాన్ని స్వస్థలానికి తీసుకొచ్చేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, సాయం చేయాలని తెదేపా సామాజిక మాధ్యమం కార్యకర్త స్వాతిరెడ్డి 'ఎక్స్' వేదికగా మంత్రి లోకేశ్ను కోరారు. ఆ పోస్టుకు స్పందించిన మంత్రి.. హారిక కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఆమె భౌతికకాయం త్వరగా స్వస్థలానికి తెప్పించేలా ఎన్నారై తెదేపా విభాగం కృషి చేస్తోందని వెల్లడించారు.

## లోకేశ్ ఛాంబర్‌లో బీజేపీ నేతలు - తమ పార్టీలో వైసీపీ నేతల చేరికలపై చర్చ

అమరావతి,సూర్యవాస్తవం, ప్రత్యేక ప్రతినిధి:
అసెంబ్లీలోని మంత్రి ఛాంబర్‌లో నారా లోకేశ్‌తో బీజేపీ నేతలు సమావేశమయ్యారు. వైఎస్సార్‌సీపీ నేతలు బీజేపీలో చేరికపై మంత్రి లోకేశ్ , కూటమి నేతల మధ్య ఆసక్తికర చర్చ జరిగింది. మంత్రి సత్యకుమార్ యాదవ్ , ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కామినేని శ్రీనివాస్, విష్ణుకుమార్ రాజు, పార్థసారథి, ఈశ్వరరావు లోకేశ్‌ను కలిశారు. తొందరపాటు నిర్ణయాలు తీసుకోవట్లేదని బీజేపీ నేతలు తెలిపారు. అలాంటిది ఏమైనా ఉంటే కలిసి కూర్చుని చర్చించిన తర్వాతే నిర్ణయం ఉంటుందని బీజేపీ ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు.

## ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో కూటమి ప్యానల్ విజయం

రాజమహేంద్రవరం, సూర్యవాస్తవం, ప్రత్యేక ప్రతినిధి:
ప్రతిష్ఠాత్మకంగా జరిగిన రాజమహేంద్రవరం ది ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో కూటమి ప్యానల్ విజయం సాధించింది. చల్లా శంకర్రావు ఛైర్మన్ అభ్యర్థిగా మొత్తం పదిమంది సభ్యులు గెలుపొందారు. బ్యాంకు పాలకవర్గ ఎన్నికలు ఈనెల 20న జరిగిన విషయం తెలిసిందే.



కౌంటింగ్ కోసం ఎస్‌కేవీటీ కళాశాలలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్ ప్రక్రియ రాత్రి వరకు కొనసాగగా గెలుపొందిన విజేతలను అర్ధరాత్రి సమయంలో ఎన్నికల అధికారి కృష్ణకాంత్ ప్రకటించారు. సార్వత్రిక ఎన్నికలను తలపించిన పోరులో వైఎస్సార్సీపీ తరఫున బరిలో దిగిన శ్రీనివాస్ ప్యానల్‌పై కూటమి తరఫున పాల్గొన్న చల్లా శంకర్రావు ప్యానల్ విజయం సాధించింది.

## విద్యార్థులందరికీ ఉద్యోగావకాశాల కల్పనకు ఎస్సార్ఐటీ కృషి

ప్రొద్దుటూరు, (సూర్య వాస్తవం): విద్యార్థులందరికీ ఉద్యోగావకాశాల కల్పనకు ఎస్సార్ఐటీ కళాశాల కృషి చేస్తుందని కళాశాల ప్రిన్సిపాల్ పాండురంగన్ రవి తెలిపారు. స్థానిక సాయి రాజేశ్వరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగు కళాశాలలో సోమవారం బి.టెక్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం పొందిన నూతన విద్యార్థినీ విద్యార్థులకు ఓరియెంటేషన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ తమ కళాశాల 2009లో బాలాజి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి అండ్ సైన్స్ పేరుతో స్థాపించబడిందని, 200 మంది విద్యార్థులతో మొదలై 2016లో సాయి రాజేశ్వరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజిగా మార్చబడి అనుభవజ్ఞులైన ప్రొఫెస్సర్స్ మరియు అధ్యాపకులచే ఉత్తమ బోధనతో పాటు మౌలిక సదుపాయాలు, అధినతనమైన ల్యాబోరేటరీలు, డిజిటల్ లైబ్రరీ, విశాలమైన క్రీడా మైదానం, రవాణా సౌకర్యము మొదలగునవి కలిగి, న్యాక్, ఎన్.బి.ఏ గుర్తింపు పొంది 2023 లో అటానమస్ పొంది, ప్రతి విద్యార్థికి 100% ఉద్యోగ కల్పన కల్పిస్తూ నేడు 2000 మంది విద్యార్థులతో కొనసాగుతుందని చెప్పడానికి గర్వంగా ఉందన్నారు. కరస్పాండెంట్ బసిరెడ్డి వీర కళ్యాణ్ రెడ్డి విద్యార్థులకు ఆహ్వానం పలికి తమ కళాశాలలో చేసిన ప్రతి విద్యార్థికి ఉద్యోగ అవకాశాలను కుర్తించడానికి మెనేజ్మెంట్ కృషి చేస్తుందన్నారు. ఛైర్మెన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీర కుమార్ రెడ్డి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, హెఓడిలు, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు




పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో ఓ మహిళ కడుపులో3 కిలోలకణితి వెలికితీత
### ఆరోగ్యంగా ఉన్న మహిళ

హిందూపురం జులై 22 సూర్య వాస్తవం
హిందూపురం జిల్లాస్థాయి ప్రభుత్వ ఆసుపత్రి లోఅబ్బురపరిచే విధంగా ఓ మహిళ కడుపులో ఉన్న 3 కిలోలకణితినిఆపరేషన్ ద్వారా తొలగించిమహిళకు ప్రాణ బిక్ష ప్రసాదించినసంఘటన వెలుగు చూసింది ,ఈ సందర్భంగా మున్సిపల్ పరిధిలోని మోత్కుపల్లి గ్రామానికిచెందిన కల్పన అనే మహిళ కొన్ని నెలలుగా కడుపునొప్పి బాధతో ఇబ్బందులు పడుతుండేది,కడుపునొప్పి నయం



కోసం హిందూపురం,అనంతపురం పుట్టపర్తి తదితరప్రాంతాల్లోని ఆస్పత్రులన్నీ తిరిగి విసిగి పోయారు ,కొంతమంది సూచన మేరకు సోమవారం హిందూపురం ప్రభుత్వాసుపత్రిలో కల్పన అనే మహిళ కడుపునొప్పి బాధతో అడ్మిట్ అయింది
వెంటనే ఆసుపత్రి సూపరింటెంట్ రోహిల్ కుమార్, డాక్టర్ బాబు బుడెన్ ప్రత్యేక శ్రద్ధ కనపరిచి మహిళకు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు, అందులో ఓ గడ్డ ఉన్నట్లు వైద్య పరీక్షల్లో నిర్ధారించారు,వెనువెంటనే మహిళా వైద్య సిబ్బంది సునీత రాణి, సుమలత, ఎంఎన్‌ఓ నాగరాజు, డాక్టర్ లక్ష్మీరాం నాయక్ సహకారంతో డాక్టర్ బాబు బుడెన్ దాదాపు1-30 గంటపాటు ఆపరేషన్ నిర్వహించి 3 కిలోలకణి తిని వెలికి తీశారు ,ఎంతో మానవత్వంతో తమ వృత్తి ధర్మాన్ని పాటిస్తూ అబ్బురపరిచే విధంగా ఓ మహిళా కడుపులో ఉన్న కనితిని వెలికితీయడంతో బాధితురాలి కుటుంబ సభ్యులతో పాటు పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు, ప్రస్తుతం మహిళ ఆరోగ్యంగా ఉండడంతో ఇటు కుటుంబ సభ్యులు అటువైద్య సిబ్బంది తమ ఆనందాన్ని వెలిబుచ్చారు,గతంలోఎన్నడు లేని విధంగా హిందూపురం ప్రభుత్వాసుపత్రిలో ఇలాంటి అద్భుతమైన ఆపరేషన్ నిర్వహించడంతో పలువురికి ప్రభుత్వ వైద్యం పట్ల నమ్మకం ఏర్పడే అవకాశం ఉంది, పేద ధనిక తారతమ్యం లేకుండా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు అన్ని వివిధాల వైద్య సేవలు,అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు నిర్వహించి ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దుతామని ఆసుపత్రి సూపర్డెంట్ రోహిల్ కుమార్ పేర్కొన్నారు, ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా ప్రత్యేకంగా ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రోత్సాహంతో హిందూపురం ప్రభుత్వాసుపత్రిని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తూ సక్రమమైన పద్ధతిలో వైద్య సేవలు అందిస్తామని తెలిపారు,

## కార్యకర్తల కోసం కలిసి పని చేద్దాం
### జనసేన పార్టీ నాయకుడు మణికంఠ, గుత్తి ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణ

గుంతకల్ సూర్య వాస్తవం
టిడిపి గుత్తి మండల ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణ జనసేన పార్టీ నాయకులు గుంతకల్ నియోజకవర్గం సమన్వయకర్త వాసగిరి మణికంఠను సోమవారం తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.
ఈ సందర్భంగా గుమ్మనూరు నారాయణ ను వాసగిరి మణికంఠ జనసేన నాయకులు జనసైనికులు శాలువాతో సత్కరించి జనసేన పార్టీ మూల సిద్ధాంతాల్లో ఒకటైన పర్యావరణాన్ని పరిరక్షించే అభివృద్ధి ప్రస్థానంలో భాగంగా మొక్కను బహుకరించారు. అనంతరం ఇరువురు నాయకులు మాట్లాడుతూ గుత్తి త్రాగునీరు శాశ్వత సమస్య పరిష్కారానికి చేపడుతున్న చేపట్టబోయే కార్యాచరణ విషయానికి సంబంధించిన గ్రామీణ అభివృద్ధి పంచాయతీరాజ్ అభివృద్ధి కి సంబంధించి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారం ఉండబోతుంది తద్వారా గ్రామ స్వరాజ్యమే ధ్యేయంగా ముందుకు వెళ్తామని ముఖ్యంగా ప్రభుత్వంలో సామాన్య ప్రజలందరికీ సంక్షేమ పథకాలు దక్కేలా చూస్తూ కూటమి విజయానికి కష్టపడిన నాయకులందరికీ సముచిత స్థానం దక్కేలా కృషి చేస్తామని ఇరువురు నాయకులు పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున యువత, జనసేన జిల్లా కార్యక్రమాల నిర్వహణ కమిటీ సభ్యుడు పవర్ శేఖర్, మైనార్టీ నాయకుడు దాదు, జనసేన సీనియర్ నాయకులు ఆటో రామకృష్ణ, గాజులు రాఘవేంద్ర, కసాపురం నందా, శ్రీ సుబ్బయ్య, కథల వీధి అంజి, సుంకర నాగరాజు, అమర్,




లారెన్స్, కృష్ణ, అల్లు రవి టిడిపి నాయకులు శ్రీధర్, సూరి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నీట్ పేపర్ లీకేజీపై లోక్‌సభలో దుమారం

మొదటిపేజీ తరువాయి..

సమాధానమిస్తూ, ప్రభుత్వానికి ఎలాంటి దాపరికారాలు లేవని అన్నారు. ప్రశ్నోత్తరాల సమయంలో 'నీట్' పరీక్షా పత్రం లీకేజీ అంశాన్ని రాహుల్ లేవనెత్తుతూ, పేపర్ లీక్‌పై మంత్రి తనను తప్ప అందరినీ నిందించారని అన్నారు. 'నీట్' విషయంలోనే కాకుండా మన పరీక్షా విధానంలో చాలా తీవ్రమైన సమస్య ఉందని యావద్దేశానికి స్పష్టంగా అర్థమైందని, అయితే మంత్రి మాత్రం తనను తాను మినహాయించుకుని అందరినీ నిందించారని అన్నారు. అసలిక్కడ ఏమి జరుగుతోందో దాని మౌలిక సూత్రాలను కూడా ఆయన అర్థం చేసుకున్నట్టు తనకు అనిపించడం లేదన్నారు. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ అఖిలేష్ యాదవ్ కేంద్రంపై విమర్శలు గుప్పిస్తూ, ప్రశ్నాపత్రాల లీకేజీలో ప్రభుత్వం రికార్డు సృష్టించిందని అన్నారు. కొన్ని సెంటర్లలో 2000 మందికి పైగా పాసయ్యారని, విద్యాశాఖ మంత్రి ఇక్కడ ఉన్నంతవరకూ విద్యార్థులకు న్యాయం జరగదని అన్నారు.
నీట్ ప్రశ్నాపత్నం లీకేజీ వ్యవహారంపై విపక్ష సభ్యులు అడిగిన ప్రశ్నకు ధర్మేంద్ర ప్రధాన్ సమాధానమిస్తూ, ప్రభుత్వం ఏదీ దాచిపెట్టడం లేదని, నిజానిజాలను సుప్రీంకోర్టుకు తెలియజేసిందని, ప్రస్తుతం ఈ కేసు సుప్రీంకోర్టు విచారణలో ఉందని చెప్పారు. కోర్టు ఇచ్చే ఆదేశాల గురించి మనం ఎదురుచూద్దామని చెప్పారు. ఈ ఏడాది మే 5న నీట్-యూజీ పరీక్ష జరిగినప్పుడు పాట్నాలో పేపర్ లీక్ చోటుచేసుకోవడం మినహా గత ఏడేళ్లలో ఎలాంటి పేపర్ లీకేజీలు లేవన్నారు. ప్రస్తుతం నీట్ పేపర్ లేకేజీ వ్యవహారంపై సీజేఐ నేతృత్వంలో విచారణ జరుగుతున్నందున వాస్తవాలన్నీ బయటకు వస్తాయని చెప్పారు. ఎన్‌టీఏ ఏర్పాటు చేసినప్పటి నుంచి 240కి పైగా పరీక్షలు నిర్వహించడం జరిగిందని, 5 కోట్ల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 4.5 కోట్ల మంది పరీక్షలకు హాజరయ్యారని చెప్పారు. కేంద్రంలో ఎన్డీయే సర్కారు మూడోసారి కొలువుదీరిన తర్వాత సోమవారం నుంచి బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా దేశవ్యాప్తంగా దుమారం సృష్టిస్తోన్న నీట్ పేపర్ లీక్ అంశం చర్చకు వచ్చింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నీట్ అంశంపై మాట్లాడుతుంటే.. విపక్షాలు నిరసన వ్యక్తంచేశాయి. ప్రతిపక్ష ఎంపీల నినాదాలతో సభలో గందరగోళ వాతావరణం నెలకొంది. మరోవైపు.. ఈ అంశంపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ కేంద్రంపై విమర్శలు చేశారు. భారత పరీక్షా వ్యవస్థ ఒక మోసమంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ పేపర్ లీక్‌లపై విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తనను తప్ప అందరినీ నిందిస్తున్నారన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ.. 'గత ఏడేళ్ల కాలంలో పేపర్ లీక్ జరిగిన దాఖలాలు లేవు. ఎన్టీఏ ఇప్పటివరకు 240 పరీక్షలను విజయవంతంగా నిర్వహించింది. ప్రస్తుతం నీట్ లీకేజీ వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది' అని వెల్లడించారు. ఈ ప్రభుత్వం పేపర్‌లీక్‌ల విషయంలో రికార్డు సృష్టిస్తుందని ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ప్రధాన్ విద్యాశాఖ మంత్రిగా ఉన్నంతకాలం విద్యార్థులకు న్యాయం దక్కదన్నారు. ఇదిలాఉంటే.. కావడి (కన్వర్) యాత్ర మార్గంలో హోటళ్లపై యజమానుల పేర్లు రాయాలంటూ ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం తీసుకువచ్చిన నిబంధనను విపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి. దీనిపై చర్చ జరపాలంటూ రాజ్యసభలో ప్రతిపక్ష ఎంపీలు ఇచ్చిన నోటీసులను ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ తిరస్కరించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పశ్చిమబెంగాల్‌లోని అసన్‌సోల్ నుంచి శత్రుఘ్న సిన్హా ఎంపీగా విజయం సాధించారు. ఆయన జూన్‌లో జరిగిన పార్లమెంట్ సమావేశాల సమయంలో ఎంపీగా ప్రమాణ స్వీకారం చేయలేకపోయారు. ఇప్పుడు సభ ప్రారంభం కాగానే ఆయన ప్రమాణం చేశారు.

## నీట్ అవకతవలకపై సుప్రీంలో విచారణ

మొదటిపేజీ తరువాయి..

మార్కులు మాత్రం ఒక్కదానికే వేశారంటూ పిటిషనర్లు వాదించారు. దానికి మార్కులు ఇచ్చినా, ఇవ్వకపోయినా మెరిట్ లిస్టు మారే అవకాశం ఉందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. పిటిషనర్ల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న సుప్రీం ధర్మాసనం.. సదరు ప్రశ్నకు సరైన సమాధానం కోసం సంబంధిత సబ్జెక్టుకు చెందిన ముగ్గురు నిపుణులను ఏర్పాటు చేసి, మంగళవారం మధ్యాహ్నం 12 గంటలలోపు దానిపై సమాధానం సమర్పించాలని ఐఐటీ- దిల్లీ డైరెక్టర్‌ను ఆదేశించింది. తదుపరి విచారణ మంగళవారానికి వాయిదా వేసింది. అంతకుముందు ఇదే అంశంపై వాదనలు విన్న సుప్రీం ధర్మాసనం.. మే 4కు ముందే పేపర్ లీక్ అయి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేసింది. బిహార్ పోలీసుల దర్యాప్తు నివేదికను ప్రస్తావిస్తూ.. స్ట్రాంగ్ రూమ్ నుంచే ప్రశ్నపత్రం బయటకు వచ్చిందా? అని ప్రశ్నించింది. ఈసందర్భంగా నిందితులకు మే4వ తేదీ రాత్రి గుర్తుంచుకోవాలని చెప్పారంటే.. లీక్ ఆ తేదీ కంటే ముందే జరిగి ఉండొచ్చని సీజేఐ డీవై చంద్రచూడ్ అనుమానం వ్యక్తంచేశారు. అలా అయితే.. స్ట్రాంగ్ రూమ్ వాలెట్‌లో ప్రశ్నపత్రం బయటకు వచ్చిందా.. అని ప్రశ్నించారు. బిహార్ పోలీసుల దర్యాప్తు రిపోర్టును ఉటంకిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అంతకు ముందు పిటిషనర్ల పక్షాన వాదిస్తున్న న్యాయవాది నరేందర్ హుడా తన వాదనలు వినిపిస్తూ..161 వాంగ్మూలాలు పేపర్ లీక్ మే 4వ తేదీ కంటే ముందే చోటుచేసుకొందని బలంగా చెబుతున్నట్లు పేర్కొన్నారు. బిహార్ పోలీసుల రిపోర్టు ప్రకారం సంబంధిత బ్యాంకుల్లో ప్రశ్నపత్రాలను డిపాజిట్ చేయటానికి ముందే లీకైందని పేర్కొన్నారు. మే 3వ తేదీ లేదా అంతకంటే ముందే పేపర్ బయటకు వెళ్లిండొచ్చని పేర్కొన్నారు. ఇదేదో 5-10 మంది విద్యార్థుల కోసం చేసిన లీకేజీ కాదని హుడా కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. కచ్చితంగా ఓ గ్యాంగ్ ఎప్పటినుంచో ఈ పని చేస్తోందని పేర్కొన్నారు. సంజీవ్ ముఖియా, ఇతర కీలక నిందితులు అరెస్టు కాలేదనే విషయాన్ని గుర్తు చేశారు. ఒకచోట ప్రశ్నపత్రాన్ని రిక్షాలో కూడా తరలించారని ఆయన న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. ప్రస్తుతం కోర్టులో వాదనలు జరుగుతున్నాయి.
నీట్-యూజీ 2024కు సంబంధించి దాఖలైన పిటిషన్లపై సోమవారం నుంచి సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది.

## మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన అగ్నిప్రమాదంపై సిట్టింగ్ సిఐడి,సిట్టింగ్ జడ్జిలతో విచారణ చేపట్టాలి

లక్కిరెడ్డిపల్లి సూర్య వాస్తవం
మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన అగ్నిప్రమాదంపై అనేక అనుమానాలు ఉన్నాయని, భూ అక్రమ కబ్జాదారులు తమ గుట్టు బయటపడుతుందన్న ఉద్దేశంతో గుట్టు చప్పుడు కాకుండా కాగితాలు తగలబెట్టారని, జరిగిన అగ్నిప్రమాదం పై సిట్టింగ్ సిఐడి,సిట్టింగ్ జడ్జిలతో పూర్తిస్థాయిలో విచారణ



చేపట్టాలని సిపిఐ (ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ ఎం అంకన్న డిమాండ్ చేశారు.సోమవారం ఆయన లక్కిరెడ్డిపల్లి విలేకరులతో మాట్లాడుతూ మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో విలువైన పత్రాలు ఉన్నాయని వైసీపీ నాయకులు భూ అక్రమాలు తమ ఇష్టానుసారం దోచుకున్నారని,వారి అక్రమాలు ఎక్కడ బయటపడతాయి అన్న ఉద్దేశంతో ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్నారని,ఏది ఏమైనా పూర్తిస్థాయిలో సిఐడి విచారణ చేపట్టి నిజాలు బయటపెట్టాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.జరిగిన ఘటన దృశ్యాలను సిసి కెమెరాలు ద్వారా పరిశీలించి నిందితులను పట్టుకొని శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

## డీజీపీ గారూ... గత ప్రభుత్వ హయాంకి, ఇప్పటికి చట్టాల్లో ఏమైనా మార్పులు వచ్చాయా?: వర్ల రామయ్య

### సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ నేత నాగార్జున యాదవ్
### అదుపులోకి తీసుకుని 41ఏ కింద నోటీసులు ఇచ్చి వదిలిపెట్టిన పోలీసులు
### నాగార్జున యాదవ్ ను పోలీసులు వదిలేశారన్న వార్తలపై తీవ్రంగా స్పందించిన వర్ల రామయ్య

అమరావతి,సూర్య వాస్తవం
ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ మంత్రి నారా లోకేశ్ తదితరులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్ ను పోలీసులు అదుపులోకి తీసుకోవడం తెలిసిందే. అయితే, ఆయనను పలు అంశాలపై ప్రశ్నించి, 41ఏ కింద నోటీసులు ఇచ్చి వదిలిపెట్టారు. దీనిపై టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య తీవ్రంగా స్పందించారు. డీజీపీ గారూ... గత ప్రభుత్వ హయాంకి, ఇప్పటికి చట్టాల్లో ఏమైనా మార్పులు వచ్చాయా? అని ప్రశ్నించారు. ఇప్పుడు నాగార్జున యాదవ్ చేసిన తప్పులు గతంలో మా పార్టీ వారు చేస్తే విరగ్గొట్టి అరెస్ట్ చేసే వాళ్లు... మరి అంతకంటే ఘోరంగా వ్యవహరించిన వైసీపీ యాదవ్ గారిని పోలీసులు విచారణ చేసి వదిలేశారట... ఓసారి కనుక్కోగలరా? అని వర్ల రామయ్య ట్వీట్ చేశారు.

## ఖరీఫ్ సీజన్‌కు పూర్తిస్థాయిలో సంసిద్ధమయ్యాం : మంత్రి అచ్చెన్నాయుడు

అమరావతి,సూర్య వాస్తవం
ఏపీలో ఖరీఫ్ సీజన్‌కు పూర్తి స్థాయిలో సంసిద్ధమయ్యామని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్రంలో 50 శాతానికి పైగా అధిక వర్షపాతం నమోదు కావటం శుభసూచికమన్నారు. ఉపాధిహామీలో పంట కాలువలు పూడిక తీసేందుకు తక్షణ చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. పంట పొలాల్లో నీటి నిల్వ తొలగింపు, తేమ ద్వారా ఆశించే తెగుళ్ల నివారణకు రైతులకు సూచనలు చేస్తున్నామని వివరించారు. అమరావతిలోని వెంకటపాలెటంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చెరువులు, ప్రాజెక్టుల్లో నీటి సంరక్షణ చర్యలు చేపట్టామని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్ కోసం 17.50 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించామని చెప్పారు. ఇప్పటికే ప్రారంభ నిల్వలతో కలిపి 14 లక్షల టన్నులు రాష్ట్రానికి చేరుకున్నాయని తెలిపారు. మిగిలిన ఎరువులు సకాలంలో అందించేలా ఆదేశాలు ఇచ్చామని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. "ఉపాధి హామీలో పంట కాల్వల పూడిక తీసేందుకు తక్షణ చర్యలు చేపట్టాం. పొలాల్లో నీటినిల్వ తొలగింపు, తెగుళ్ల నివారణకు రైతులకు సూచనలిచ్చాం. చెరువులు, ప్రాజెక్టుల్లో నీటి సంరక్షణ చర్యలు చేపట్టాం. 17.50 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు సిద్ధం చేయాలని ఆదేశించాం. ఇప్పటికే ప్రారంభ నిల్వలతో కలిపి 14 లక్షల టన్నులు రాష్ట్రానికి చేరుకున్నాయి. మిగిలిన ఎరువులు సకాలంలో అందించేలా ఆదేశాలిచ్చాం

## మండలంలో పలుచోట్ల జోరుగా జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం

బంగారుపాల్యం సూర్య వాస్తవం న్యూస్ జులై 22.
చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండలం మొగిలివారిపల్లి పంచాయతీ బలిజపల్లి గ్రామంలో సోమవారం జన సైనికులు జి



చిట్టిబాబు జి. మహేష్ బాబు,జి.గాంధీ ల ఆధ్వర్యంలో జోరుగా జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. సుమారు వంద మందికి పైగా జనసేన సభ్యత్వం తీసుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో పలువురు జనసైనికులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కు వినతిపత్రం అందించిన ఏస్ సీ ఏస్ టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ అధ్యక్షుడు కె బీ శంకరయ్య

హిందూపురం టౌన్ జులై 22. (సూర్య వాస్తవం)
హిందూపురం తహసీల్దార్ కు ఏస్ సీ ఏస్ టీ విజిలెన్స్ %డ% మానిటరింగ్ కమిటీ తరుపున వినతిపత్రం అందజేశారు ఇప్పటికీ ఆధార్ కార్డులు లేని నిరుపేద ఎరుకల కుటుంబాలకు స్పెషల్ డ్రైవ్ క్రింద ఆధార్ కార్డు మంజూరు చేయాలని కోరారు భారతదేశం ఇంత అభివృద్ధి చెందిన దేశం లో కూడా ఇప్పటికి వెనుకబడిన ఎరుకల కులముకు చెందిన (ఆదివాసి బిడ్డలు) ఆధార్ కార్డు కూడా లేని దుస్థితిలో జీవిస్తున్నారు అంటే ఎంత దుర్భర పరిస్థితులలో వున్నారు వారికి సమాజములో గౌరవప్రదంగా జీవించాలి, ప్రభుత్వం నుండి వచ్చే అనేక సంక్షేమ పథకాలు, వారి అభివృద్ధి కీ తొడ్పాటు అవసరమైన ఆధార్ కార్డును వారికి స్పెషల్ డ్రైవ్ ద్వారా ఆధార్ కార్డు మంజూరు చేయించి ఇవ్వాలని ఏస్ సీ ఏస్ టీ విజిలెన్స్ %డ% మానిటరింగ్ కమిటీ . కె బీ శంకరయ్య విజిలెన్స్%డ% మానిటరింగ్ కమిటీ సభ్యులు మరియు ఆ. ప్ర. ఎరుకల హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు,కోరారు



## మంత్రులను కలిసిన టీడీపీ మహిళా నాయకురాలు నేహా ఆయేషా

అనంతపురం (సూర్య వాస్తవం):
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హెూం శాఖ మంత్రి, పోలీట్ బ్యూరో సభ్యులు వంగలపూడి అనిత. వ్యవసాయ, సహకార మార్కెటింగ్, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ, మత్స్య శాఖ మంత్రి మర్యాదపూర్వకంగా అనంతపురం





అర్బన్ నియోజవర్గం తెలుగుదేశం పార్టీ కి చెందిన మహిళా నాయకురాలు నేహా అయేషా కలిశారు. ఈ సందర్భంగా ఏపీ మంత్రులకు శుభాకాంక్షలు తెలియజేశారు. గత ప్రభుత్వంలో రాష్ట్రంలో మహిళలపై జరిగిన అత్యాచారాలు, అఘాయిత్యాలు, దాడులకు గురైన ప్రతి మహిళకు న్యాయం చేసేలా చర్యలు కోరారు. సోషల్ మాధ్యమం వేదికగా తెలుగు మహిళలపైన జగన్ ప్రభుత్వం లో వైసిపి,నాయకులు, కార్యకర్తలు ఇబ్బంది పెట్టిన ప్రతి ఒక్కరికి శిక్ష పడేలా చర్యలు తీసుకోనీ బాధితులకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

## సూర్య వాస్తవం కథనానికి స్పందన

### పనులు నిలపాలని అధికారి మల్లికార్జున ఆదేశం ..

గుంతకల్లు ప్రతినిధి సూర్య వాస్తవం
గుంతకల్లు నియోజకవర్గం పామిడి పట్టణంలో ఎద్దులపల్లి రోడ్డు సమీపంలో. ఉన్న కోదండ రామాలయ మఠం స్థలంవివాదం లో ఉ






న్నప్పటికీ గత కొన్ని నెలలుగా కోర్టులో ఉందని తెలిసి కూడా కోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా పని మొదలు పెట్టడంతో గత రెండు రోజుల కిందట సూర్య వాస్తవం దినపత్రికలో. "దేవాలయ భూములు కబ్జా" అనే కథనం రావటంతో స్పందించిన కోదండ రామస్వామి మఠం అధికారి సోమవారం విదాస్పద స్థలం సందర్శించి అక్కడ పనిచేస్తున్న సిబ్బందిని వెంటనే పనులు ఆపేయమని ఇది కోర్టులో పెండింగ్ ఉన్న స్థలమని కోర్టులో వున్న వివాదాస్పద స్థలం లో పనులు చేయడం కోర్టు కు విరుద్ధమని చట్ట రీత్యా నేరమని వెంటనే పనులు ఆపాలని ఆదేశించారు.. కోర్టులో క్లియరెన్స్ వచ్చేవరకు పనులు చేయొద్దని అధికారి ఆదేశించారు. ఎవరైనా పని మొదలుపెడితే కచ్చితంగా వారి పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు..

## మానవత్వం చాటిన జిల్లా ఎస్పీ కే.వి. మురళీకృష్ణ

### ఫ్రెండ్లీ పోలీసు కి నిజమైన నిదర్శనం.

### నడపలేని స్థితిలో ఆటోలో వచ్చిన ఓపిటీషనర్ వద్దకే స్వయంగా వెళ్లి ఫిర్యాదు స్వీకరణ

అనంతపురం క్రైం ( సూర్య వాస్తవం)
అనంతపురం జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ విధి నిర్వహణలో మానవత్వం





చాటారు. కక్కలపల్లి కాలనీకి చెందిన ఓబులేసు అనే పిటీషనర్ రోడ్డు ప్రమాదానికి గురికావడం వల్ల నడవలేని స్థితిలో ఆటోలో తన సమస్యపై పిటీషన్ అందజేసేందుకు వచ్చాడు. ఇది గమనించిన జిల్లా ఎస్పీ కాన్ఫరెన్స్ హాలు బయట ఆటోలో ఉన్న అతని వద్దకే స్వయంగా వెళ్లి తన నుంచి ఫిర్యాదు స్వీకరించి తగు చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసులను ఆదేశించారు. దీంతో ఓబులేసు కుటుంబం జిల్లా ఎస్పీ కు కృతజ్ఞతలు తెలియజేశారు

## జిల్లా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తాం: జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ

### పిటీషనర్ల సమస్యలను చట్ట పరిధిలో త్వరితగతిన పరిష్కారం చూపడమే లక్ష్యం

### జిల్లా పోలీసు కార్యాలయంలో " ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" కు 109 దరఖాస్తులు

### జిల్లా నలమూలల నుండీ విచ్చేసిన ప్రజల నుండీ పిటీషన్లను స్వీకరించిన జిల్లా ఎస్పీ

అనంతపురం క్రైం ( సూర్య వాస్తవం)
పిటీషనర్ల సమస్యలను చట్ట పరిధిలో త్వరితగతిన



పరిష్కారం చూపడమే మా లక్ష్యమని జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ పేర్కొన్నారు.
ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా కింది స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సెల్ సిస్టం ( ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ) ద్వారా ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా కృషి చేస్తామన్నారు. స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో నిన్న నిర్వహించిన " ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" కు ప్రజల నుండీ 109 ఫిర్యాదులు వచ్చాయి. ఎస్పీ గారు ప్రజల నుండీ పిటీషన్లు స్వీకరించారు. ప్రజల సమస్యలను త్వరితగతిన నాణ్యతగా పరిష్కారం చూపాలనే రాష్ట్ర ప్రభుత్వం సంకల్పం మేరకు స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఈ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలమూలల నుండీ వచ్చిన ప్రజలు స్వేచ్ఛగా పిటీషన్లు అందజేశారు. పిటీషనర్లతో కూడా ఎస్పీ ముఖాముఖి మాట్లాడారు. లోతుగా వారి సమస్యలను విని అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి సదరు ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. భార్యాభర్తల గొడవలు, కుటుంబ సమస్యలు, రస్తా వివాదాలు, తదితర అంశాలపై ఫిర్యాదులు అందాయి. ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆర్ విజయ భాస్కర్ రెడ్డి, అనంతపురం డీఎస్పీ టి.వి.వి ప్రతాప్ లు పాల్గొన్నారు.

## అవినీతి అధికారి బీసీ వెల్ఫేర్ డిడి ని సస్పెండ్ చేయండి

### బిసి వెల్ఫేర్ డిడి కుష్బూ కొఠారి అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టాలి

### గ్రీవెన్స్ లో ఏ ఐ ఎస్ బి, వి ఎన్ ఐ వి, జనసేన విద్యార్థి సంఘం వినతి

అనంతపురం (సూర్య వాస్తవం)
అనంతపురం జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారిణి కుష్బూ కొఠారి అవినీతి అక్రమాలపై విచారణ జరిపించాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్లో నిర్వహించిన గ్రీవెన్స్ లో ఏఐఎస్బి జిల్లా కార్యదర్శి పృథ్వి, జనసేన విద్యార్థి విభాగం సిద్ధు, విద్యార్థి నిరుద్యోగ ఐక్యవేదిక రాష్ట్ర సివి వినోద్ కుమార్ వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిసీ సంక్షేమ శాఖ డిడి కుష్బూ కొఠారి విద్యార్థుల సంక్షేమాన్ని గాలికి వదిలేసి అక్రమార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తున్నారన్నారు అవినీతి అక్రమాలు బయటపడకుండా ఉండేందుకు వ్యక్తిగతంగా ఒక వ్యక్తిని నియమించి అతని ద్వారా వసూళ్ల పర్వానికి తెర లేపారని విమర్శించారు. ఇష్టానుసారంగా డిప్యూటేషన్లు వేయడం, ఎవరైనా మాట వినకపోతే వేధింపులకు పాల్పడడం పరిపాటిగా మారిందన్నారు. గతంలో చిత్తూరు జిల్లాలో డిడిగా పనిచేసిన సమయంలో కూడా అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయని, డిడి కుష్బూ కొఠారి వల్ల



బిసి సంక్షేమ శాఖ ఉద్యోగులతో పాటు విద్యార్థులు కూడా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారనీ తక్షణమే డిడి అవినీతిపై విచారణ జరిపి ఆమెను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో ఓ.పి టికెట్ పై ఆధార్ లింక్ ఓ.టీ.పిని రద్దు చేసి సత్వరమే రోగులకు వైద్యం అందించాలి :సామ్రాట్ కే.బి.మధు డిమాండ్

అనంతపురం జులై 21 ( సూర్య వాస్తవం)
ఉమ్మడి అనంతపురం జిల్లాలో ని ప్రభుత్వ సర్వ జన ఆసుపత్రిలో రోజు వేలాది మంది పేద ప్రజలు తమ ఆరోగ్యం మెరుగు పర్చుకోవడా నికి చికిత్స నిమిత్తం వస్తున్న రోగులకు ఓ.పి టికెట్ తీసుకోవడం లో అనేక కష్టాలకు గురి కావడమే కాకుండా ఆధార్ నంబర్ లింకు తో ఓ.టీ.పి తోసమయం వృతా చేస్తున్నారు ఈ సందర్భంగా ఓ.పి సమయం పూర్తి అయి డాక్టర్లు రౌండ్స్ కు



వెళ్లి వార్డులో అడ్మిట్ లో ఉన్నరోగులకు వైద్యం చేయడానికి వెళ్లి పోతారు ఈ సమయంలో ఓ.పి విభాగం లో చికిత్స ఆలస్యమై రోగులు వైద్యం అందాకా అనేక ఇబ్బందులకు గురి అవుతున్నా రు ఈ సమయంలో రోగులు అత్యవసర చికిత్స విభాగంకు వెళ్లి తే అక్కడ పరిస్థితి వర్ణనాతీతం అత్యవసర పరిస్థితుల్లో వచ్చిన రోగులకు వైద్యం అందించడం లో నిర్లక్ష్యం చూపుతున్న సిబ్బంది పైన చర్యలు తీసుకోవాలని అనంతపురం గవర్నమెంట్ హాస్పిటల్ లో ఒక వైపు ఓ. టీ. పి తో ఇబ్బందులు పడి ఆతరువాత వైద్యం విద్యంకోసం నా నాతంటాలు పడవలసి వున్నదని వెంటనే ఓ. టీ. పి ఆధార్ లింకు రద్దు పరచాలని సత్వరమే ఓ. టీ. పి టికెట్ అందజేసి సత్వరమే రోగులకు వైద్యం అందె విదంగా చూడాలని అదే విదంగా అత్యవసర చికిత్స విభాగంలో వైద్యం సేవలు అందించడానికి ఎక్కువ మంది డాక్టర్లను, సిబ్బంది తో పాటు ఎం.ఎన్.ఓ లను ఉంచాలని ఎం.ఆర్.పి.యస్ ఆధ్వర్యంలో సూపర్డెంట్ కు వినతిపత్రం అందజేశారు.
అదేవిధంగా అత్యవసరంగా వచ్చిన రోగులకు స్ట్రెక్చర్ లేక అత్యవసర విభాగం నుండి సిటీ స్కాన్ కు గాని లేదా ఎక్స్రే లకు గాని తీసుకెళ్లాలనుకుంటే చాలాసేపు వేచి ఉండాల్సి వస్తుంది, అలాగే వైద్యం కోసం వచ్చిన రోగులను స్టాంపు కోసమని సంతకాల కోసమని చీటికిమాటికి తిప్పుతున్నారు. అత్యవసరంగా యాక్సిడెంట్లు జరిగి గాయాలతో వచ్చిన రోగులను కనీసం డ్రెస్సింగ్ చేయడానికి కూడా తగిన సిబ్బంది ఆ విభాగంలో లేరు. ఎమర్జెన్సీగా వచ్చిన రోగులను సరైన సమయానికి వైద్యం అందించడంలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. అలాగే ప్రధానంగా ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యం కోసం ఎంతోమంది వస్తుంటారు అలాంటి చోట కనీస పరిశుభ్రత లేకుండా అలాగే దుర్వాసన వస్తున్న కూడా అ వార్డుని ఎప్పటి కప్పుడు శుభ్రంగా ఉంచడం లేదు.
ఇవి అన్ని దృష్టిలో ఉంచుకొని ఎమర్జెన్సీ వార్డులో రోగుల వైద్యం కోసం బెడ్లు, అలాగే రోగులను తరలించడా నికి స్ట్రెక్చర్లు వార్డ్ బాయ్స్ మరియు అక్కడ సిబ్బందిని పెంచాలని అత్యవసరంలో వచ్చిన రోగులను సరైన సమయానికి చికిత్స అందించే విధంగా చూడాలని ఎమ్మార్పీఎస్, ఎం ఎస్ పి కమిటీ ద్వారా సర్వజన ఆసుపత్రి సూపరేంటెండెంట్ కు మెమోరాండం ఇచ్చి త్వరగా రోగులకి చికిత్స అందె విదంగా చేయాలని డిమాండ్ చేశారు
ఈ కార్యక్రమంలో సామ్రాట్ కే. బి. మధు మాదిగ యం.ఆర్. పి.యస్, యం.యస్.పి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు, ఎం ఎస్ పి సీనియర్ నాయకులు నిషార్ అహమ్మద్ మహాజన్, యం.ఆర్.పి.యస్.జిల్లా ప్రధాన కార్యదర్శి రేకులకుంట రామాంజి,సీనియర్ నాయకు లు రేకులకుంట వెంకటేష్, బి. కే.యస్, యం.ఆర్.పి.యస్ మండల అధ్యక్షులు రెడ్డిపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## జీవితాంతం గుర్తుండేలా అభివృద్ధి

### కష్టపడిన ప్రతి కార్యకర్తకూ న్యాయం

### కుప్పం నాయకులతో సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్

చిత్తూరు జిల్లా/కుప్పం
'ఎనిమిది దఫాలు గెలిపించారు.. వచ్చే ఐదేళ్లలో కుప్పం అభివృద్ధిని పరుగులు పెట్టిస్తా. ఇక్కడి ప్రజలు జీవితాంతం గుర్తు పెట్టుకునేలా అభివృద్ధి ఉంటుంది' అని సీఎం చంద్రబాబు అన్నారు. ఆదివారం ఆయన కుప్పం ముఖ్యనాయకులు, కార్యకర్తలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. "నియోజకవర్గం రూపురేఖలు మార్చేలా అభివృద్ధి చేస్తాం.. అందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి. కేంద్రీయ విద్యాలయం, కార్గో విమానాశ్రయాలకు స్థలాలు ఎంపిక చేస్తాం. ఆర్టీసీ బస్టాండ్, జమీందారు పార్కు, క్రీడా ప్రాంగణం, ఔటర్ రింగ్డును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తాం. కుప్పం ప్రజల రుణం తీర్చుకుంటాను. పార్టీ కోసం కష్టించిన ప్రతి కార్యకర్తను, నాయకులను గుర్తుపెట్టుకొని నామినేటెడ్, పార్టీ పదవులు ఇస్తాం. ఇప్పటినుంచే 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రజలకు అందుబాటులో ఉండి ప్రతి సమస్యనూ పరిష్కరించి ఆదరణ పొందాలి. కడా ఆధ్వర్యంలో అన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతాం. కుప్పం వచ్చినప్పుడు గ్రీవెన్స్లో 1,160 ఫిర్యాదులు అందాయి. వాటిలో 950 ఫిర్యాదులపై అధికారులు స్పందించినట్లు నివేదిక ఇచ్చారు. వాటిపై సమీక్షిస్తాను" అని చెప్పారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన సెబ్ అధికారులు ..

శ్రీ సత్య సాయి జిల్లా ( సూర్య వాస్తవం):
జిల్లాలో పనిచేస్తున్న సెబ్ అధికారులు సోమవారం నాడు జిల్లా ఎస్పీ వి.రత్న ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. జిల్లా ఎస్పీగా



నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ ని తన ఛాంబర్ లో జిల్లా సెబ్ ఏ.ఎస్ సుబ్రహ్మణ్యం ఆధ్వరంలో కలిశారు. జిల్లాలో పనిచేస్తున్న సిబ్బంది వివరాలు,పనితీరు, వారి యొక్క విధులు గురించి ఎస్పీ ఆరా తీశారు. గంజాయి, లిక్కర్, నాటు సారా, తదితర ఆసాంఘిక కార్యకలాపాల పై దృష్టి పెట్టి వాటిని పూర్తిగా నిర్మూలించే విధంగా గట్టి చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఎస్పీ ఆదేశించారు.

## వాల్మీకి విగ్రహం ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించండి

నార్పల సూర్య వాస్తవం:
మండల కేంద్రమైన నార్పలలో వాల్మీకి విగ్రహం ఏర్పాటు చేయడం కోసం అనువైన ప్రదేశంలో స్థలాన్ని కేటాయించాలని మండల వాల్మీకి సంఘం నాయకులు నార్పల మేజర్ పంచాయతీ గ్రేడ్ 1 పంచాయతీ కార్యదర్శి



అశ్వర్థమనాయుడుకి వినతి పత్రం అందజేశారు. సోమవారం నార్పల గ్రామపంచాయతీ కార్యాలయంలో బోయ కులస్తులంత కలిసి స్థానిక పంచాయతీ కార్యదర్శికి వినతి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నార్ప లలో దాదాపుగా 5వేలమంది బోయ కులస్తులు జీవనం చేస్తున్నారన్నారు. రామాయణం రచించినటువంటి వాల్మీకి మహర్షి మాఆరాధ్య దైవం ఆ మహనీయుడు వాల్మీకి విగ్రహం లేకపోవడం వల్ల అందరూ కూడా ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సంకల్పించామన్నారు. అందువల్ల మేము అనువైన ప్రదేశాన్ని నార్పల కూతలేరు వంతెన పక్కన రామస్వామి గుడికి వెళ్లే దారి పక్కన ఏర్పాటు చేయడానికి నిర్ణయించుకున్నాము. తమరు అనుమతి ఇప్పించగలరని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు చిలంకూరు జయరాం, కొట్టం నరసింహులు,బారికి సుబ్బు, చిన్న, పాముల శ్రీరాములు, బాలనాగి నరేష్, తలారి ప్రతాప్, డీలర్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## బాడీ ఫ్రీజర్ బాక్సు వితరణ

ప్రొద్దుటూరు, (సూర్య వాస్తవం):
ప్రొద్దుటూరు లో ప్రాణదాత సేవా సంస్థ చేస్తున్న సేవలను చూసి దువ్వూరు మండలం కానగూడూరు గ్రామ వాస్తవ్యులు శింగనమల వెంకట సుబ్బయ్య




అలియాస్ మిషన్ పెద్దయ్య ఆయన భార్య వెంకట సుబ్బమ్మ జ్ఞాపకార్థం ప్రాణదాత సేవా సమితి వారికి మరణించిన వారి పార్థివ దేహాన్ని ఉంచే బాడి ఫ్రీజర్ బాక్సు ను సోమవారం వితరణ చేశారు. కార్యక్రమంలో ప్రాణదాత చైర్మన్ బచ్చల సునీల్ కుమార్, కార్యదర్శి రాజు, న్యాయ సలహాదారు సుమంత్ కుమార్, అకేపటి శంకర్ రెడ్డి, నారాయణ రెడ్డి, వేణు గోపాల్ రెడ్డి మరియు చెన్న కేశవ పాల్గొన్నారు.

## శివోహం ఆధ్వర్యంలో కొనసాగిన అన్నప్రసాద సేవ

ప్రొద్దుటూరు, (సూర్య వాస్తవం): శివోహం అన్నప్రసాద సేవా సంఘం వారి ఆధ్వర్యంలో ప్రతి సోమవారం స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించే అన్నప్రసాద సేవను ఈ వారం పట్టణ ప్రముఖ వైద్యులు శేషశయన, నాగమణి, కుటుంబ సభ్యుల సహకారంతో అన్నప్రసాద సేవ నిర్వహించారు. దాదాపు 500 మంది ఈ కార్యక్రమంలో పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా శేషశయన మాట్లాడుతూ దాదాపు గత 3 సంవత్సరాలుగా శివోహం అన్నప్రసాద సేవా సంఘం వారు అన్నప్రసాద సేవ నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. ప్రతి వారం వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా శివోహం అన్నప్రసాద సేవ సంఘం అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్ రెడ్డి, సభ్యులు ఈ కార్యక్రమం నిర్వహించడం వారి సేవా నిరతికి నిదర్శనమన్నారు. వారి సేవలు మరిన్ని రోజుల పాటు కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శివోహం కమిటీ ఉపాధ్యక్షుడు మురుకూటి సూర్యనారాయణ రెడ్డి, సభ్యులు విష్ణు నారాయణ, విజయకుమార్, లింగారెడ్డి, కల్లూరు ప్రభాకర్ రెడ్డి, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.



## రైల్వే కోడూరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

రైల్వే కోడూరు సూర్య వాస్తవం,

హారైల్వే కోడూరు పట్టణానికి చెందిన విద్యార్థులు రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన 40వ సీనియర్, 41వ జూనియర్ జిల్లా



స్థాయి తైక్వాండో పోటీలలో యస్ వి కె స్పోర్ట్స్ అకాడమీకి చెందిన జూనియర్ విభాగంలో ఐశ్వర్య సి, మేఘన, మనోజ్ సోమవారం బంగారు పతకాలును సాధించారు.అలాగే సీనియర్ విభాగంలో చైతన్య ప్రసాద్, విష్ణు, కృష్ణవేణి బంగారు పతకాలను సాధించారు. బంగారు పతకాలు సాధించిన వారందరూ ఆగష్టు నెలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనున్నారని కోచ్ శివాజీ తెలియజేశారు.

## ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యునిగా ప్రమాణస్వీకారం చేసిన సి. రామచంద్రయ్య

(కడప సూర్య వాస్తవం)

వెలగపూడిలోని కౌన్సిల్ ఛైర్మన్ కార్యాలయంలో ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య





ప్రమాణ స్వీకారం చేశారు. రామచంద్రయ్య తో శాసన పరిషత్తు ఛైర్మన్ మోషేను రాజు ప్రమాణ స్వీకారం చేయించారు. ఇటీవల ఈయన ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ప్రమాణ స్వీకారం అనంతరం రామచంద్రయ్యకు అభినందనలు తెలుపుతూ శాసన పరిషత్ నియమ నిబంధనల పుస్తకాలను ఎమ్మెల్సీకి ఛైర్మన్ అందజేశారు.

## దొంగే దొంగ దొంగ.. అన్నట్లు జగన్ వ్యవహారం

### మాజీ డిప్యూటీ మేయర్ అరిఫుల్లా

కడప సూర్య వాస్తవం

ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్న మాజీ సీఎం జగన్ వ్యవహారం చూస్తుంటే దొంగే దొంగ దొంగ అని అరచినట్లు ఉందని మాజీ డిప్యూటీ మేయర్ అరిఫుల్లా ఘాటుగా విమర్శించారు సోమవారం అయన



మీడియాతో మాట్లాడుతూ డీజీపీ ని ఇంటి చుట్టం మాదిరి వాడుకొని ప్రజాస్వామ్యం లో అన్ని వ్యవస్థ లను నాశనం చేసిన వ్యక్తివి నీవు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించి నట్లు ఉ ందన్నారు. దళితడాక్టర్ ను పిచ్చివాడిని చేసి చంపి నపుడు,ఎక్కడదుంది ప్రజాస్వామ్యం, దళిత డ్రైవర్ ను వైఎస్ఆర్సీపీ పార్టీ ఎమ్మెల్సీ డోర్ డెలివరీ చేసినప్పుడు,ప్రస్వామ్యం ఏమయింది అన్నారు, నంద్యాలలో ముస్లిం యువకుని కుటుంబాన్ని, చిత్తూరు జిల్లాలో ముస్లిం అమ్మాయి చావుకు కారణం అయిన మీ పార్టీ వారైనప్పుడు ప్రజాస్వామ్యం, మానవ విలువలు గుర్తుకు రాలేదా. ఈరోజు మిమ్మల్ని మీ పార్టీని రాష్ట్ర ప్రజలు బాయ్ కాట్ చేసాక గుర్తుకొచ్చాయా అని ఆగ్రహం వ్యక్తపరచారు. ప్రజలు బాయ్ కాట్ చేసిన మీ పార్టీ అసెంబ్లీ నుండి వాక్ అవుట్ చేయడం విచిత్రం అని అరిఫుల్లా ఎద్దేవా చేశారు.

## మసుమా బీబీ, సారాన్ బీబీ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

అనంతపురం (సూర్య వాస్తవం):

అనంతపురంలోని స్థానిక పాతూరు లో కొలువై ఉన్న మసుమా బీబీ, సారాన్ బీబీ దర్గా లో ఐదవ రోడ్డు బీబీ ఫాతిమా అమ్మవారి మకనం కమిటీ సభ్యులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మసుమా బీబీ దర్గా సంరక్షకులు ఏ.కాలేషా పాల్గొన్నారు



# అర్జీదారుల సమస్యలపై తక్షణమే స్పందించాలి

### జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి

కడప బ్యూరో సూర్యవాస్తవం

జిల్లా నలుమూలల నుంచి వ్యయ ప్రయాసాలు ఓర్చి జిల్లా కేంద్రానికి వచ్చే అర్జీదారుల సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించి విచారించి పరిష్కార మార్గాలను చూపాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులను ఆదేశించారు. ఈరోజు కలెక్టరేట్లోని గ్రీవిన్స్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి తో పాటు డిఆర్వో గంగాధర్ గౌడ్, డిఆర్డీఏ పీడి ఆనంద్ నాయక్ లు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా వరి ష్కరించాలన్నారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్ లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరిం చాలన్నారు. సికె దిన్నె మండలం బాలు పల్లెకు చెందిన బి. నాగేశ్వరి తనకు వితంతు పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు అర్జీ సమర్పించారు. సికె దిన్నె మండలం కొత్త పబ్బాపురం చెందిన సి. లక్ష్మీదేవి తనకు తనకు చెందిన 4.94 ఎకరాల భూమికి పట్టాదారు పాసు పుస్తకం, ఆన్ లైన్ భూమి రికార్డులు జారీ



చేయాలని కోరుతూ కలెక్టర్ వారికి విన్నవించారు పోరుమామిళ్ల మండలం రంగసముద్రంకు చెందిన ఆర్.వెంకట సుబ్బయ్య తన భూమిని ఇతరులు ఎలాంటి రికార్డులు లేకుండానే వారి పేరుమీద ఆన్ లైన్ చేయించుకున్నారు. తమ పేరున ఆన్ లైన్ చేయించి న్యాయం చేయాలన్నారు. చెన్నూరు మండల కేంద్రం కొత్త గాంధీ నగర్ కు చెందిన యొద్దుల వెంకటేశ్ మనడల రెవెన్యూ కార్యాలయంలో దొంగిలింపబడిన రెవెన్యూ రికార్డుల విషయమై సంబందిత విఆర్వోను విచరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు అర్జీ సమర్పించారు.

### తెలుగు సాహిత్యంలో ఇస్లాంవాదాన్ని ఆవిష్కరించిన

# ఆదికవి కరీముల్లా

కడప బ్యూరో సూర్యవాస్తవం

ఆధునిక తెలుగు సాహితీ చరిత్రలో అస్తిత్వవాద సాహిత్యాలది అగ్రపీఠం. ఏ సమూహానికి ఆసమూహం తమ హక్కులకోసం గొంతెత్తుతున్నకాలంలో కవి కరీముల్లా తన జాతిజనుల హక్కులకోసం, వారు ఎదుర్కొంటున్న వివక్షకు వ్యతిరేకంగా తనకలంద్వారా, గళంద్వారా యుద్ధం ప్రకటించాడు. కవి కరీముల్లా తనదైన శైలిలో ఇస్లాం ధర్మాన్ని తాత్విక పునాదిగా చేసుకొని ఇస్లాం వాదాన్ని ఆవిష్కరించాడు. ఇస్లాంవాదమని పేరు పెట్టినప్పటికీ పీడిత తాడిత దళిత బహుజనులందరూ తమ సోదరులేనని, పీడితులందరూ తన సంబోధితులేనని కరీముల్లా ప్రకటించాడు. తెలుగు సాహిత్యంలో తనదొక ప్రత్యేక స్వరంగా సామరస్య గీతాన్ని ఆలపిస్తున్నాడు. కరీముల్లా స్వస్థలం ఆంధ్రప్రదేశ్ లోని పల్నాడు జిల్లా వినుకొండ. గత మూడు దశాబ్దాలుగా నిరంతర సాహితీ సేద్యం చేస్తున్న కవి. తెలుగు సాహిత్యంలో ఇస్లాంవాద ఆవిష్కర్తగా, నూతన కవితా ప్రక్రియ 'అబాబీలు' రూపకర్తగా, ముస్లిం రచయితల సంఘం వ్యవస్థాపకు నిగా ఎందరో కవులకు దిశానిర్దేశం చేసిన కవి. ముస్లిం అస్తిత్వ వేదనకు అక్షరమద్దుతూ ముస్లిం ఫోబియా, ఇస్లామో ఫోబియాను దూరం చేసే కార్యభారాన్ని ఆయన కలం భుజానికెత్తుకుందిఎంతోమంది కవుల్ని ప్రోత్సహించి వెలుగులోకి తెచ్చి, అక్షరాలు దిద్దించిన ఆదర్శ గురువు, కరీముల్లా రూపొందించిన అబాబీలు అనే నూతన ప్రక్రియలో దాదాపు వందమందికి పైగా కవులు రాస్తూ ఉ ఒడటం మామూలు విషయం కాదు. కరీముల్లా ఇస్లా మియ సామ్యవాదాన్ని, సర్వమానవ సమతా భావాన్ని బలంగా విశ్వసించే కవి. ఇస్లాం ప్రేమ తత్వాన్ని హృదిలో నింపుకుని మతసామరస్యం, సోదరభావం, లౌకిక విలువల్ని ముందుకు తీసుకువెళుతున్న కవి. తెలుగు సాహిత్యంలో 'సాయిబు' అనే పేరుతో దీర్ఘ కవిత రాసి, దీర్ఘకవిత రాసిన తొలి ముస్లిం కవిగా ఖ్యాతి గడించారు. విప్లవ కవిత్వంలో మహాప్రస్థానానికి, దళిత కవిత్వంలో గబ్బిలానికి ఎంత ప్రాధాన్యత ఉందో మైనార్టీ కవిత్వంలో సాయిబు దీర్ఘ కవితకు అంత ప్రాముఖ్యత ఉందని సాహితీ విమర్శకుల అభిప్రాయం. దేశీయ మతతత్వ ఫాసిజంపై కరీముల్లా కలం ఎలా విరుచుకు పడిందో మచ్చుకు ఇది: 'రేయ్ హిట్లర్ నవ్వకు/అలా పగలబడి, విరగబడి నవ్వకు/నా దేశంలో పునరుద్ధానమొందిన నీ ఆత్మను చూసి నవ్వకు/ఖబరస్తాన్లో మా సమాధులపై మొలుస్తున్న వేరుచిగుర్లు/ రేపటి చరిత్రను నిర్మిస్తాయని తెల్సుకో' అంటూ గర్జించిన నిర్భయ కవి. ఇస్లాం శాంతిని బోధిస్తుంది అన్న యదార్థాన్ని చాటింపువేస్తూ తెలుగు కవిత్వంలో ఇస్లాంవాద జెండాను ఎగరేసిన యోధుడు. కరీముల్లా ఇప్పటివరకూ ఇరవై ఆరుకు పైగా పుస్తకాలు రాశారు. అందులోపదిహేను పుస్తకాలు ప్రచురితమయ్యాయి. అనేక జాతీయ, రాష్ట్ర స్థాయి పురస్కారాలు, అవార్డులు అందుకున్నా రీయన. ఆయన కవిత్వంపై పలు విశ్వవిద్యాలయాలు పరిశోధన లు చేస్తున్నాయి. ఇస్లా కరీముల్లా కవిత్వంపై పరిశోధన పూర్తి చేసిన ఏ. శ్రీనివాసరావుకు నాగార్జున విశ్వవిద్యాలయం పిహెచ్ డి ఇచ్చింది. తను రాసిన సాయిబు, బదర్ పుస్తకాలు ఆంగ్ల, కన్నడ భాషల్లో అనువాద మ య్యాయి. దేశవ్యాప్తంగా హిందీ, ఉర్దూ, కన్నడ, ఒరియా భాషల్లో అనేక కవితలు, విశ్లేషణలు వచ్చాయి. 'మనుషుల్ని కదా/మన వాళ్లనుకోవాలి/వసంతాన్ని కదా/మనం కలకనాలి' అంటూ వసంత మేఘగర్జన చేస్తూ అన్ని రకాల మత తీవ్రవాదాలను కరీముల్లా కవిత్వం దునుమాడింది. అనునిత్యం పీడితుల పక్షం వహిస్తూ రాజ్యహింసను వ్యతిరేకించిన కలం కరీముల్లాది. ప్రసిద్ధ కవి శివసాగర్ మాటల్లో చెప్పాలంటే, ఈ దేశ కల్లోల సంద్రంలో కరీముల్లా కవిత్వం పోరాడే యుద్ధనౌక. అందర్నీ సమంగా చూడలేని కుహనా దేశభక్తి మీద 'థూ' అని ఉమ్మేసిన కవిత్వం. దేశ సమగ్రతకు భంగం కలిగించే శక్తులపై కవి కరీముల్లా కలం తుఫానులా విరుచుకుపడుతుంది. హిందువైనా, ముస్లిమైనా కన్నీ రొక్కటే, కష్టాలొక్కటే అని నినదించే కరీముల్లా కలం ఎంద రికో ఆదర్శనీయం అంటే అతిశయోక్తి కాదు. కరీముల్లా భాయ్ ఇలానే ముందుకు సాగండి. ఆకాశమే హద్దుగా.. సుగుణాలే స్ఫూర్తిగా.!!

యండి. ఉస్మాన్ ఖాన్,
9912580645,

# కడప జిల్లాలో ఉక్కుపరిశ్రమ నిర్మించాలి..

### పిఆర్ఎస్ వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ కన్నెలూరు శంకర్ డిమాండ్...

#### పిఆర్ఎస్ వైఎఫ్ ఆధ్వర్యంలో కడప ఆర్డివో వెంకటపతి కు వినతి పత్రం..

కడప జులై 21 ( సూర్య వాస్తవం)జిల్లాలో ఉక్కు పరిశ్రమను నిర్మించి, నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించి వలసలను కరువును నివారించాలని నూతన ఎన్డీఏ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం సోమవారం నాడు స్థానిక కడప ఆర్డీవో చాంబర్ లో కడప ఆర్డీవో వెంకటపతి కు ప్రగతిశీల రెవల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం(పిఆర్ఎస్ వైఎఫ్) ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు .

ఈ సందర్భంగా కడప ఆర్డీవో వెంకటపతి స్పందిస్తూ ఈ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి కృషిచేసి నిరుద్యోగ,యువతీ యువకులకు ఉపాధి కల్పనకు తోడ్పాటు ఇస్తామని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా పిఆర్ఎస్ వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ కన్నెలూరు శంకర్ మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతం కరువు, వలసలు,రైతుల ఆత్మహత్యలకు నిలయం. ఇలాంటి రాయలసీమ ప్రాంతంలోని కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమను స్థాపించి,ఈ సమస్యలన్నింటిని పరిష్కరించాలని గత కేంద్ర ప్రభుత్వం విభజన చట్టంలో సెక్షన్ 8(%××%) పొందుపరచి పార్లమెంటు సాక్షిగా ప్రకటించారు.2014 ఎన్నికల ప్రచారం సందర్భంగా మేము కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ఒక సంవత్సర కాలంలో కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమను పూర్తి చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తామని నేటి మన దేశ ప్రధాని నరేంద్ర మోది తిరుపతిలో వెంకన్న సాక్షిగా హామీ ఇవ్వడం జరిగినది. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోది సర్కార్ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తరుణంలో కడప జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీలు, విద్యార్థి, యువజన, ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో జాయింట్ యాక్షన్గా పలు రకాల ఉద్యమాలు, ఆందోళనలు, రిలే నిరాహార దీక్షలు, ఆమరణ నిరాహార దీక్షలు చేయడం జరిగిందన్నారు.ఈ విశాల ఉక్కు ఉద్యమాల వత్తిడితో గతంలో (2018)లో చంద్రబాబు నాయుడు గారు ఎన్నికల ముందు ఉక్కు పరిశ్రమకు శంకుస్థాపన చేయడం జరిగిందని,ఎన్నికల తరువాత ప్రభుత్వం మారడం జరిగింది. అలాగే గతంలో (2018) ప్రతిపక్షంలో వున్న వై.యస్. జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర, ఎన్నికల ప్రచార సందర్భంలో మేము అధికారంలోకి వచ్చిన తరువాత ఆరు నెలల లోపు శంకుస్థాపన చేసి సంవత్సరం కాలంలో పూర్తి చేస్తామని కడప జిల్లా ప్రజానీకానికి హామీ ఇచ్చారని, 2019 లో అధికారంలోకి వచ్చిన తరువాత వై.యస్. జగన్మోహన్ రెడ్డి శంకుస్థాపనకే పరిమితమై ఉక్కు పరిశ్రమ పనులను ప్రారంభించకుండా, నిధులను కేటాయించకుండా జగన్ సర్కార్ 5 సంవత్సరాలు పాటు నిర్లక్ష్యంగా వ్యవహరించి జిల్లా ప్రజానీకాన్ని నిరుద్యోగ యువతీ, యువకులను ఘోరంగా మోసం చేసిందని ఆయన ఆవేదనను వ్యక్తం చేశారు.



ఈ ఉక్కు పరిశ్రమ నిర్మాణం పూర్తి అయితే ప్రత్యక్షంగా 10000 వేలు మంది నిరుద్యోగులకు పరోక్షంగా 25000 వేలు మంది నిరుద్యోగులకు ఉ పాధి లభిస్తుందని,అలాగే ఈ పరిశ్రమకు అనుబంధంగా మరీ కొన్ని పరిశ్రమలు వచ్చే అవకాశం ఉంటుంది, వీటి చుట్టూ రవాణా వ్యవస్థ (లారీలు, బస్సులు, ట్యాక్సీలు, ఆటోలు మొదలగునవి) హోటల్స్ , లాడ్జీలు, టూరిజం, కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలు, వివిధ కార్పొరేట్, ప్రైవేట్ సంస్థలు బాగా అభివృద్ధి చెంది, వీటి ద్వారా కూడా కొన్ని వేల మంది నిరుద్యోగులకు ఉపాధి దొరికే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు, కాబట్టి ఇప్పటికైనా నూతనంగా ఏర్పడిన ఎన్.డి.ఎ. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించి వెంటనే ఉక్కు పరిశ్రమను నిర్మించి,నిరుద్యోగ యువతీ యువకుల వలసలను నివారించి వారికి ఉద్యోగ ఉపాధి కల్పన అవకాశం కల్పించి, కడప జిల్లా ప్రజల చిరకాల కళ స్వప్నాన్ని నెరవేర్చాలని, జిల్లా ప్రజల నిరుద్యోగ యువతీ, యువకుల ఆకాంక్షలకు అనుగుణంగా ఉ క్కు పరిశ్రమ నిర్మాణానికి నిధులు కేటాయించి, ఉక్కు పరిశ్రమను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రగతిశీల రెవల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం (పిఆర్ఎస్ వైఎఫ్) గా ఆయన విజ్ఞప్తి చేశారు.. ఈ కార్యక్రమంలో పిఆర్ఎస్ వైఎఫ్ జిల్లా కన్వీనర్ ఓ.నాగేంద్రబాబు, నగర నాయకులు ఆదిత్య,సమీర్,సాగర్,బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## లేపాక్షి మండలం ఎమ్మార్వో కార్యాలయం వద్ద ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం

లేపాక్షి జులై 22 (సూర్య వాస్తవం)

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని కళాశాలలో నీటి సమస్యను పరిష్కారం చేయాలని కోరుతూ లేపాక్షి మండలం ఎమ్మార్వో కి విద్యార్థులతో కలిసి వినతి పత్రం ఇచ్చిన ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి



## 23న పొలం పిలుస్తోంది కార్యక్రమం ప్రారంభం.

### మండల వ్యవసాయాధికారి రమేష్ రెడ్డి

సిద్దవటం సూర్యవాస్తవం

జూలై నెల 23 తేదీ నుండి ఖరీఫ్ సీజన్ మొత్తం అనగా సెప్టెంబర్ నెలాఖరు వరకు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి రమేష్ రెడ్డి తెలిపారు. సిద్దవటం వ్యవసాయాధికారి కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ పొలం పిలుస్తోంది కార్యక్రమంలో క్షేత్ర స్థాయిలో పంట పొలాల పరిశీలన, తదుపరి రైతులతో ముఖాముఖి ఉంటుందన్నారు. క్షేత్ర స్థాయిలో సమస్యలు గుర్తించి పరిష్కారానికి కృషి చేసి రైతులకు సాంకేతిక సలహాలు ఇవ్వడం ఈ కార్యక్రమ ఉద్దేశ్యమన్నారు. వారంలో ప్రతి మంగళ, బుధ వారాల్లో ఈ



విస్తరణ కార్యక్రమం ఉంటుందన్నారు. ఇందులో రైతు సేవా కేంద్ర సహాయకులు, మండల వ్యవసాయాధికారి పాల్గొంటారన్నారు. అలాగే జిల్లా స్థాయి అధికారులు పర్యవేక్షణ ఉంటుందన్నారు.

వ్యవసాయ శాస్త్రవేత్తలు, జిల్లా వనరుల కేంద్రం అధికారులు కూడా అవసరం మేరకు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమం బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకుల పర్యవేక్షణలో ఉంటుందన్నారు. గ్రామ స్థాయిలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ఉత్తమ యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తారన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానాలపై కూడా సదరు సిబ్బందితో కలిసి అవగాహన కల్పిస్తారన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక నికరాదాయం పొందేలా రైతులను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. గ్రామాల వారీగా షెడ్యూల్ ఇప్పటికే రూపొందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని రైతు సోదరులు కూడా పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## జన సైనికులకు భద్రత కోసమే క్రియాశీలక సభ్యత్వం

### జనసేన నాయకులు కొణిదల నాగేంద్రబాబు

నార్పల సూర్య వాస్తవం

గత నాలుగు సంవత్సరాల నుండి నిరంతరం కార్యకర్తల క్షేమం గురించి ఆలోచించే నాయకుడు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అని ఇటీవల వేర్వేరు ప్రమాదాల్లో మృతి చెందిన






జనసేన పార్టీక్రియాశీలక సభ్యుల కుటుంబాలకు జనసేన ఆర్థిక భరోసా కల్పించారని అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గం గార్లదిన్నే మండలం పాత కల్లూరు గ్రామానికి చెందిన కొండమల్లెల శివ జనసైనికుడు 7నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించడం జరిగింది. ఆ కుటుంబానికి ఆసరాగా నిలబడడానికి జనసేన పార్టీ తరఫున ఐదు లక్షల రూపాయల చెక్ ను నాగబాబు చెతుల మీదుగా మృతుడి భార్య కొండమల్లిల వరలక్ష్మి కి అందజేశారు. అనంతరం వరలక్ష్మి మాట్లాడుతూ మా కుటుంబానికి గతంలో భరోసా ఇచ్చేవారు లేరు ఇప్పుడు మా కోసం ఉ ప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేసిన సహాయం మరువ లేనిదన్నారు మా సొంత గ్రామం నుండి జనసేన పార్టీ నాయకులు సొంత ఖర్చులతో మంగళగిరి పార్టీ కార్యాలయానికి తీసుకెళ్ళి5 లక్షలు చెక్కు ఇప్పించడం చాలా సంతోషంగా ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు టిసి వరుణ్ సింగనమల నియోజకవర్గం జనసేన ఇన్చార్జి మురళీకృష్ణ మండల అధ్యక్షుడు రఘు జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## రక్తదాన శిబిరం విజయవంతం చేయండి

మైదుకూరు సూర్య వాస్తవం

కడప జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ రక్త నిల్వ కేంద్రాల నందు రక్త నిల్వలు లేక డాక్టర్లు రోగులకు సకాలంలో మెరుగైన వైద్య చికిత్సలు అందించక రోగుల పడుతున్న తీవ్ర ఇబ్బందుల సమస్యను గుర్తించినభారత ప్రభుత్వం, నెహ్రూ కేంద్రం మరియు కడప జిల్లా స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలోకడప జిల్లా వ్యాప్తంగా 7 రోజుల పాటు నిర్వహించే రక్తదాన వారోత్సవాల్లో భాగంగా 4వ రోజు అనగా జులై 23 మంగళవారం ఉదయం 10 గం.. ల నుండి మైదుకూరు, ఆర్టీసీ బస్టాండ్ దగ్గరలో గల మేధా డిగ్రీ



కాలేజ్ నందు రక్తదాన శిబిరం ఏర్పాటు చేయదలిచాముకావున 18 సంవత్సరాల నిండి ఆరోగ్యవంతమైన కాలేజీ యువతీ యువకులు మరియు స్వచ్ఛంద రక్తదాతలు, సేవా సంస్థల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు ప్రతి ఒక్కరు ఈ రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేసి, చేయించి విజయవంతం చేయగలరని అలాగేరక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం వారిచే జారీ చేయబడ్డ సర్టిఫికెట్ తో పర్యావరణ పరిరక్షణలో భాగంగా పండ్ల మొక్కను కూడా ప్రధానం చేయబడునని అమ్మ సేవా సమితి సంస్థ అధ్యక్షులు శివశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## నేటి నుంచి పొలం పిలుస్తోంది కార్యక్రమం ప్రారంభం

### – వ్యవసాయ అధికారి అమర్నాథరెడ్డి

దువ్వూరు, సూర్య వాస్తవం :
నేటి నుంచి పొలం పిలుస్తుంది అనే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి అమర్నాథ్ రెడ్డి తెలిపారు . సోమవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ నేటి నుంచి మంగళవారం జులై 23 వ తారీకు నుంచి వారంలో ప్రతి మంగళవారం రెండు గ్రామాలు,బుధవారం రెండు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.



ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల్లో సాగు చేసిన పంటలను సందర్శించి, రైతులకు చీడపీడలు మరియు ఆధునిక యజమాన పద్ధతులు గురించి వివరిస్తామని అన్నారు. అలాగే గ్రామంలో రైతులతో గ్రామసభ నిర్వహించబడులని తెలిపారు. కావున నేడు ఉదయం ఇడమడక, మధ్యాహ్నం నారాయణపల్లి గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహిస్తున్నాము,రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా వ్యవసాయ అధికారి తెలిపారు.

## సర్పంచులు వ్యాధుల పట్ల జాగ్రత్తలు వహించండి

రైల్వే కోడూరు సూర్య వాస్తవం
రాష్ట్రంలో రానున్న వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సర్పంచులు అప్రమత్తంగా మెలగాలనీ గ్రామాలలో వ్యాధులు ప్రబలకుండ జాగ్రత్తలు వహించాలనిహారైల్వే కోడూరు ఎంపీడీవో కె.వి సుబ్రహ్మణ్యం సూచించారు



సోమవారం రైల్వేకోడూరు లోని 21 పంచాయతీల సర్పంచులతో సీజనల్ వ్యాధుల పట్ల ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో అప్రశుభ్రంగా లేకుండా పరిశుభ్రంగా ఉంచుకొని తగు జాగ్రత్తలు పాటిస్తే జబ్బులు ప్రభలవని అవసరమైన చోట్ల బ్లీచింగ్ పౌడర్ చల్లి మురుగు కాలవలలో ఉన్న మురికి నీటిని తొలగించాలని సర్పంచులకు సూచించారు. పరిస్థితుల్ని గమనిస్తూ జాగ్రత్తలు తీసుకొని చిన్నపాటి విష జ్వరాలు రాకుండా గ్రామాలలో పూర్తిస్థాయిలో పరిశుభ్రతను పాటించి గ్రామాలలోని ప్రజలను అప్రమత్తం చేయాలని ఎండిఓ పిలుపునిచ్చారు. ప్రతి ఒక నియోజకవర్గంలో గ్రామ గ్రామాలలో వినాయక చవితిని పురస్కరించుకునిహారాబోవు వినాయక చవితికి మట్టి విగ్రహాలు వాడాలని వారు సూచించారు. ప్రతి ఒక్కరిని గ్రామాలలో అవగాహన కల్పించే విధంగా సర్పంచులు కృషి చేయాలని మట్టి విగ్రహాలతోనే వినాయక చవితి జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డి నాగార్జున, సర్పంచులు శివయ్య, దొమ్మరాజు సుబ్రహ్మణ్యం రాజు, దార్ల చంద్రశేఖర్, హరికృష్ణ రెడ్డి, సంయుక్త తదితరులు పాల్గొన్నారు.

## డి.వడ్డేపల్లి తాగునీరు సమస్య పరిష్కరించండి

లక్కిరెడ్డిపల్లి సూర్య వాస్తవం
దిన్నెపాడు వడ్డేపల్లిలో ఏడాది నుంచి తాగునీటితో ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నామని డి.వడ్డేపల్లి గ్రామస్తులు,మాజీ ఎంపీటీసీ శంకారపు జయరాం సోమవారం గ్రీవెన్స్ లో కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వర్షాలు సక్రమంగా పడకపోవడంతో గ్రామంలో నీటి



సమస్య తీవ్రంగా ఉందని గ్రామంలోని మంచినీటి పథకం బోర్లు, చేతిపంపులు ఎండిపోయి సంవత్సరం నుండి ఎవరూ పట్టించుకోవడంలేదని వారు వినతిపత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు.120 కుటుంబాలు ఉన్న గ్రామంలో ఒక ట్యాంకర్ పెట్టి నీరు అందిస్తున్నారని ఆ నీరు ఒక బజారుకు కూడా చాలడం లేదని దీంతో ఊరిలో నీటి కోసం గొడవలు పడుతున్నామని, గొడవలు పడడంతో తోలుతున్న ఒక ట్యాంకర్ కూడా నిలిపివేశారని దీంతో గ్రామంలో తాగునీరు సమస్య తీవ్రంగా ఉందని వారు పేర్కొన్నారు.కలెక్టర్ చొరవ చూపి వడ్డేపల్లి గ్రామానికి మూడు ట్యాంకర్లను ఏర్పాటు చేసి నీరు అందించాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు.

## నిత్యం శ్రమ దోపిడీ కి గురి అవుతున్న ప్రైవేట్ టీచర్లు

### - పిఎల్టీయు రాజు

ప్రొద్దుటూరు, (సూర్య వాస్తవం):
కడప జిల్లా లోని ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో పని చేస్తున్న ప్రైవేట్ టీచర్లు ఎటువంటి హక్కులు లేకుండా నిత్యం శ్రమ దోపిడీ కి గురి అవుతున్నారని పిఎల్టీయు రాష్ట్ర కన్వీనర్ గడ్డం రాజు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఆయన ప్రొద్దుటూరు డిప్యూటీ డిఈవొ కృష్ణప్పని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ కడప జిల్లా లోని ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో పని చేస్తున్న ప్రైవేట్ టీచర్లు ఎటువంటి హక్కులు లేకుండా నిత్యం శ్రమ దోపిడీ కి గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు జి.ఓ. 1 ప్రకారంగా ప్రైవేట్ పాఠశాలల నిర్మాణం జరిగిందని కానీ అందులో పని చేసే ప్రైవేట్ టీచర్లకు చట్ట పరంగా రావలసిన జీతాలు కానీ పిఎఫ్, ఈఎస్ఐ గ్రాట్యుటీ వంటి సౌకర్యాలు విద్య సంస్థల యాజమాన్యాలు ఇవ్వకుండా చట్ట ఉల్లంఘనకు పాల్పడుతున్నారు 1982 విద్య చట్టం 84 ఏ ప్రకారంగా చట్ట ఉల్లంఘనకు పాల్పడుతున్న విద్య సంస్థల పై చర్యలు తీసుకోవాలని అటువంటి విద్య సంస్థల గుర్తింపును రద్దు చేయాలనీ డిమాండ్ చేశారు.



# నడి రోడ్డుపైనే నరికి చంపుతున్నారు..

కడప బ్యూరో సూర్యవాస్తవం
ప్రత్యర్థులు కత్తులతో నడి రోడ్డులోనే నరికి చంపుతున్నారు. శాంతి భద్రతలు ఉన్నా రాష్ట్రంలో ఎందుకు ఇలా జరుగుతుందో అర్థం కానీ పరిస్థితి నెలకొంది.
కూత వేటు దూరంలో పోలీస్ స్టేషన్లు, నిత్యం సీసీ కెమెరాలతో నిఘా, మల్టీలో పోలీసులు, ఇంటలిజెన్స్ వ్యవస్థ.. ఇవన్నీ ఉన్నా మర్డర్ లు, దాడులు ఆగడం లేదు.
ఏపీలో వరుస అత్యాచారాలు, హత్యలు:
ఏపీలో 21 జూన్ 2024న బాపట్ల జిల్లా చీరాల మండలం ఈపురుపాలెంలో బహిర్భూమికి వెళ్లిన యువతి పై అత్యాచారం చేసి హత్య చేశారు. జూన్ 27న విజయవాడలో దర్శిని అనే యువతిని గడ్డం మణికంఠ అనే వ్యక్తి ప్రేమ పేరుతో వేధించి, అడ్డు చెప్పిన యువతి తండ్రిని హత్య చేశాడు. జూన్ 28న విజయవాడ మదర్సాలో కరిశ్మా అనే యువతి హత్య. జూన్ 30న బాపట్ల జిల్లా పెరవల్లి గ్రామానికి చెందిన మైనార్టీ బాలికపై అత్యాచారం. జులై 7నముచ్చుమర్రి గ్రామానికి చెందిన 8 ఏళ్ల చిన్నారిపై అత్యాచారం, హత్య జరిగింది. ఇప్పటి వరకు ఆ చిన్నారి జాడ లేదు. జులై 7న ఏర్పేడు మూలకండ్రికలో 6 ఏళ్ల బాలిక పై అత్యాచారం. పత్తిపాడు, శింగనమల, గుంటూరు బాలికలపై అత్యాచారం, హత్య. విశాఖలో డిగ్రీ చదివే యువతి పై ప్రేమోన్మాది దాడి వంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి.
విచ్చలవిడిగా డ్రగ్స్, గంజాయి:
ఏపీలో డ్రగ్స్, గంజాయి విచ్చలవిడిగా పెరిగిపోయింది. కోట్లాది రూపాయల గంజాయిని స్వాధీనం చేసుకుంటున్నా పోలీసులు అసలు అది రాష్ట్రంలోకి ఎంట్రీ కాకుండా ఆపడంలో మాత్రం విఫలమైతున్నారు. యదేచ్ఛగా కార్లలో స్మగ్లర్లు తరలిస్తున్నా పోలీసులు గుర్తించలేకపోతున్నారు. ఏదో వారికి సమాచారం ఉన్న వాటిని మాత్రమే పట్టుకొని పట్టుకున్నామని గొప్పలు చెప్పుకుంటున్నారు.రాష్ట్రంలోకి ఉన్న ఎంట్రీ పాయింట్ల వద్ద గట్టి నిఘా పెడితే ఈ డ్రగ్స్ దందాను ఆపడం పెద్ద పని కాదు. కానీ పోలీస్ వ్యవస్థ ఎందుకు అలా చేయలేకపోతుందో అర్థమవ్వడం లేదు. డ్రగ్స్, గంజాయి మత్తులోనే క్రైమ్ ను ఎక్కువ చేస్తున్నారు. యాంటీ నార్కోటిక్ సెల్ టీంలు ఉన్నా చర్యలు శూన్యంగా ఉన్నాయి.
ఏజెన్సీ ప్రాంతాల నుంచి రవాణా:
ఏపీలో ఏజెన్సీ ప్రాంతాలైన విశాఖ, శ్రీకాకుళం నుంచి ఎక్కువ గంజాయి అక్రమ రవాణా జరుగుతుంటుంది. అసలు గంజాయి రవాణా ఎక్కడి నుంచి జరుగుతుందోనన్న సమాచారం ఉన్నా పోలీసులు కట్టడి చేయలేకపోతున్నారు. గత నెల కాలంలో 18 దారుణ ఘటనలు జరిగినా ప్రభుత్వం స్పందించలేదు. నాడు జగన్ కాలంలో ఇటువంటి ఘటనలు జరిగితే చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ లు పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న వారు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనేది ప్రశ్నార్ధకంగా మారింది.
భయపెడుతున్న చెడ్డీ గ్యాంగ్:
ఇక పోతే సందట్లో సడేమియాలా దొంగలు తమ బుద్ధి చూపిస్తున్నారు. మధ్యప్రదేశ్, యూపీ, మహారాష్ట్రకు చెందిన ధార్ గ్యాంగ్, బవారీ గ్యాంగ్, చెడ్డీ గ్యాంగ్ లు ఇటీవల విచ్చలవిడిగా దోపిడీలు చేశాయి. ఏపీలో ఎక్కడో ఒక చోట ప్రతి రోజు దొంగతనాలు







మాత్రం ఆగడం లేదు. హత్యాచారాలు, కిడ్నాప్ లు, దొంగతనాలు ఇన్నీ జరుగుతున్నా శాంతి భద్రతలు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి.
స్పందన లేని ప్రభుత్వం:
కేవలం నెల రోజుల్లోనే 18 సంఘటనలు జరిగినా పోలీస్ శాఖ కనీసం ఉలుకు పలుకు లేకుండా వ్యవహరిస్తుందని ప్రతిపక్ష వైసీపీ ఆరోపిస్తోంది. మరో వైపు రాజకీయ దాడులు నిత్యకృత్యమవుతున్నా కనీసం పట్టించుకునే దిక్కు లేదు. సాక్షాత్తు రాష్ట్ర హోంశాఖ మంత్రిగా మహిళ ఉన్నా సమీక్ష చేయడం లేదన్న విమర్శలు వినవస్తున్నాయి. కేవలం కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారు. గత ప్రభుత్వంలో ఇటువంటి తప్పులు జరిగాయి. నేడు వాటిని ప్రస్తుతం అధికారంలో, నాడు ప్రతిపక్షంలో ఉన్న ఈ నేతలు ప్రశ్నించారు. ఆందోళనలు చేశారు. కానీ ప్రస్తుతం ఎందుకు పట్టించుకోవడం లేదనేది అర్థం కావడం లేదు.
కుక్కల దాడులు..
ఇంకో వైపు కుక్కల దాడులు భయంకరంగా ఉన్నాయి. కుక్కలు కూడా వీధి రౌడీల్లా తయారవుతున్నాయి. అసలు కుక్కలు దాడులకు పాల్పడడానికి కారణం ఏంటో కనుక్కోవాలి. దాడుల నివారణకు చర్యలు తీసుకోవాలి. కుక్కల దాడిలో కనీసం ఊహ తెలియని చిన్నారులు బలైన వారెందరో... బయటికి వెళ్లాలంటేనే జంకాల్సిన పరిస్థితి నెలకొంది. జంతు ప్రేమికులు మనుషులు చనిపోతుంటే ఎందుకు స్పందించరో అర్థం కాదు. ఒక కుక్కకు ఉన్న విలువ మనిషికి లేదా. వెంటనే వీధి కుక్కలను పట్టి ఒక సంరక్షణ కేంద్రంలో ఉంచాలి. మనుషుల మధ్య ఉన్న వీధి కుక్కల నుంచి రక్షణ కల్పించాలి.
అమాయకులు ఆగమైతున్నారు.
మొత్తానికి రెండు తెలుగు రాష్ట్రాల్లో క్రైమ్ రేటు పెరిగిపోయింది. పరిపాలన ద్వారా అశాంతి కట్టడి చేయాల్సిన వారు పట్టించుకునే పరిస్థితిలో లేకుండా పోయారు. ప్రశ్నించాల్సిన ప్రతిపక్షాలు ఇంకా ఓటమి బాధ నుంచి బయటపడని కారణంగా ప్రశ్నించడం లేదు. దీంతో అటు ఇటు సతమతమయ్యి ఆగమైపోతుంది ప్రజలు. ముక్కు పచ్చలారని చిన్నారులు, భావి తరపు అమ్మలు అసలు తమకెందుకు ఇలా అవుతుందో అర్థం కాక ఉన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం శాంతి భద్రతల పై ఫోకస్ పెట్టి మరొకరు బలి కాకుండా చూడాలి. నిందితులకు ఉరిశిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## సదరన్ సర్టిఫికెట్ల కోసం లబ్ధిదారుల పాట్లు

### లబ్ధిదారుల పట్ల అధికారుల నిర్లక్ష్య వైఖరి

### మంచానికే పరిమితమైన కూడా తమ ముందు రోగి హాజరు కావాల్సిందే అని హుకుం జారీ చేస్తున్న రిమ్స్ డాక్టర్లు

### ప్రభుత్వ నిర్ణయంతో ఇబ్బంది పడుతున్న పెన్షన్ లబ్ధిదారులు

కడప సూర్య వాస్తవం
గత వైసిపి ప్రభుత్వ హయాంలో వికలాంగులకు అంగవైకల్యం కలిగిన వారికోసం పెన్షన్ ఇచ్చే కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు వారి వారి ప్రాంతాలలోని ప్రభుత్వ డాక్టర్లు ఇచ్చిన సదరన్ సర్టిఫికెట్ల ఆధారంగా మరియు రాష్ట్రంలోని ఇతర





జిల్లాలలోని ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రభుత్వ డాక్టర్లు ఇచ్చిన సదరన్ సర్టిఫికెట్ల ఆధారంగా చేసుకుని లబ్ధిదారులకు పెన్షన్ ఇచ్చేవారని కానీ ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం అర్హులు కాని వారికి పెన్షన్ ఇవ్వకూడదు అన్న నెపంతో గత ప్రభుత్వ హయాంలో స్థానిక జిల్లాలోని డాక్టర్ల నుంచి కాకుండా ఇతర జిల్లాల నుండి సదరన్ సర్టిఫికెట్లు పొందిన లబ్ధిదారులను మళ్లీ వారు ఆయా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి మాత్రమే సదరం సర్టిఫికెట్లు పొందితేనే పెన్షన్ కు అర్హులని లేకుంటే పెన్షన్ ఇవ్వడం కుదరదని చెప్పడంతో అంగవైకల్యం కలిగిన పెన్షన్ లబ్ధిదారుల కష్టాలు మొదలయ్యాయి అని నిస్సహాయత వ్యక్తపరుస్తున్నారు. సదరన్ సర్టిఫికెట్లు పొందిన వారిలో చాలామంది నడవలేని స్థితిలో ఉన్నవారు మరియు మంచానికే పరిమితమై ఉన్నవారు కూడా చాలామంది ఉన్నారు.
కడప రిమ్స్ ఆసుపత్రిలో సదరన్ సర్టిఫికెట్లు ఇచ్చే డాక్టర్లు మాత్రం లబ్ధిదారులు నడవలేని స్థితిలో ఉన్న మంచానికే పరిమితమైన కూడా తమకు సంబంధం లేదని వారిని ఆసుపత్రికి తీసుకొని వచ్చి తమ కళ్ళ ఎదుట హాజరు పరిస్తేనే సదరన్ సర్టిఫికెట్లు ఇస్తామని కరాకండిగా చెబుతూ ఉండటంతో లబ్ధిదారులు వారి కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు లబ్ధిదారులు నడవలేని స్థితిలో మంచానికే పరిమితమై ఉన్నారని అటువంటి వారిని వివిధ గ్రామాల నుండి రిమ్స్ ఆసుపత్రికి తీసుకొని రావడం ఖర్చుతో కూడిన పని అని మరియు మంచానికి పరిమితమైన వృద్ధులను రోగులను వాహనంలో జిల్లా ఆసుపత్రికి తీసుకురావడం వల్ల రోగి పరిస్థితి విషమించే ప్రమాదం ఉందని చాలామంది ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెన్షన్ లబ్ధిదారుడు నడవలేని స్థితిలో మంచానికే పరిమితమై ఉన్నాడని నమ్మకుంటే వీడియో కాల్స్ ద్వారా అయినా చూసి డాక్టరు సదరన్ సర్టిఫికెట్లు మంజూరు చేయమని లబ్ధిదారుల కుటుంబ సభ్యులు డాక్టర్లను వేడుకున్నా కూడా డాక్టర్లు రోగి కుటుంబ సభ్యులతో నిర్లక్ష్యంగా మాట్లాడుతూ లబ్ధిదారులను తమ వద్దకు తీసుకొని వచ్చి లబ్ధిదారులను తమకు చూపించకుంటే పెన్షన్ ని కూడా వదులుకోవాలని కరాకండిగా చెబుతున్నారని లబ్ధిదారుల కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ డాక్టర్లు మంజూరు చేసిన సదరన్ సర్టిఫికెట్లు ప్రభుత్వం మారిన వెంటనే అప్పుడు ప్రభుత్వ డాక్టర్లు మంజూరు చేసిన సర్టిఫికెట్లు నకిలీవి అని ప్రస్తుతం అవి చెల్లవని ప్రభుత్వం చెప్పడం ఏంటని ప్రజలు వాపోతున్నారు.
పార్టీలకు పార్టీలకు మధ్య ఏవైనా సమస్యలు ఉంటే అవి వారు వారు చూసుకోవాలి గాని ఇలా మధ్యలో ప్రజలను ఇబ్బంది పెట్టడం ఏంటని ప్రజలు బాహాటంగానే చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం అనారోగ్యంతో అంగవైకల్యంతో ఇబ్బంది పడుతూ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు వచ్చి సదరన్ సర్టిఫికెట్ పొందలేని లబ్ధిదారులు ఎవరైనా ఉంటే అలాంటి వారి ఇంటి వద్దకే ప్రభుత్వ ఆరోగ్య అధికారి గాని లేక ప్రభుత్వ డాక్టర్ గాని వచ్చి పరీక్షించి సదరం సర్టిఫికెట్ మంజూరు చేస్తే బాగుంటుందని అలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## నేటి నుంచి కుప్పంలో చంద్రబాబు సతీమణి భువనేశ్వరి నాలుగు రోజుల పర్యటన

### భువనమ్మ నాలుగు రోజుల పర్యటనకు ఏర్పాట్లను సిద్ధం చేసిన టిడిపి నేతలు

కుప్పం జూలై 22 సూర్య వాస్తవం
నేటి నుండి కుప్పంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి కుప్పం నియోజకవర్గం లో పర్యటించనున్నారు.ఈ సందర్భంగా ఆమె కుప్పంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు.అలాగేకుప్పం నియోజకవర్గంలోని రెండు గ్రామాలను ఆమె దత్తత తీసుకోనున్నారు.తొలిరోజునియోజకవర్గ మహిళలతో "మన కోసం %-% మన భువనమ్మ" పేరుతో సమావేశం కానున్నారు. నియోజకవర్గంలోని మారుమూల తండాలకు కూడా వెళ్లి అక్కడి మహిళలతో ఆమె మాట్లాడనున్నారు. నియోజకవర్గ మహిళలకు కుట్టు మిషన్లను ఆమె చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్లు ఆ పార్టీ నేతలు తెలిపారు.కుప్పంలో నిరుద్యోగుల కోసంస్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను భువనమ్మ ప్రారంభించనున్నారు 2024 ఎన్నికల ముందు నిజం గెలవాలి కార్యక్రమాలతో పాటు ఎన్నికల ప్రచారం కూడా నారా భువనేశ్వరి నిర్వహించారు.చంద్రబాబు తరపున మొట్టమొదటిసారి 2024 ఎన్నికల్లో నామినేషన్ దాఖలు చేసేందుకు కుప్పంకు వచ్చారు. 2024 ఎన్నికల్లో ఉమ్మడి కుటుంబంతో జత కలిసిన అనంతరం భారీ మెజార్టీ సీట్లు ఆ పార్టీ సాధించింది దీంతో చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన అనంతరం కుప్పం నియోజకవర్గానికి భువనేశ్వరి తొలిసారి కుప్పంకురానున్నారు. భువనేశ్వరి కార్యక్రమాలకు సంబంధించిన ఏర్పాట్లను కుప్పం నియోజకవర్గ టీడీపీ నేతలు ఇప్పటికే సంసిద్ధం చేశారు.
ముఖ్యమంత్రి సతీమణి నారా భువనేశ్వరి కుప్పం టూర్ షెడ్యూల్ ఇదే
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి నాలుగు రోజులపాటు కుప్పంలో పర్యటించనున్నారు. ఈ మేరకు తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఆమె పర్యటన షెడ్యూల్ ను విడుదల



చేసింది.
23 న ఉదయం08:35
– హైదరాబాద్ నుండి బెంగళూరుకు బయలుదేరి 9:45 గంటలకు
– బెంగళూరు విమానాశ్రయానికి చేరుకుంటారు.
10:00 గంటలకు బెంగళూరు విమానాశ్రయం నుండి కుప్పం రోడ్డు మార్గం ద్వారా ప్రయాణిస్తారు.
మధ్యాహ్నం 12:15
గంటలకు గుడుపల్లి మండలం, కమ్మగుట్టపల్లికి చేరుకుంటారు.
అక్కడ 12:15 గంటలనుండి 01:00 గంట వరకు నియోజకవర్గ తెదేపా నాయకులు, కార్యకర్తలు భువనమ్మకు స్వాగతం పలుకుతారు.
01:00 నుండి 02:00 గంటలకు కమ్మగుట్టపల్లి గ్రామ మహిళలతో సమావేశం కార్యక్రమంలో ఆమె పాల్గొంటారు.
మధ్యాహ్నం 02:00 – 02:15 గంటలకు కంచిబందార్లపల్లి గ్రామానికి వెళతారు.(ఈ గ్రామాన్ని భువనేశ్వరి దత్తత తీసుకోనున్నారు.)
02:15 గంటలనుండి 03:15 గంటలకు కంచిబందార్లపల్లి గ్రామ మహిళలతో సమావేశం కార్యక్రమంలో పాల్గొంటారు.అనంతరం
03:15 గంటలనుండి 03:30 గంటలకు గుత్తార్లపల్లి గ్రామానికి వెళతారు.
03:30 గంటల నుంచి 04:30 వరకు గుత్తార్లపల్లి గ్రామ మహిళలతో సమావేశ కార్యక్రమంలో పాల్గొంటారు.
04:30 నుంచి 04:45 – వరకు కోటిపల్లి గ్రామానికి వెళతారు.
04:45 నుండి 05:45 వరకు కోటిపల్లి గ్రామ మహిళలతో సమావేశం కార్యక్రమంలో పాల్గొంటారు.
05:45 నుండి 06:00 గంటలకు కుప్పం పీఈఎస్ గెస్ట్ హౌస్ కు చేరుకుంటారు.

## స్టీల్ ప్లాంట్ సాధనే ధ్యేయంగా స్టీల్ ప్లాంట్ యునైటెడ్ ఫోరం ఆవిర్భావం

ప్రొద్దుటూరు, (సూర్య వాస్తవం):
కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్ సాధనే ధ్యేయంగా స్టీల్ ప్లాంట్ యునైటెడ్ ఫోరం ఆవిర్భవించిందని స్టీల్ ప్లాంట్ యునైటెడ్ ఫోరం కన్వీనర్ ఖలందర్ తెలిపారు. సోమవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ విభజన బిల్లులో పేర్కొన్న ప్రధానమైన అంశాలలో మనకు అత్యంత ప్రధానమైనది స్టీల్ ప్లాంట్, అలాగే మరో ప్రధానమైన అంశం స్పెషల్ స్టేటస్, ఈ రెండు అంశాలను టిడిపి మేనిఫెస్టోలో చేర్చలేదన్నారు. అలాగే కూటమి అధికారంలోకి వచ్చాక కేంద్ర ప్రభుత్వ ఏర్పాటు విషయంలో చంద్రబాబు నాయుడు అత్యంత కీలకమైన సందర్భంలోనూ ప్రధాన డిమాండ్లుగా ఈ రెండు అంశాలను వారి ఎదుట పెట్టలేదన్నారు. మొదటినుంచి ఆయన రాజధాని అమరావతి పోలవరం అనే మంత్రాలనే జపిస్తూ వస్తున్నాడని, వీటివల్ల రాయలసీమ ప్రాంతానికి కడప జిల్లాకు ఒరిగిందేమీ లేదన్నారు. కడప ఉక్కు హక్కు విషయమై గతంలో అన్ని విపక్షాలతో పాటు టిడిపి కూడా గెలిమెత్తిందని, ఏకంగా కడపలో నిరాహార దీక్షలు కూడా చేయించిందని వివరించారు. సీఎం రమేష్ బీటెక్ రవి చురుగ్గా ఆమరా నిరాహార దీక్షలో పాల్గొన్నారని గుర్తు చేశారు.




# ఆగస్ట్‌లో ముగ్గురు హీరోల సందడి

## మూడు ప్రధాన సినిమాల విడుదల

వచ్చే ఆగస్టు 15వ తేదీ వస్తోంది అంటే సినిమా ప్రియులకి మంచి శుభవార్త. ఆరోజు ముగ్గురు కథానాయకులు తమ సినిమాలతో పోటీ పడుతున్నారు. అందులో ఇద్దరు సీనియర్ నటులు కాగా, ఒకరు యువ నటుడు వున్నారు. రామ్ పోతినేని, పూరి జగన్ కాంబినేషన్ లో వస్తున్న 'డబుల్ ఇస్మార్ట్' ఆగస్టు 15న విడుదలవుతోంది. ఈ సినిమా ఇంతకు ముందు వీరిద్దరి కాంబినేషన్ లో విజయవంతంగా వచ్చిన 'ఇస్మార్ట్ శంకర్' కి సీక్వెల్ గా వస్తోంది. కావ్య థాపర్ కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ విలన్‌గా నటిస్తున్నారు. పూరి జగన్, ఛార్మి ఈ సినిమాకి నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. పూరి జగన్ ఇంతకు ముందు విజయ్ దేవరకొండతో తీసిన 'లైగర్' బాక్స్ ఆఫీస్ దగ్గర ఒక డిజాస్టర్ గా నిలిచిన సంగతి తెలిసిందే. అందుకనే ఈ సినిమాపై ఎక్కువ ఆశలు పెట్టుకున్నారు. ఇక రెండో సినిమా రవి తేజ, దర్శకుడు హరీష్ శంకర్ ల కాంబినేషన్ లో వస్తున్న 'మిస్టర్ బచ్చన్'. ఇది హిందీ సినిమా 'రైడ్' కి రీమేక్ గా వస్తోంది. రాజ్ కుమార్ గుప్త దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అజయ్ దేవగన్ కథానాయకుడు, ఇలియానా కథానాయికగా నటించింది. ఇన్కమ్ టాక్స్ రైడ్ నేపథ్యంలో వచ్చిన ఈ సినిమాని దర్శకుడు హరీష్ శంకర్ 'మిస్టర్ బచ్చన్' పేరుతో రీమేక్ చేశారు. సౌరబ్ శుక్ల నటించిన పాత్ర తెలుగులో జగపతి బాబు పోషిస్తున్నారని అంటున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయకురాలు. ఈ సినిమా ఆగస్టు 15న విడుదలవుతుందని అధికారికంగా ప్రకటించారు. రవి తేజ ముందు సినిమాలు 'ఈగల్', 'టైగర్ నాగేశ్వర రావు' సినిమాలు బాక్స్ ఆఫీస్ ముందు బోల్తా పడ్డాయి. ఇప్పుడు ఈ 'మిస్టర్ బచ్చన్' బాక్స్ ఆఫీస్ ముందు ఎలా ఉంటుందో చూడాలి. ఇప్పటికే ఈ సినిమా నుండి ఒక పాటని విడుదల చేశారు, అది మంచి ప్రజాదరణ పొందింది. ఇంకో సినిమా తమిళ నటుడు విక్రమ్ నటించిన 'తంగలాన్'. పా. రంజిత్ దీనికి దర్శకుడు, ప్రముఖ నిర్మాణ సంస్థ స్టూడియో గ్రీన్ ఈ సినిమాని పెద్ద బ్జడెట్ పెట్టి నిర్మిస్తోంది. కెఈ జ్ఞానవేల్ రాజా నిర్మాత. ఈ సినిమా కూడా ఆగస్టు 15న విడుదలవుతోంది. ఈ సినిమా అటు తమిళం, తెలుగు భాషలతో పాటుగా మిగతా అన్ని భాషల్లో కూడా విడుదలవుతోంది. విక్రమ్ ఇందులో మూడు వైవిధ్యమైన పాత్రలలో కనిపించి మెప్పిస్తారు అని అంటున్నారు. ఈ సినిమా ఒక పీరియాడిక్ డ్రామాగా తెరకెక్కనుంది. ఇంతకు ముందు వచ్చిన 'కేజీఎఫ్' సినిమాకి ప్రీక్వెల్ గా ఈ సినిమా ఉండొచ్చు అని కూడా అంటున్నారు. మాళవిక మోహనన్ ఇందులో ఇంకో ముఖ్య పాత్రలో కనిపించనున్నారు. ఇలా మూడు సినిమాలతో ముగ్గురు కథానాయకులు ఈ ఆగస్టు 15వ తేదీన వస్తున్నారు. ఆ తేదీ నుండి వరసగా సెలవులు కలిసి రావటం ఈ సినిమాలకి బాగా కలసి వస్తుందని కూడా అంటున్నారు. ఈ మూడు సినిమాలతో పాటు చిన్న సినిమా '35: చిన్న కథ కాదు' అనే సినిమా కూడా ఆగస్టు 15న విడుదలవుతోంది. ప్రముఖ నటుడు రానా దగ్గుబాటి ఈ సినిమాకి సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. ఈమని నందకిషోర్ దర్శకుడు, కాగా నివేద థామస్, విశ్వదేవ్ రాచకొండ, ప్రియదర్శి ఇందులో ప్రధాన తారాగణం.





# సోషల్ మీడియా విమర్శలు పట్టించుకోవాల్సిన పనిలేదన్న జాన్వీ


ఇటీవల అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన జాన్వీకపూర్ కోలుకుని ఇంటికి చేరుకుని.. రెండ్రోజుల్లోనే మళ్లీ యాక్టివ్ అయ్యాక వరుస ప్రమోషన్లో పాల్గొంటున్నారు. తన తదుపరి చిత్రం 'ఉలర్ఘ్' చిత్రం విడుదల నేపథ్యంలో ఆమె వరుస ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. ఆదివారం ఇచ్చిన ఇంటర్వ్యూలో సోషల్‌మీడియా ట్రోల్స్‌ను ఉద్దేశించి మాట్లాడారు. ఆన్‌లైన్ వేదికగా స్టార్‌కిడ్స్ ఎదుర్కొంటున్న విమర్శలపై ఆమె ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'సోషల్ మీడియాలో వచ్చే విమర్శలను సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదు. అసలు వాటిని పట్టించుకోవడం కూడా వృథా. ఎందుకంటే, సోషల్‌మీడియా కల్చర్ అది. నువ్వు పబ్లిక్ ఫిగర్ అయినా, కాకపోయినా ఇలాంటివి నిరంతరం జరుగుతూనే ఉంటాయి. కాబట్టి ఆ కామెంట్స్‌కు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం లేదు. ఒక విషయంలో ఈరోజు పొగిడినవాళ్లే అదే విషయంపై రేపు తిడతారు. ముక్కూ, మొఖం తెలియని వాళ్లు ఏదో అన్నారని ఇంట్లో కూర్చొని ఏడవడం దేనికి?. మనకు మనమే ప్రాధాన్యం ఇచ్చుకోవాలి' అని అన్నారు. అనంతరం అనంత్ అంబానీ సతీమణి రాధిక మర్చంట్ కోసం పార్టీ ఇవ్వడంపైజాన్వీ మాట్లాడారు. 'రాధిక నాకు మంచి ఫ్రెండ్. తను మాతో చాలా సరదాగా ఉంటుంది. మమ్మల్ని జాగ్రత్తగా చూసుకుంటుంది. అందుకే, వివాహానికి ముందు ఆమె కోసం ప్రత్యేకంగా ఒక పార్టీ ఏర్పాటుచేయాలని ఫ్రెండ్స్ అందరం అనుకున్నాం. అందులో భాగంగా గ్రాండ్ పార్టీ ఇచ్చాం. తను చాలా సంతోషించింది' అని చెప్పారు. 'ఉలర్ఘ్' విషయానికి వస్తే.. జాతీయ అవార్డు గ్రహీత సుధాంశు సరియా తెరకెక్కించారు. జంగ్లీ పిక్చర్స్ సంస్థ నిర్మించింది. జాన్వీ ఇందులో ఇండియన్ ఫారిన్ సర్వీస్ అధికారిణిగా కనిపించనుంది. ఈ పొలిటికల్ థ్రిల్లర్‌లో గుల్షన్ దేవయ్య, రాజేశ్ థైలాంగ్ ముఖ్య పాత్రలు పోషించారు.



# ఆసక్తి రేకెత్తిస్తున్న రాజమౌళి..మోడ్రన్ మాస్టర్స్

## అతనో లెజెండ్ అంటూ చిత్ర ప్రముఖుల కామెంట్స్

టాలీవుడ్ అగ్ర దర్శకుడు రాజమౌళిపై ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ 'మోడ్రన్ మాస్టర్స్' పేరుతో డాక్యుమెంటరీ రూపొందించింది. ఇందులో ఆయన సినీ ప్రయాణాన్ని చూపించనున్నారు. ఆగస్టు 2 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఇది స్ట్రీమింగ్ కానుంది. తాజాగా దీనికి సంబంధించిన ట్రైలర్‌ను విడుదల చేయగా అది అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. అందులో టాలీవుడ్, బాలీవుడ్, హాలీవుడ్ సినీ ప్రముఖులు రాజమౌళిపై వారి అభిప్రాయాలను పంచుకున్నారు. ఎన్టీఆర్, రామ్‌చరణ్, ప్రభాస్‌లతోపాటు హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామెరూన్, బాలీవుడ్ దర్శకనిర్మాత కరణ్ జోహార్‌లు కూడా వారి అభిప్రాయాన్ని తెలియజేశారు. ఇలాంటి దర్శకుడిని నేను ఇప్పటివరకు చూడలేదు. సినిమాలంటే ఆయనకు పిచ్చి ప్రేమ అని ప్రభాస్ తన అబిప్రయాం పంచుకున్నారు. ఆయన సినిమాల్లో నన్ను నేను చూసుకొని ఎంతో ఆశ్చర్యపోతానని నటుడు రామ్‌చరణ్ ప్రకటించారు. ఇప్పటివరకు ఎవరూ చూపించని కథలను ప్రపంచానికి చెప్పడం కోసమే రాజమౌళి జన్మించారని మరో నటుడు ఎన్టీఆర్ అన్నారు. ఈ ఇద్దరు కూడ ఆరాజమౌళి ట్రిపుల్ ఆర్‌లో మంచి నటనను చాటారు. రాజమౌళికి సాధ్యం కానిది ఏదీ లేదు. ఎవరితోనైనా పని చేయగలరు. ఆయనంటే నాకెంతో గౌరవం అంటూ ఆంగ్ల చిత్రాల దర్శకుడు జేమ్స్ కామెరూన్ వ్యాఖ్యానించారు. రాజమౌళితో పని చేసిన వారందరూ ఆయన్ని పని రాక్షసుడని పిలుస్తుంటారని ఆయన భార్య, ప్రముఖ క్యాస్టూమ్స్ డిజైనర్ రమా రాజమౌళి అభిప్రాయపడ్డారు. దర్శకుడు రాజమౌళి ఓ లెజెండ్ అని హిందీ దర్శక సమర్పకుడు కరణ్ జోహార్ అన్నారు.








# అందుకే శుభ్‌మన్ గిల్‌కు వైస్ కెప్టెన్సీ ఇచ్చాం

మూడు ఫార్మాట్లలో ఆడగలిగే సామర్థ్యం ఉండటంతోనే టీమిండియా యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్‌కు వైస్ కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించామని చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ అన్నాడు. టీమిండియా టీ20 కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్‌ను నియమించిన భారత సెలక్షన్ కమిటీ.. వైస్ కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్‌ను ఎంపిక చేసిన విషయం తెలిసిందే. టీ20 ప్రపంచకప్ 2024లో రోహిత్ శర్మకు డిప్యూటీగా వ్యవహరించిన హార్దిక్ పాండ్యాను సెలెక్టర్లు సారథ్య బాధ్యతల నుంచి పూర్తిగా తప్పించారు. అతని ఫిట్‌నెస్ సమస్యల నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నామని అగార్కర్‌తో పాటు నయా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తెలిపాడు. శ్రీలంక పర్యటనకు వెళ్లే ముందు సోమవారం ఈ ఇద్దరూ మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ పర్యటనకు ఎంపిక చేసిన టీ20, వన్డే జట్లుకు సంబంధించిన వివరాలతో పాటు, భవిష్యత్తు ప్రణాళికలపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు గంభీర్, అగార్కర్ ఓపికగా సమాధానాలు ఇచ్చారు. ఈ క్రమంలోనే శుభ్‌మన్ గిల్‌ను వైస్ కెప్టెన్సీ చేయడం వెనుక ఉన్న కారణాన్ని అజిత్ అగార్కర్ వెల్లడించాడు. 'మూడు ఫార్మాట్లు ఆడే సామర్థ్యం శుభ్‌మన్ గిల్‌కు ఉందని మేం భావించాం. గతేడాదిగా అతను నిలకడగా రాణిస్తున్నాడు. దాంతోనే అతన్ని భవిష్యత్తు సారథిగా తీర్చిదిద్దాలని మేం భావించాం. సీనియర్ల నుంచి పాఠాలు నేర్చుకునేలా వైస్ కెప్టెన్సీ అవకాశం ఇచ్చాం. సూర్య, రోహిత్‌లకు డిప్యూటీగా శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీ పాఠాలు నేర్చుకుంటాడు. కెప్టెన్ గాయపడినా.. ఫామ్ కోల్పోయినా.. ఆకస్మాత్తుగా కొత్త కెప్టెన్‌ను ఎంపిక చేసే సవాల్‌ను మళ్లీ ఎదుర్కోవద్దనే ఈ నిర్ణయం తీసుకున్నాం. ఇప్పటికే శుభ్‌మన్ గిల్ తన సారథ్య ప్రతిభను చాటుకున్నాడు. దాంతోనే అతనికి కొంత అనుభవం కావాలని భావించాం. జీవితంలో ఎలాంటి గ్యారంటీలు ఉ ఒడవు. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో అతనే సరైనోడనిపించింది.'అని అజిత్ అగార్కర్ చెప్పుకొచ్చాడు. శుభ్‌మన్ గిల్‌కు కెప్టెన్‌గా.. వైస్ కెప్టెన్‌గా జట్టును నడిపించిన అనుభవం ఉంది. భారత్ గెలిచిన 2018 అండర్ 19 ప్రపంచకప్‌లో పృథ్వీ షాకు శు భ్‌మన్ గిల్ డిప్యూటీగా వ్యవహరించాడు. దేశవాళీ క్రికెట్‌లోనే కెప్టెన్సీ చేశాడు. డియోధర్ ట్రోఫీలోనూ ఓ జట్టుకు సారథ్యం వహించాడు. ఇటీవల జింబాబ్వే పర్యటనలో టీమిండియాను అద్భుతంగా నడిపించి 4-1తో సిరీస్ గెలిచాడు. టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించిన రోహిత్ శర్మ.. వన్డే, టెస్ట్‌ల్లో కెప్టెన్‌గా కొనసాగనున్నాడు. సూర్యకుమార్ యాదవ్ టీ20ల్లో టీమిండియాను నడిపించనున్నాడు. సూర్య.. టీ20లు మాత్రమే ఆడుతాడని అగార్కర్ స్పష్టం చేశాడు. సూర్య ఇప్పటికే 7 మ్యాచ్‌ల్లో జట్టును నడిపించి 5 విజయాలు అందించాడు.

# పంత్ రికార్డ్ బద్దలు కొట్టిన రిచా ఘోష్!

టీమిండియా మహిళా బ్యాటర్, వికెట్ కీపర్ రిచా ఘోష్ చరిత్ర సృష్టించింది. అంతర్జాతీయ టీ20ల్లో భారత్ తరపున అత్యంత పిన్న వయసులో హాఫ్ సెంచరీ నమోదు చేసిన వికెట్ కీపర్‌గా రికార్డ్ నమోదు చేసింది. మహిళల ఆసియా కప్ 2024లో భాగంగా ఆదివారం యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో ఫిఫ్టీ చేయడంతో రిచా ఈ ఘనత అందుకుంది. యూఏఈపై రిచా 29 బంతుల్లో 12 ఫోర్లు, 1 సిక్స్‌తో 64 పరుగులు చేసి అజేయంగా నిలిచింది. రిచా ఘోష్ 20 ఏళ్ల 297 రోజుల వయసులో అంతర్జాతీయ టీ20 హాఫ్ సెంచరీ నమోదు చేసింది. దాంతో టీమిండియా వికెట్ కీపర్ రిషబ్ పంత్ రికార్డును బద్దలు కొట్టింది. పంత్ 21 ఏళ్ల 206 రోజుల వయసులో టీ20 హాఫ్ సెంచరీ సాధించాడు. 2019లో వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో పంత్ ఈ ఘనతను అందుకున్నాడు. అంతేకాదు మహిళల ఆసియా కప్ చరిత్రలో హాఫ్ సెంచరీ సాధించిన తొలి వికెట్ కీపగా రికార్డుల్లో నిలిచింది. రిచా ఇప్పటివరకు 2 టెస్టులు, 23 వన్డేలు, 52 టీ20లు భారత్ తరపున ఆడింది. టీ20ల్లో ఇదే మొదటి ఫిఫ్టీ కావడం విశేషం. రిచా ఘోష్ విధ్వంసకర హాఫ్ సెంచరీతో భారత్ భారీ స్కోర్ చేసింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్స్ కోల్పోయి 201 పరుగుల భారీ స్కోర్ చేసింది. రిచా సహా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (66) హాఫ్ సెంచరీ చేసింది. టీ20 క్రికెట్‌లో భారత మహిళల జట్టుకు ఇదే అత్యధిక స్కోర్. చేధనలో యూఏఈ 7 వికెట్ల నష్టానికి 123 పరుగులు చేసి 78 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. కవిషా (40 నాటౌట్) టాప్ స్కోరర్.





# టీమిండియా తాత్కాలిక బౌలింగ్ కోచ్‌గా సాయిరాజ్ బహుతులే

శ్రీలంకతో మూడు వన్డేలు, మూడు టీ20లు ఆడేందుకు భారత్ జట్టు నేడు అక్కడికి బయల్దేరనుంది. జూన్ 27 నుంచి టీ20 సిరీస్, ఆగష్టు 2 నుంచి వన్డే సిరీస్ ఆరంభం కానుంది. ఈ పర్యటనలో టీమిండియా హెడ్ కోచ్‌గా గౌతమ్ గంభీర్ బాధ్యతలు తీసుకోనున్నాడు. అయితే హెడ్ కోచ్‌గా గౌతమ్ ఎంపికయినా.. సహాయక సిబ్బంది ఎవరనే ఉత్కంఠ ఇంకా కొనసాగుతోంది. గౌతీ సిఫార్సు చేసిన జాబితాలో కొందరికి బీసీసీఐ గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా.. మరికొందరిని మాత్రం అంగీకరించట్లేదు. త్వరలోనే దీనిపై క్లారిటీ రానుంది. టీమిండియా అసిస్టెంట్ కోచ్‌లుగా అభిషేక్ నాయర్, ర్యాన్ టెన్ డస్కాటెల ఎంపిక దాదాపు ఖాయమైందని తెలుస్తోంది. బౌలింగ్ కోచ్ నియామకం మాత్రం ఇంకా పూర్తి కాలేదు. బౌలింగ్ కోచ్ రేసులో భారత మాజీ పేసర్లు ఆర్ వినయ్ కుమార్, లక్ష్మీపతి బాలాజీలతో పాటు దక్షిణాఫ్రికా దిగ్గజం మోర్నీ మోర్కెల్ రేసులో ఉన్నారు. గంభీర్ మాత్రం మోర్నీనే కావాలని బీసీసీఐతో చెప్పాడట. బౌలింగ్ కోచ్ విషయంలో భారత మాజీ క్రికెటర్లనే ఎంపిక చేయాలని బీసీసీఐ భావించినా.. గౌతీ మాత్రం మోర్నీనే కావాలంటున్నాడట. దాంతో శ్రీలంక టూర్ కోసం తాత్కాలిక బౌలింగ్ కోచ్‌గా సాయిరాజ్ బహుతులేని బీసీసీఐ నియమించింది. ఇంతకీ ఎవరీ బహుతులే అని నెటిజన్స్ నెట్టింట ఆరా తీస్తున్నారు.భారత్ తరఫున సాయిరాజ్ బహుతులే 2 టెస్టులు, 8 వన్డేలు ఆడారు. 1997లో భారత్ తరఫున అరంగేట్రం చేసిన బహుతులే.. రెండు ఫార్మాట్‌లలో కలిపి 5 వికెట్లు పడగొట్టి, 62 రన్స్ చేశారు. లెగ్ స్పిన్నర్ అయిన బహుతులేకు కోచ్‌గా మంచి అనుభవం ఉంది. 2014లో కేరళ క్రికెట్ జట్టుకు, 2015లో బెంగాల్ క్రికెట్ జట్టుకు కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. 2018 ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్‌కు స్పిన్ బౌలింగ్ కోచ్‌గా ఉన్నారు. ప్రస్తుతం బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో ఆయన సేవలు అందిస్తున్నారు. శ్రీలంక పర్యటన అనంతరం బహుతులే తిరిగి ఎన్‌సీఏకు చేరనున్నారు. లంక పర్యటన లోగా బీసీసీఐ సహాయక సిబ్బంది ఎంపిక పూర్తవుతుంది.

# జో రూట్, సచిన్ టెస్టు స్కోరును అధిగమిస్తాడు

టెస్టు క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా సచిన్ టెండ్యూలర్ ఉన్న విషయం తెలిసిందే. 200 టెస్టుల్లో 15921 పరుగులు చేశాడు. సచిన్ దరిదాపుల్లో కూడా ఎవరూ లేరు. ప్రస్తుత క్రికెటర్లలో ఇంగ్లండ్ బ్యాటర్ జో రూట్ మాత్రమే కాస్త దగ్గరగా ఉన్నాడు. ఇప్పటివరకు 142 టెస్టులు ఆడిన రూట్.. 11,940 పరుగులు చేశాడు. తాజాగా విండీస్‌పై రెండో టెస్టులో రూట్ సెంచరీ బాదాడు. దీంతో భవిష్యత్తులో సచిన్ రికార్డును అధిగమించే సత్తా రూట్‌కు మాత్రమే ఉందని ఇంగ్లీష్ మాజీ కెప్టెన్, కామెంటెటర్ మైకెల్ వాన్ అన్నాడు. విరాట్ కోహ్లీ, కేన్ విలియమ్సన్ వల్ల కాదని వ్యాఖ్యానించాడు. 'రాబోయే కొన్ని నెలల్లో ఇంగ్లండ్ తరఫున అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా జో రూట్ నిలుస్తాడు. అలెస్టర్ కుక్ (12,472) కంటే కొద్దిలోనే వెనుక ఉన్నాడు. భవిష్యత్తులో సచిన్ టెండూల్కర్ రికార్డునూ అధిగమిస్తాడు. రూట్ గతంలో మాదిరిగా ఆచితూచి ఆడటం లేదు. దూకుడుగానే రన్స్ చేస్తున్నాడు. రూట్ నాణ్యమైన క్రికెట్ ఆడుతున్నాడు' అని టెలిగ్రాఫ్ కాలమ్‌లో మైకెల్ వాన్ రాసుకొచ్చాడు. వెస్టిండీస్‌పై రెండో టెస్టులో ఇంగ్లీష్ జట్టు 241 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. 384 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన విండీస్ 143 పరుగులకే ఆలౌటైంది.



# హాకీ జట్టు గోల్‌కీపర్, మాజీ కెప్టెన్ పీఆర్ శ్రీజేశ్ సంచలన నిర్ణయం

భారత పురుషుల హాకీ జట్టు గోల్‌కీపర్, మాజీ కెప్టెన్ పీఆర్ శ్రీజేశ్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. అప్‌కమింగ్ పారిస్ ఒలింపిక్స్ 2024 తర్వాత అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు ప్రకటించాడు. ఇప్పటికే మూడు సార్లు ఒలింపిక్స్ బరిలో నిలిచిన శ్రీజేశ్.. పారిస్ ఒలింపిక్స్‌లో మెరుగైన ప్రదర్శన చేసి కెరీర్‌కు గుడ్‌బై చెప్పాలనుకుంటున్నాడు. 'పారిస్ ఒలింపిక్స్‌తో నా కెరీర్‌కు వీడ్కోలు పలికేందుకు సిద్ధమయ్యా. ఒలింపిక్స్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నా. నా కెరీర్‌కు అండగా నిలిచిన నా కుటుంబ సభ్యులు, సహచరులు, కోచ్‌లు, భారత హాకీ జట్టు అభిమానులకు ప్రత్యేక ధన్యవాదాలు. నాపై విశ్వాసం ఉంచిన అందరికీ కృతజ్ఞతలు. నా సహచర ఆటగాళ్లు బాధ, సంతోష సమయాల్లో పక్కనే ఉన్నారు. మేమందరం పారిస్ ఒలింపిక్స్‌లో అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చేందుకు ప్రయత్నిస్తాం. కచ్చితంగా మా పతకం రంగును మార్చాలనే లక్ష్యంతో ఉ న్నాం.

'అని పీఆర్ శ్రీజేశ్ పేర్కొన్నాడు. 2010 హాకీ ప్రపంచకప్‌తో కెరీర్ ప్రారంభించిన 36 ఏళ్ల శ్రీజేశ్.. ఇప్పటి వరకు 328 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడి భారత్ సాధించిన ఎన్నో చిరస్మరణీయ విజయాల్లో భాగమయ్యాడు. టోక్యో ఒలింపిక్స్‌లో భారత పురుషుల హాకీ టీమ్ బ్రాంజ్ మెడల్ గెలిచిన విషయం తెలిసిందే. ఈ కాంస్య పతకం గెలవడంలో శ్రీజేశ్ కీలక పాత్ర పోషించాడు. గోల్ పోస్ట్‌కు హీరోలా అడ్డుగా నిలిచి అనేక గోల్స్ ఆపాడు. జూలై 26 నుంచి ఆగస్ట్ 11 వరకు పారిస్ ఒలింపిక్స్ జరగనుండగా.. భారత్ హాకీ టీమ్ తొలి మ్యాచ్‌ను న్యూజిలాండ్‌తో జూలై 27న ఆడనుంది. అర్జెంటీనాతో జూలై 29న, బెల్జియంతో ఆగస్ట్ 1న, ఆస్ట్రేలియాతో ఆగస్ట్ 2న తలపడనుంది.



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG,ON BEHALF OF IRS PUBLICATIONS.13-2-819-2 RAMBOW RESIDENCE,RTC BUS STAND ROAD. SRINIVASA NAGAR ANANTAPUR,ANDHRA PRADESH-515001. GSTIN:37AAJF15233N1ZY.TEL:7672042522.VIJ ADDRESS:SHEETAL APARTMENT,TF2 DR NO:39-2-15/IE VIJAYAWADA-10.CHIEF EDITOR MD. SHAFEE AHAMED, MOB NO:9948461699.-EDITOR-M.IRSHAD BAIG.CELL: 918500425222 (FOUNDER- N.ARIF ALI).